₹20

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక

జూలై - 2016

DECCAN LAND, HYDERABAD

47



- వట్టిపోతున్న చారిత్రక సంపద
- హైకోర్టు విభజన ఏనాటికో
- సినిమా @ తెలంగాణ
- గుట్టల్ని కాపాడుకుందాం





*Artist:* **Chippa Sudhakar**

చిత్రకారుడు తన పరిణతి చెందిన వ్యక్తిగతీకృత శైలితో పనిచేస్తూ, తన టెక్నో-సోషియో-కల్చరల్ - ఎకొలాజికల్- ఎన్విరాన్‌మెంట్ పరిధిని విస్తృతం చేసుకోవాల్సి ఉంటుంది. అలా తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్న చిత్రకారుడే హైదరాబాద్‌కు చెందిన చిప్ప సుధాకర్.

ప్రత్యేక కథనం: 33, 34వ పేజీలో..
























## విజువల్ కమ్యూనికేషన్

మాటలు అవసరం లేనిది దృశ్యభాష. అలాంటి దృశ్యభాషకు ప్రతిరూపంగా నిలుస్తాయి చిత్రకారుల చిత్రాలు. అలాంటి చిత్రాల్లో సమకాలీన వాస్తవికతను ప్రతిబింబించడం చిత్రకారుడికి కత్తి మీద సాము లాంటిది. అదే సమయంలో తన వ్యక్తిగతీకృత శైలిని ఏర్పరచుకునేందుకు, వైవిధ్యాన్ని చాటుకునేందుకు కూడా చిత్రకారుడు ప్రయత్నిస్తుంటాడు. అలా ఓ చిత్రకారుడు చేసిన ప్రయాణం 'దృశ్యభాషకు ప్రతిరూపం' శీర్షికన మీకోసం...

TELANGANA RESOURCE CENTRE

"**CHANDRAM**" 490, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: deccanlandindia@gmail.com    website : www.deccanland.com







## చక్కటి ప్రయత్నం..

సమాజంలో చిత్రకారులు, ఫోటోగ్రాఫర్లు లాంటి సృజనశీలురు ఎంతో మంది సమాజానికి తమవంతు సేవలు అందిస్తున్నా వారి సేవలు, వివరాలు సరిగా నమోదు కావడం లేదు. వారి గురించిన వివరాలు సాధారణ ప్రజానీకానికి సరిగా తెలియడం లేదు. తెలంగాణకు చెందిన చిత్రకారులు, ఫోటోగ్రాఫర్లు, ఇతర కళాకారులు జాతీయంగా, అంతర్జాతీయంగా రాణిస్తున్నా వారి సమాచారం అంతగా తెలియడం లేదు. ఈ నేపథ్యంలో అలాంటి వారిని పరిచయం చేస్తున్న తీరు బాగుంది. ఈ ప్రయత్నాన్ని కొనసాగించగలరు.

**- కె.భాస్కర్, వరంగల్**

## తెలంగాణ సాహిత్య దృశ్యం..

తెలంగాణ భాషపై ఇతరులు చిన్నచూపు కనబరిచేందుకు ప్రధాన కారణాల్లో ఒకటి తెలంగాణ సాహితీ విశేషాలు పెద్దగా వెలుగులోకి రాకపోవడం. తెలంగాణ భాష గురించి, సాహిత్యం గురించి ఇక్కడివారికే సరిగా సమాచారం అందుబాటులో లేదు. ఇలాంటి సమయంలో మన సాహిత్యం, సాహితీవేత్తల గురించి వివరించేందుకు తెలంగాణ సాహిత్య దృశ్యం శీర్షికన డా.సుంకిరెడ్డి నారాయణరెడ్డి రాస్తున్న వ్యాసాలు ఎంతగానో తోడ్పడుతాయి.

**- పి. సుజాత, కరీంనగర్**

## జిల్లా చరిత్రలకు ప్రాధాన్యం

తెలంగాణలో ఇప్పటి వరకూ పది జిల్లాలు ఉన్నాయి. ఆయా జిల్లాల చరిత్రల గురించి కొన్ని పుస్తకాలు వెలువడినా అవి అందరికీ అందుబాటులో లేవు. ఇప్పుడు కొత్తగా మరిన్ని జిల్లాలు రాబోతున్నాయి. ఈ నేపథ్యంలో సామాజిక, ఆర్థికం, సాహిత్యం...ఇలా ఆయా రంగాల్లో ఒక్కో జిల్లా విశిష్టత గురించి ప్రత్యేక కథనాలు వెలువరిస్తే బాగుంటుంది. ఈ విషయంపై దృష్టి సారిస్తారని ఆశిస్తున్నాం.

**- ఎన్.ఎం.గుప్తా, సుజాత, ఆదిలాబాద్**

## కళారూపాలకు పట్టం...

తెలంగాణలో ఎన్నో జానపద కళారూపాలు ఉన్నాయి. టీవీ, సినిమా, ఇంటర్నెట్ తదితరాలతో అవి మరుగున పడిపోతున్నాయి. అవి అంతరించిపోకుండా చూసుకుంటూ వాటిని ప్రాచుర్యంలోకి తేవాల్సిన అవసరం ఉంది. థియేటర్‌లో సినిమాను అంతా ఎలా చూస్తారో, ఆయా జానపద కళారూపాలను జనం సమూహాలుగా చూస్తూ ఆనందించాల్సిన మంచి రోజులు రావాలి. అందుకు ఒక చక్కటి వేదిక కావాలి. ఈ లోగా అలాంటి కళారూపాల గురించి నలుగురికీ మరీ ముఖ్యంగా నేటి తరానికి తెలియజెప్పాల్సిన అవసరం ఉంది. ఆయా కళారూపాల పరిచయాన్ని కొనసాగిస్తారని కోరుకుంటున్నాం.

**- బి.సాగర్, ఖమ్మం**

మీ లేఖలను E-mail: deccanlandindia@gmail.comకు పంపించవచ్చు

## నోముల కథల పోటీ - 2016

నోముల కథా పురస్కారం - 2016కు గాను తెలుగు కథలను ఆహ్వానిస్తున్నాం. బహుభాషావేత్త, సాహితీవిమర్శకుడు డాక్టర్ నోముల సత్యనారాయణ పేరున కథా పురస్కారాలను 2010 నుంచి ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ పోటీకి పంపే కథలు ఇంతకు ముందు ప్రచురితము కానివై ఉండాలి. కథా వస్తువు, నిడివి వంటి విషయాలలో ఎటువంటి నియమాలు లేవు. కథను డిటిపి చేసి పంపాలి. ప్రసిద్ధ కథకులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తారు. ఐదు ఉత్తమ కథలకు పురస్కారాలు, నగు, జ్ఞాపిక అందజేస్తాము. నోముల జన్మదినమైన ఆగస్టు 10న నల్లగొండలో జరిగే కార్యక్రమంలో బహుమతి ప్రదానం ఉంటుంది. పురస్కార విజేతలు స్వయంగా వచ్చి పురస్కారం అందుకోవాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు 9866298023, 93462 57896 నెంబర్లను సంప్రదించ వచ్చును.

**కథలు పంపుటకు చివరి తేదీ:** 25 జులై 2016.

**కథలు పంపవలసిన చిరునామా:**

డాక్టర్ నోముల సత్యనారాయణ,
ఇం.నెం. 6-5-141, రవీంద్రనగర్,
నల్లగొండ, తెలంగాణ రాష్ట్రం

**-డాక్టర్ ఎన్ఎస్ రాహుల్, ఎలికట్టె శంకర్‌రావు**

## జీవ వైవిధ్య చెరువుగా అమీన్‌పూర్

కాలుష్యానికి రంగా ఉంటూ.. అరుదైన సంపదతో ప్రత్యేకత చాటుకుంటున్న పటాన్‌చెరు మండలం అమీన్‌పూర్ చెరువును రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. చెరువు ప్రాంతంలో విభిన్న జాతుల జీవరాసులు ఉన్నాయని అధికారులు తేల్చడంతో జీవవైవిధ్య సంపద కలిగిన చెరువుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐరోపా, మంగోలియా తదితర దేశాల నుంచి కొంగజాతి పక్షులు, పెలికాన్స్, కామన్‌టేల్డ్, రోజి పెలికాన్, నార్దెన్‌షావెలర్, వంటి 171 రకాల పక్షులు వస్తుంటాయని ఫ్రెండ్స్ ఆఫ్ ఫ్లోరా అండ్ ఫౌనా ప్రతినిధి రాజీవ్‌ఖండేల్‌వాల్ తెలిపారు. చెరువులో 9 రకాల చేపలు, పరిసరాల్లో 60 రకాల సీతాకోక చిలుకలు.. 250 రకాల ఔషధ మొక్కలు ఉన్నట్లు గుర్తించారు. ఈ చెరువును స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎస్) వారు దత్తత తీసుకుని అభివృద్ధి చేశారు. అమీన్‌పూర్ చెరువు నుంచి మియాపూర్ వరకు మినీ ట్యాంకుబండ్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 3 కోట్లు మంజూరు చేసింది.

# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 4 సంచిక : 11 పేజీలు : 60

జులై- 2016

సంపాదకులు

**యం. వేదకుమార్**

అసోసియేట్ ఎడిటర్

**ఎన్. వంశీ మోహన్**

సెల్ : 9848902520

లే అవుట్ & కంపోజింగ్

**చరిత ఇంప్రెషన్స్**

కవర్‌పేజీ ముఖచిత్రం

**చిప్ప సుధాకర్ పెయింటింగ్**

వాణిజ్య ప్రకటనలు

**9030626288**

ముద్రణ:

**DECCAN PRESS**

ఆజామాబాద్, హైదరాబాద్-500 020.

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND
"CHANDRAM" 490,
St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029.

Mobile: 9030626288
Fax: 040-27635644

E-mail: deccanlandindia@gmail.com
website : www.deccanland.com


# లోపలి పేజీల్లో...




తెలంగాణ పాటకు నిలువెత్తు సంతకం గూడ అంజయ్య ....... దక్కన్ న్యూస్ .................... 8,9

తొలి ఆధునిక విమర్శకుడు సురవరమే! ....................... సుంకిరెడ్డి నారాయణరెడ్డి ...... 11,12

తెలుగు వాచకాల విశిష్టత ........................................ బి.ఎస్.రాములు ........... 13-16

నకాశి కళకు వన్నె తెచ్చిన చేర్యాల్ స్క్రోల్ పెయింటింగ్ .......... దక్కన్ న్యూస్ ............. 17, 18

షితాబ్ ఖాన్ మహల్ ............................................ ద్యావనపల్లి సత్యనారాయణ ... 19, 20

కోదారి శ్రీనివాస్ పాట .............................................. అంబటి వేకువ ............ 21-24

వట్టిపోతున్న చారిత్రిక సంపద! .................................. సంకేపల్లి నాగేంద్రశర్మ ....... 25-27

ఆలోచనలు రేకెత్తించేలా.. క్లిక్.. క్లిక్.. ................................ దక్కన్ న్యూస్ ............. 28,29

గుట్టల్ని కాపాడుకుందాం ............................................ దక్కన్ న్యూస్ ..................... 32

దృశ్యభాషకు ప్రతిరూపం ............................................ దక్కన్ న్యూస్ ............. 33, 34

ఎఫ్‌బీహెచ్ 16 వార్షికోత్సవం ......................................... దక్కన్ న్యూస్ ............. 35, 36

ఉమ్మడి హైకోర్టు విభజన ఏనాటికో? .................................. దక్కన్ న్యూస్ ............. 37, 38

పబ్లిక్ డిమాండ్ ................................................... దక్కన్ న్యూస్ ..................... 42

డ్రమ్ సీడర్‌తో వరి సాగు- ప్రయోజనాలు ............................ దక్కన్ న్యూస్ ..................... 44

పరీక్ష (బాల చెలిమి) ............................................... దక్కన్ న్యూస్ ..................... 46

అంబేద్కర్‌ని ఆచరించిన హైదరాబాద్ ........................... సంగిశెట్టి శ్రీనివాస్ ......... 47-49

సినిమా @ తెలంగాణ ................................................ హెచ్. రమేష్ బాబు .......... 51-53

కథల కానుపు..! ....................................................... డాక్టర్ ఎస్.రఘు ........... 55-57

పుస్తకం ................................................................ దక్కన్ న్యూస్ ..................... 58


## వార్షిక చందా

దక్కన్ ల్యాండ్ మాసపత్రిక చందాదారులుగా చేరదల్చుకున్న వారు పై చిరునామాకు రూ. 200 ఎం.ఒ. పంపించవచ్చు. లేదా దక్కన్‌ల్యాండ్ పేరిట డీడీ పంపవచ్చు. చిరునామా, ఫోన్ నెంబర్ వివరాలు స్పష్టంగా తెలియజేయగలరు.

'దక్కన్ ల్యాండ్'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను ప్రజాస్వామిక అభిప్రాయ వేదికగా, ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, సమస్యలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే 'దక్కన్ ల్యాండ్' లక్ష్యం.

# అంజయ్య జ్ఞాపకాల కలబోత

గూడ అంజయ్య జ్ఞాపకసభ సుందరయ్య విజ్ఞాన వేదిక మినీ హాల్‌లో జరిగింది. ప్రొ.జయధీర్ తిరుమలరావుగారు అధ్యక్షతవహించగా పాశం యాదగిరి,విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్, ప్రముఖ రచయిత బి.ఎస్.రాములు వంటివారెందరో గూడ అంజయ్యతో తమకుగల జ్ఞాపకాలను కలబోసుకున్నారు. 'ఊరు మనదిరా!ఈవాడమనదిరా!అంటే అధికసంఖ్యాకులైన మన కష్టజీవులది, దొరలదికాదు అని అంజయ్య చెప్పినట్లు అని జయధీర్‌గారు తెలిపారు. అంజయ్యఎంత గొప్పవాడంటే తను రాసిన ఆత్మీయ పాటల్లో తెలుగు పదాల్లో తెలంగాణ ప్రజల భాషనే ఒకవైపు ఉపయోగిస్తూ,సంస్కృతపదాలు రాకుండ చూసుకునేవాడు అంజయ్య అని కొనియాడారు. ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ గాలివాటంగా కొట్టుకుపోయే రచయితలను,నాయకులను విండ్‌కాక్స్ అంటారని అంజయ్య అటువంటి విండ్‌కాక్ కాదని, చెమటసుక్కల గురించి రాసిండు కాని సెంటు సుక్కల గురించి కాదని చెప్పుకొచ్చాడు. విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్ మాట్లాడుతూ అంజయ్యకు తనకు ఎటువంటి ఊరిబంధం ఉన్నదో వివరించారు. తామిద్దరూ పక్క పక్కవూళ్ళలో ఉండేవాళ్ళు కనుక ఎన్నోవిషయాలు తాము కలబోసుకునేవారని చెప్పుకొచ్చారు. బి.ఎస్. రాములు మాట్లాడుతూ తాము ఎన్నిసార్లు రాత్రింబగళ్ళు సమాజానికి, రాజకీయాలకు సంబంధిచి చర్చలు జరిపారో, ఏఏ పట్టణాల్లో జరిపారో చెప్పుకొ చ్చారు.16 ఏండ్లకే 'అసలేటివానల్లో ముసలెడ్లుగట్టుకొని పండించిన పంటతో గరిసెలెవరివి నిండెరో రాజన్న!గుమ్ములెవరివి నిండెరో అని,ఈవూరుమనదిరా అనే పాట 17 ఏండ్లప్పుడు ఎట్ల రాసిండో,ఆయన పాటలు ఈన్ని భాషల్లో ఎన్నిదేశాల్లో తర్జుమాచెయ్యబడి ప్రపంచవ్యాప్తంగా ఎట్లా మారుమోగినయో చెప్పుకొచ్చారు.తరువాత కాలంలో 'పుడితొక్కటి సస్తెరెండు రాజిగ వొరి రాజిగా! ఎత్తర తెలంగాణ జండ రాజిగ ఒరిరాజిగ! అని,' అవ్వోనివా? నువ్వు అమ్మోనివా? తెలంగాణోనికీ నువ్వు పాలోనివా?' అంటు తెలంగాణ పాటలు ఎట్ల రాసిండో అవన్ని ఎట్ల తెలంగాణ ఉద్యమానికి ఊపుతెచ్చినయో ఉరకలెత్తించినయో చెప్పు కొచ్చారు.

**-రాములు చందా**, 9440573543, విశ్రాంత రాజనీతిశాస్త్ర అధ్యాపకులు, అధ్యక్షులు, తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్

# దక్కన్‌ల్యాండ్‌లో 'బాలచెలిమి'



బాలల కోసం ప్రత్యేకంగా ఈ సంచికతో 'బాల చెలిమి' నూతన శీర్షికను ప్రారంభిస్తున్నాం.

ఈ సందర్భంగా ఒకనాటి 'బాలచెలిమి' మాస పత్రిక గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. ఈ మాసపత్రిక 1990 అక్టోబర్‌లో ప్రారంభమైంది. చిల్డ్రన్స్ అకాడమీ ఆధ్వర్యంలో యం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడింది. మేధావి, రచయిత హరిపురుషోత్తమరావు, ప్రొఫెసర్ హరగోపాల్ లాంటి ప్రముఖులు అప్పటి వరకూ వారు పిల్లల కోసం ప్రత్యేకంగా ఎలాంటి రచనలు చేయకపోయినప్పటికీ, బాలచెలిమి పత్రిక కోసం మాత్రం ప్రత్యేక రచనలు అందించారు. పిల్లల కోసం, పిల్లల గురించి, పిల్లలచే ప్రత్యేకంగా రాసిన కథనాలు ఈ పత్రికకు ప్రత్యేకతను అందించాయి. ఏడు నెలల పాటు క్రమం తప్ప కుండా వెలువడిన 'బాలచెలిమి' మాసపత్రిక అనివార్యకారణల వల్ల నిలిచిపోయింది.

హరిపురుషోత్తమ రావు విషయానికి వస్తే, "నన్ను కూర్చోబెట్టి ఒక కథ రాయించావు...అది కూడా పిల్లల కోసం. ఇలా కథ రాయడం నా జీవితంలో ఇదే మొదటిసారి" అని ఆయన అన్నారు. రఘుతేజ కలం పేరుతో ఆ రచన బాలచెలిమి రెండో సంచిక (నవంబర్, 1990)లో ప్రచురితమైంది. దాన్నే ప్రస్తుతం దక్కన్‌ల్యాండ్ మాసపత్రికలో పిల్లల తో పాటుగా పెద్దలకూ పిల్లలపై ఆలోచనలు రేకెత్తిం చేలా ప్రత్యేకంగా ప్రవేశపెడుతున్న 'బాలచెలిమి' శీర్షికన అందిస్తున్నాం.

**-ఎడిటర్**

**('బాల చెలిమి' 46వపేజీలో)**


చందదారులుగా చేరండి! **దక్కన్ ల్యాండ్** చందదారులను చేర్పించండి!

'తెలంగాణ రిసోర్స్ సెంటర్' ఆధ్వర్యంలో యం.వేదకుమార్ సంపాదకత్వంలో ప్రజాఉద్యమాల వేదికగా ఆరంభమైన 'దక్కన్‌ల్యాండ్' తెలుగు సామాజిక రాజకీయ మాసపత్రిక అనతికాలంలోనే అన్ని వర్గాల ఆదరణ పొందింది. తెలంగాణ ఉద్యమకారులకు కరదీపికగా మారింది. ఈ పత్రిక మరిన్ని వర్గాలకు చేరడంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా**

DECCAN LAND
"CHANDRAM" 490, St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029. Mob: 9030626288
mail: deccanlandindia@ gmail.com, www.deccanland.com

**చందా వివరాలు:**

| | | |
|---|---|---|
| వార్షిక చందా | : | రూ. 200 |
| 2 సంగలకు | : | రూ. 400 |

*'దక్కన్ ల్యాండ్' పేరిట ఎం.ఓ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*




# విద్యావ్యవస్థలో మార్పులు

ఒక దేశ నిర్మాణం జరిగేది తరగతి గదుల్లోనే అంటారు. అంతటి కీలకమైన అంశానికి మనం ఇస్తున్న ప్రాధాన్యం మాత్రం అరకొరగానే ఉంటోంది. పాలకులు తీసుకునే నిర్ణయాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. విధాన నిర్ణయాలు తీసుకోవాల్సిందే...అమలు చేయాల్సిందే...తప్పదు...కానీ అందుకు కూడా ఒక పద్ధతి పాటించాలి. ఇష్టం వచ్చినట్లుగా నిర్ణయాలు తీసుకోవడం వల్ల వాటి అమలు కష్టం కావడంతో పాటు పిల్లలు, తల్లిదండ్రులు ఇబ్బందుల పాలవుతున్నారు.

ఉన్నతవిద్య విషయానికి వస్తే, ఐఐటీ, నిట్ ప్రవేశాల్లో జాప్యం, గందరగోళం నెలకొన్నాయి. ఆయా విద్యాసంస్థల్లో ఫీజులను పెంచడం కూడా తల్లిదండ్రులకు భారంగా మారింది. మరోవైపున వాటిల్లో ప్రమాణాలు కూడా అంతంగామాత్రం. జేఈఈ మార్కుల ప్రాతిపదికన ప్రవేశాలు జరిగే ముప్పై పైచిలుకు సంస్థల్లో (నిట్ లతో సహా) టాప్ 5 మినహాయిస్తే మిగిలిన వాటిల్లో మౌలిక వసతులు, విద్యాప్రమాణాలు, ప్లేస్‌మెంట్స్ అంతంతమాత్రమే. ఐఐటీల్లో కొన్ని మాత్రమే అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ఉన్నాయి.

ఇంజినీరింగ్, మెడికల్ ప్రవేశాల్లో గందరగోళం నెలకొంది. ఏళ్ళ క్రితమే వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు 'నీట్'కు అంగీకరించి, చివరి దాకా విద్యార్థులు, తల్లిదండ్రులను చీకట్లో ఉంచాయి. విద్యార్థుల శ్రేయస్సు కోరిన సుప్రీంకోర్టు పట్టువిడుపు ధోరణితో వ్యవహరించి వివిధ సెట్‌ల నిర్వహణకు అనుమతించింది. సుప్రీం కోర్టు కఠిన వైఖరి అవలంబిస్తే ఏమై ఉండేది?.

ఎంబీబీఎస్ సీట్ల విషయంలో గందరగోళం నెలకొంది. కొత్త కాలేజీలకు అనుమతులు వస్తాయా, ఆ సీట్లను ఈ ఏడాదిలోనే భర్తీ చేస్తారా లాంటి అంశాలపై స్పష్టత లేకపోయింది. ఇంజినీరింగ్ విషయంలోనూ ఇలానే జరిగింది. కాలేజీల తనిఖీ ప్రక్రియ మంచిదే అయినప్పటికీ, ఎంచుకున్న సమయం మాత్రం ఇబ్బందికరమైందే. ఫలితంగా కొన్ని కాలేజీలకు గుర్తింపు పోవడమో, కొన్ని సెక్షన్లు మాయం కావడమో జరుగనుంది. విద్యార్థుల సంఖ్య కన్నా సీట్లు ఎక్కువ అనే దశ నుంచి సీట్లకు కొరత ఏర్పడే దశకు చేరుకుంటున్నాం. ఇదీ మంచిదే. కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, నాణ్యతాప్రమాణాలను మెరుగుపర్చినట్లు అవుతుంది.

బీహెచ్ఎంఎస్, బీఎఎంఎస్ కోర్సుల విషయానికి వస్తే ఏయే రాష్ట్రాల్లో ఎన్ని కాలేజీలు ఉన్నాయి, ఎన్ని సీట్లు ఉన్నాయి, వాటిలో మేనేజ్‌మెంట్ కోటా ఎంత లాంటి విషయాల్లో కొన్ని యాజమాన్యాలు గుంభనంగా ఉంటున్నాయి. కొన్ని కాలేజీలు పారదర్శకతను పాటిస్తున్నప్పటికీ మరికొన్ని కాలేజీల వివరాలు తెలుసుకోవడం కష్టమవుతోంది. గత ఏడాది చివరి ర్యాంకు ఎంత అనేది తెలుసుకోవడం చాలా కష్టంగా మారింది. ఫార్మ్.డి కోర్సుకు ఈ ఏడాది డిమాండ్ పెరిగింది. కొన్నేళ్ళ క్రితం దీన్ని ప్రవేశపెట్టినప్పటికీ, విదేశాల్లో డిమాండ్ ఉంటుందని అంటున్నారు తప్పితే మనదేశంలో కెరీర్ అవకాశాలపై స్పష్టత ఇవ్వలేకపోతున్నారు.

వైద్యవృత్తి విద్యలకు దీటుగా అగ్రికల్చర్, హార్టికల్చర్ డిగ్రీ కోర్సులకు డిమాండ్ పెరిగింది. మన విద్యార్థులు మహారాష్ట్ర వైపు పరుగులు తీస్తున్నారు. ఆయా కోర్సులను ఐకార్ గుర్తింపు ఉన్న కాలేజీల్లోనే చేయాలి. కొన్ని కన్సల్టెన్సీలు మాత్రం ఈ గుర్తింపు లేని కాలేజీల్లో సైతం విద్యార్థులను చేర్పిస్తున్నాయి. మరికొన్ని ఫీజుల వివరాలు తల్లిదండ్రులకు వెల్లడించకుండా ప్యాకేజీలు మాట్లాడుతూ, భారీగా సొమ్ము చేసుకుంటున్నాయి. కొన్ని కాలేజీల యాజమాన్యాలు సైతం ఇలాంటి కన్సల్టెన్సీలను ప్రోత్సహిస్తున్నాయి.

రాష్ట్రంలో డిగ్రీ అడ్మిషన్లను ఆన్‌లైన్ చేయడం ఓ చక్కటి ప్రయత్నం. కొన్ని లోటుపాట్లు ఉన్నప్పటికీ ఇది సత్ఫలితాలను ఇచ్చే అవకాశం ఉంది.

ఐఐటీ, నిట్‌లతో సహా వివిధ ప్రవేశాలకు వెబ్ కౌన్సెలింగ్ బాగానే ఉన్నప్పటికీ, కనీసం మూడు ఫైనల్ ఆప్షన్స్ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తే బాగుంటుంది.

మొత్తంగా చూస్తే విద్యారంగం ఉరుకులు పరుగులు తీస్తోంది. సంస్కరణలూ వేగంగా వస్తున్నాయి. వివిధ కోర్సుల ప్రవేశాల విధివిధానాలపై సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో ఆయా ప్రభుత్వాలు, విద్యాసంస్థలు చొరవ తీసుకుంటాయని ఆశిద్దాం.

వేదకుమార్.యం

(యం. వేదకుమార్)
ఎడిటర్

# తెలంగాణ పాటకు నిలువెత్తు సంతకం

# గూడ అంజయ్య



రచయితగా, పాటగాడుగా ప్రజా ఉద్యమ కార్యకర్తలకు సుపరిచితుడు గూడ అంజయ్య. ఆయన రాసిన ఒక్కో పాట ఉద్యమకారుల చేతుల్లో పదునెక్కిన ఆయుధంగా నిలిచింది. పాటల్లో ఒక్కో మాట..ఒక్కోతూటా. ఆయన రాసిన ఒక్కో అక్షరం లక్షలాది మందికి స్ఫూర్తిప్రదాయకంగా నిలిచింది. ఆయన మరణం తెలంగాణకు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు. కొంతకాలంగా కామెర్లు, మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న ఆయన జూన్ 21, 2016 రంగారెడ్డి జిల్లా రాగన్నగూడ లోని స్వగృహంలో ప్రాణాలు విడిచారు.

**కుటుంబ నేపథ్యం...**

అదిలాబాద్ జిల్లా దండపల్లి మండలం లింగాపూర్‌లో లక్ష్మయ్య, లక్ష్మమ్మ దంపతులకు నాలుగో సంతానంగా 1954, నవంబర్ 1న అంజయ్య జన్మించారు. అంజయ్యకు హేమానళినితో వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు శ్రీలత, కవిత, మమత. వారిలో ఇద్దరికి పెళ్లి అయింది. అంజయ్య ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే సాగింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ లక్సెట్టిపేటలో చదివారు. హైదరాబాద్‌లో బీ ఫార్మసీ చేశారు. ఫార్మాసిస్టుగా ఉట్నూర్‌లో మొదటగా ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. ఆ తర్వాత కొద్ది రోజులు ఆదిలాబాద్‌లో కూడా పనిచేశారు. తర్వాత సినిమా పాటల రచనలో భాగంగా హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. అంజయ్య తల్లి లక్ష్మమ్మ లింగాపూర్‌లోనే ఉంటోంది. అంజయ్యకు ఐదుగురు సోదరులు, ఒక సోదరి. ప్రస్తుతం ఒక సోదరుడు, సోదరి మిగిలారు. మిగతా వారు చనిపోయారు.

**ఊరు మనదిరా....**

అంజయ్య రాసిన పాటలు కోట్లాది మంది అణగారిన జనం గుండె చప్పుడుగా నిలిచాయి. తెలంగాణలోనే కాదు... భారతదేశమంతటా ఆయన పాటలు వివిధ భాషల్లోకి అనువాదమయ్యాయి. ఆఫ్రికాలోనూ ఆయన పాటలు ప్రతి ధ్వనించాయి. ఆయన రాసిన 'ఊరు మనదిరా..' పాట ఏకంగా 16 భాషల్లోకి అనువాదమైంది. ఇదే పాటను ఆఫ్రికా విముక్తి ఉద్యమంలో అక్కడ ఉద్యమకారులు తమ భాషలోకి మార్చుకొని పాడుకున్నారు. 1980లలో హైదరాబాద్‌లో జరిగిన ఆసియా-ఆఫ్రికన్ దేశాల రచయితల సదస్సులో ఈ పాటను ఆ సమావేశానికి హాజరైన ప్రతినిధులు అప్పటికప్పుడే వారి భాషలలోకి అనువాదం చేసుకొని పాడుకున్నారు. తెలంగాణలో ఈ పాట స్ఫూర్తితో ఎందరో యువకులు విప్లవోద్యమంలోకి దూకారు. తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళడంలో గూడ అంజయ్య పాటలు పోషించిన పాత్ర మరువలేనిది.

**ఉద్యమాన్ని ఉర్రూతలూగించిన పాట...**

'అయ్యోనివా నువు అవ్వోనివా తెలంగాణోనికి తోటి పాలోనివా...' అంటూ అంజయ్య రాసిన పాట తెలంగాణ ఉద్యమాన్ని ఉర్రూతలూగించింది. ఆయన రాసిన ప్రతి పాటా ఉద్యమకారుల నోట ప్రతిధ్వనించింది. ఆకలి చావులు, వలసవాదంపై ఆయన రాసిన ఎన్నో పాటలు మలి దశ తెలంగాణ ఉద్యమాన్ని ఉరుకులు పెట్టించాయి. తొలినాళ్లలో విప్లవోద్యమంలో పాల్గొన్న అంజయ్య ఆ తర్వాత ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి దగ్గరయ్యారు. మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రొఫెసర్ కేశవరావ్ జాదవ్, జయశంకర్‌లతో కలిసి నడిచారు. కాళోజీ, సదాశివ, రామశాస్త్రివంటి వారితో చర్చించారు.

**సినిమాల్లో...**

ఎర్రసైన్యం, స్వర్ణక్క, చీమలదండు, ఒసేయ్ రాములమ్మ, చీకటి సూర్యుడు, రైతురాజ్యం వంటి ఎన్నో సినిమాలకు ఆయన పాటలు రాశారు. నటుడిగా కూడా ప్రతిభ చాటుకున్నారు. ఎర్రసైన్యం, మాభూమి, దండోరా, చీకటి సూర్యులు వంటి సినిమాల్లో పలు పాత్రల్లో నటించారు. 'రక్తంతో నడుపుతాను రిక్షాను.. నా రక్తమే నా రిక్షకు పెట్రోలు' వంటి పాట సహా.. 20పైచిలుకు సినీగీతాలను అందించారు. దండోర, ఎర్రసైన్యం, ఒసేయ్ రాములమ్మ, చీమలదండు, రైతురాజ్యం, అడవిలో అన్న, వీర తెలంగాణ, పోరు తెలంగాణ తదితర చిత్రాలకు పాటలు రాశారు. ఆయన రాసిన పాటలు ఎన్నో రాసిందెవరో తెలియకుండానే జనం నోళ్లలో నానాయి. చాలా కాలం తరువాతనే సాధారణ ప్రజానీకం ఆ పాటలు రాసింది




తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో "తెలంగాణ రాష్ట్ర సాధన - పాట పాత్ర" అనే అంశంపై జరిగిన 45వ చర్చా కార్యక్రమంలో గూడ అంజన్నను సన్మానిస్తున్న గద్దర్, యం. వేదకుమార్, ఇతర ప్రజా కవులు, గాయకులు

గూడ అంజయ్య అని తెలుసుకోగలిగారు. పేరు ప్రఖ్యాతుల కోసం పాకులాడకుండా ప్రజల కోసం పని చేసే ఆయన తత్వాన్ని ఇది వెల్లడిస్తుంది.

తెలంగాణ ఉద్యమం సందర్భంగా తెలంగాణ రిసోర్స్ సెంటర్ (టిఆర్‌సి) నిర్వహించిన కార్యక్రమాలకు గూడ అంజయ్య హాజరయ్యారు. పాటపై నిర్వహించిన చర్చా కార్యక్రమం సందర్భంగా టీఆర్‌సీ ఇతర ప్రజాగాయకులతో కలసి ఆయనను సత్కరించింది. ఈ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగం స్ఫూర్తిదాయకంగా ఉండింది. ఆ ప్రజా కళాకారుడి ఆశయసాధనే ఆయనకు అసలైన నివాళి.

**ప్రజా ఉద్యమాల్లో...**

అదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో విప్లవోద్యమ నిర్మాణం జరుగుతున్న సమయంలో ఉద్యమ బాటలో పయనించాడు. ఉన్నత చదువులకోసం హైదరాబాద్ హాస్టల్‌కు మకాం మార్చిన అంజన్నకు ప్రపంచ ఉద్యమాల పరిచయం ఏర్పడింది. అరుణోదయ సాంస్కృతిక సంస్థను స్థాపించి జనంనోట విన్న పదాలనే పాటలుగా రాసి బాణీలు కట్టి తన పాటల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని కలిగించాడు. తెలంగాణలోని దళిత రచయితలను ఒకే తాటిపై తీసుకువచ్చి దళిత రచయితల మేధావుల వేదికను ఏర్పాటు చేశారు. దళిత, మహిళా పోరాటాల్లో కలిసి పనిచేశారు. అన్ని ప్రజాస్వామిక ఉద్యమాల్లో తన అస్తిత్వాన్ని చాటుకున్నారు. తెలంగాణ సాంస్కృతిక సంఘం నాయకుడిగా పనిచేశారు.

**రచనలు**

- పొలిమేర (నవల) ● దళిత కథలు (కథాసంపుటి)

**బాగా ప్రాచుర్యం పొందిన కొన్ని పాటలు**

- నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు
- జర భద్రం కొడుకో కొడుకో కొమరన్న
- ఊరు మనదిరా ఈ వాడ మనదిరా
- అయ్యోనివా నువ్వు అవ్వోనివా తెలంగాణోనికి తోటి పాలోనివా?
- రాజిగా ఓరి రాజిగా
- ఇగ ఎగబడుదాంరో ఎములాడ రాజన్న
- లచ్చులో లచ్చన్న.. ఈ లుచ్ఛాగాళ్ళ రాజ్యంలో బిచ్చగాళ్ల బతుకులాయే
- అసలేటి వానల్లో ముసలెడ్లు గట్టుకుని
- గజ్జులు గజ్జాలు రెండు గజ్జలో రాజన్న

**అవార్డులు..**

- 1988లో రజనీ తెలుగు సాహితీ సమితి నుంచి అవార్డు
- 1988లో సాహిత్య రత్న బిరుదు
- 2000లో గండెపెండేరా బిరుదు
- 2004లో నవ్య సాహిత్య పరిషత్ నుంచి డాక్టర్ మలయశ్రీ సాహితీ అవార్డు
- 2015లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా తెలంగాణ సాహిత్య పురస్కారం

తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. కొమురం భీమ్, సుద్దాల హన్మంతు-జానకమ్మ జాతీయ పురస్కారాలతోపాటు, సాహిత్యరత్న, దళిత రత్న వంటి బిరుదులు పొందారు. ఎన్ని అవార్డులు, బిరుదులు లభించినా.. తన పాటకు లభించిన ప్రజాదరణే అన్నింటికీ మించిన అవార్డు అని చెబుతుండేవారు.

-దక్కన్ న్యూస్ ద

## తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

నగరంలో రెండురోజుల పాటు జరిగిన తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర మహాసభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పల్లె నర్సింహ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేతరాజు ఉప్పలయ్య, కోశాధికారి పడాల నళినితో పాటు 51 మంది రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు నర్సింహ తెలిపారు.

## బ్యాంకుల విలీనం దేశప్రయోజనాలకు విరుద్ధం

దేశంలో ఆర్థిక సంస్కరణల పేరిట జాతీయకరణ ఉద్దేశాలు, లక్ష్యాలను కేంద్రప్రభుత్వం నీరుగారుస్తోందని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ సంఘం కార్యదర్శి బి.ఎస్.రాంబాబు విమర్శించారు. బ్యాంకుల విలీనాలు బ్యాంకుల పురోగతికి ఏ మాత్రం తోడ్పడవని, రూ.వేల కోట్ల రుణాలు ఎగ్గొట్టే విజయ మాల్యా వంటి వ్యక్తులకు ప్రయోజనం కలిగిస్తాయని దుయ్యబట్టారు. చాపెల్ రోడ్డులోని పర్వాన హాల్‌లో బరోడ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ 'బ్యాంకింగ్ సంస్కరణలు-విలీనాలు' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్యాంకుల విలీనాల ప్రక్రియ దేశప్రయోజనాలకు పూర్తిగా విరుద్ధమని, బ్యాంకులను మోసగించే వారి మరింత కుబేరులవుతారని చెప్పారు. బ్యాంకుల విలీనాల పేరిట అసలు సమస్యలను పక్కదారి పట్టించే యత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. బ్యాంకుల విలీనాల వల్ల సామాన్యుల, చిన్న తరమా పరిశ్రమల నిర్వాహకులు, వ్యవసాయదారులు మాత్రం లాభపడబోరని చెప్పారు.

ఈ సందర్భంగా సుదీర్ఘకాలంగా బ్యాంక్‌కు సేవలందించిన రంగయ్యను ఉద్యోగులు సన్మానించారు. ఎస్‌బీహెచ్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, అలహాబాద్ బ్యాంక్ నాయకులు ఎంఎస్ కుమార్, బ్యాంక్ ఆఫ్ బరోడా రెండు తెలుగు రాష్ట్రాల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు అజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి జానకిరాం తదితరులు పాల్గొన్నారు.

## జనాభా ప్రాతిపదికన గిరిజనులకు రిజర్వేషన్లు

తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులు అభివృద్ధి చెందాలంటే వారికి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరముందని, ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పార్లమెంటరీ కమిటీ చైర్మన్ (ఎస్సీ, ఎస్టీల సంక్షేమం) ఫగ్గన్ సింగ్ కులాస్తే అన్నారు. రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో గిరిజన ఐక్యవేదిక, దళిత్ ఇండస్ట్రీయల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ అంబేద్కర్ 125వ జయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్లు కేంద్రస్థాయిలో వేరు పడ్డా క్షేత్రస్థాయిలో ఎస్టీ కమిషన్‌కు పూర్తి అధికారాలు ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ బద్ధంగా రిజర్వేషన్లు ఉపకులాలకు కేటాయించి రిజర్వేషన్ ఫలాలు వారికి అందేలా చూడాలన్నారు. తెలంగాణలో గిరిజనుల జనాభా 9.34 శాతం ఉందని ప్రభుత్వం నిర్వహించిన సర్వే ద్వారా తేలిందని ఆ ప్రాతిపదికనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ విషయంలో రాష్ట్రవిభజన చట్టాన్ని సవరించి, కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని కోరారు. గిరిజన ఐక్యవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ వివేక్ వినాయక్ అధ్యక్షత వహించారు.మహబూబాబాద్ ఎంపీ సీతారాం నాయక్ మాట్లాడుతూ ఎస్టీల అభివృద్ధి కేవలం కాగితాలకే పరిమితమైందన్నారు. 'కొమురం భీం గిరికీర్తి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రవీంద్రనాయక్, ప్రకాష్ రాథోడ్, ఐఆర్ఎస్ అధికారి ఎం.మోహన్‌బాబు, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఆర్ఎస్‌దొర, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ హన్మంతునాయక్, గిరిజన కెరటం ఎడిటర్ జి.శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

తెలుసుకొందాం..!

## డా.అంబేద్కర్ సెంట్రల్ సెక్టర్ స్కీమ్ ఆఫ్ ఇంట్రెస్ట్ సబ్సిడీ ఆన్ ఎడ్యుకేషన్ పథకం

విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించాలనే జిజ్ఞాస కలిగి ఉన్న ఓబీసీ విద్యార్థులకు సాయం చేసేందుకు ప్రభుత్వం డా.అంబేద్కర్ సెంట్రల్ సెక్టర్ స్కీమ్ ఆఫ్ ఇంట్రెస్ట్ సబ్సిడీ ఆన్ ఎడ్యుకేషన్ పథకాన్ని అమలు చేస్తుంది. ఈ పథకం నిబంధనల ప్రకారం ఆర్థికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులను ఉన్నత చదువులకు ప్రోత్సహించేందుకు, విదేశాలలో ఉన్నత విద్యనభ్యసిస్తోన్న అభ్యర్థులకు విద్యారుణాలపై సబ్సిడీ అందిస్తారు. పూర్తి వివరాలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంప్రదించాలి.

**అర్హతలు:**

- మాస్టర్స్, ఎంఫిల్, పీహెచ్‌డీ స్థాయి విద్యనభ్యసించడానికి నమోదైనవారు మాత్రమే ఈ పథకానికి అర్హులు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 1లక్షలోపు ఉండాలి.
- ఐటీఆర్/ఫామ్-16 ఆడిటెడ్ అకౌంట్స్ / రాష్ట్ర ప్రభుత్వ అథారిటీ జారీ చేసిన ధ్రువీకరణ పత్రం జత చేయాలి.
- అర్హులైన విద్యార్థులు ఈ పథకం కింద ఇంట్రెస్ట్ సబ్సిడీ ఒక్కసారి పొందడానికి మాత్రమే అర్హులు. మాస్టర్స్, పీహెచ్‌డీ స్థాయిలో ఏదైనా కారణంతో కోర్సును మధ్యలో ఆపితే, డిస్‌కంటిన్యూ అయినా, అకాడమిక్ గ్రౌండ్స్‌లో/క్రమశిక్షణ చర్యలపై చదువు ఆపేసినా ఈ పథకానికి అనర్హులుగా పరిగణిస్తారు.
- విద్యార్థులు తప్పుడు సర్టిఫికెట్లు, తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చినట్లయితే సబ్సిడీని నిలిపివేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.
- హైదరాబాద్ జిల్లాకు చెంది ఉండి విదేశాలలో విద్యనభ్యసిస్తోన్న అభ్యర్థులకు ఈ అవకాశం ఉంటుంది.

తెలంగాణ సాహిత్య దృశ్యం

# తొలి ఆధునిక విమర్శకుడు సురవరమే!

సురవరం ప్రతాపరెడ్డిని తొలి ఆధునిక విమర్శకుడిగా లక్ష్మణ చక్రవర్తి ఎందుకు స్వీకరించలేదు? (నిజానికి తెలంగాణ సాహిత్య విమర్శ క్రమపరిణామం మీద మొదటి ప్రయత్నం చేసిన లక్ష్మణ చక్రవర్తిని ముందుగా అభినందిస్తూనే కొన్ని సవరణలు చేయక తప్పడం లేదు)

సురవరంగారి తొలి వ్యాసమైన "ద్విపదరామాయణం" (1922) లో ఆధునికత లేదని భావించినందువల్ల కావచ్చు. ఇందులో ఆధునికత ఉన్నదీ లేనిదీ తర్వాత చూద్దాం. అప్పటి వరకు లేదా బూర్గుల వ్యాసం (1926) కన్నా ముందు నాటికి సురవరం ఆధునిక దృక్పథాన్ని ఆవాహన చేసుకున్నాడా లేడా అనేది ముందు చూడాలె.

పాఠకుల కోసం ఆధునికత అంటే ఏమి టో చెప్పడం అవసరం. మానవ సమానత్వ భావన, స్వేచ్ఛా స్వాతంత్ర్య కాంక్ష, హేతు తత్వం, ప్రజాస్వామిక దృక్పథం, సంఘ సంస్కర ణాతత్పరత, గతిశీలత ఒక్కమాటలో చెప్పా లంటే వీటన్నింటి సమాహారం ఆధునికత.

సురవరం ఆధునిక భావాలతో 1922 లో అస్పృశ్యతాదోషం, హిందూ మతం - అస్పృశ్యత, అనే వ్యాసాల్ని రాసిండు. జాతీయోద్యమంలో సహాయ నిరాకరణోద్యమ ప్రయోజనాల్ని విశ్లేషిస్తూ 1924లో "అసహా యోద్యమ ఫలితములు" (దస్తూరి పుట 184-189) అనే వ్యాసాన్ని రాసిండు. ఇందులోని ఒకటి రెండు వాక్యాల్ని చూస్తే ఆయన దృక్పథం అర్థమవుతుంది. అవి "విదేశీ వస్తు బహిష్కారముచే మన బీదసాదలకు జీవనాధారం కలుగుచున్నది" "స్వరాజ్య ప్రాప్తిలేకున్నను ఈ నలుపు (అస్పృశ్యతాదోషం - వ్యాసకర్త) మాసిపోయిన హిందూ మతమునకు నూతన తేజమును పూర్వోన్నత్యమును సంభవించును"

ఆధునికతను అందిపుచ్చుకున్న "దివాన్, బహద్దర్ వి. నాగమయ్య" గురించి 1923లో వ్యాసం రాసిండు. (సురవరం వ్యాసాలు-2).

తెలంగాణ హృదయ కంపనాలను వినిపించిన "గోలకొండ పత్రిక" తొలి సంపాదకీయంలోనే సురవరం ఆధునికతా స్వరం ఆవిష్కరించబడినది. "పత్రిక యొక్క ముఖ్యోద్దేశము జనసేవయే" "ప్రజలందుగాని, ప్రభుత్వమందుగాని, మంచిగనో చెడ్డగనో మార్పు కలిగించునది పత్రికల యొక్క మహాశక్తియే" "ఆంధ్రులలో నగ్రజన్ములను వారిని మొదలుకొని యంత్యజన్ములను వారి వఱకును మేము సేవ జేయ యత్నింపగలము"

**"తేట మాటల తేనెలొలుకుచు**
**పాటవంబున పరుషమొప్పుచు**




**సాటిభాషల నీటు మీరెడు**
**నాంధ్ర భాషను పొగుడుమా" (1920)**

**"అట్టి ప్రథిత హిందూ స్థానమునకు నేడు**
**పరులచేబడి క్షీణింపనలసెగాదె**
**దేవ జగదీశ! మా మాతృదేశము నకు**
**పూర్వ వైభవమొనర్చి ప్రోచుమయ్య" (దేశమాత - 1922)**

**అట్టి సాహసంబుల జేసె నాంధ్ర మాత**
**తన కుమారు శూరులై తనకు కతన**
**మరల నుద్ధరింపుడు మన మాతృ భూమి**
**(దేశమాత - 1922)**

అనే పద్యాల్లో భారతదేశ, తెలంగాణ ల స్వేచ్ఛ కోసం పడిన తపన వ్యక్తమయిం ది. ఈ స్వేచ్ఛా కాంక్ష ఆధునిక భావనే.

1926లో గోలకొండ పత్రికలో ఆయన రాసిన సంపాదకీయాల్లో, వ్యాసాల్లో, గ్రంథ సమీక్షల్లో ఆయన ఆధునిక భావాలు వ్యక్తమయినవి. చిన్నప్పుడు మిషనరీ స్కూల్లో చదవడం, మద్రాసులో బి.ఏ, లా

చదవడం ఆ సాహచర్యంతో చిన్నటినుంచే ఆయనకు ఆధునికత అబ్బింది.

ఇక 1926 అనంతరం ఆయన రచనలను, కార్యాచరణను గమనిస్తే ఆయన అణువణువులో ఆధునికత, ప్రజాస్వామికతత్వం కన్పిస్తుంది. ఆయనే తెలంగాణ తొలి సంపూర్ణ సమగ్ర ఆధునికుడని ప్రజాస్వామికవాది అని అర్థమవుతుంది. బూర్గులకూ ఆయనకూ పోలికే లేదనేది కూడా అర్థమవుతుంది.

వెనుకకు పోయి ఆయన తొలి విమర్శనా వ్యాసం చూద్దాం.

ఆ వ్యాసం 'ద్విపద రామాయణం'. దీనిలో ఆయన ఆధునిక దృక్పథం ఏమిటి?

నన్నయ అనంతరం కూడా ద్విపద అనే దేశిఛందస్సును చేపట్టడం ఆనాటికి ప్రగతి శీలత. తర్వాత "ద్విపద కావ్యంబు ముదిలంజ దిడ్డికంత" అని నిందించి దేశిని మరుగున పడేసి మార్గ కవిత్వం చలామణి అయిన తర్వాత – మళ్ళీ ద్విపదను– ప్రజాస్వామిక భావన బలపడినంక – ముందుకు తేవడం ఆధునికత. దేశీభావన రెండోదశ, ఆధునిక ప్రజాస్వామిక భావనకు ప్రతిబింబం.

భారతీయ కావ్య తత్వ శాస్త్రం (ఈస్థటిక్స్) ప్రపంచ కావ్యతత్వ శాస్త్రానికి సరిదీటుగా వివేచన చేసిందన్నది కాదనలేని సత్యం. భారతీయ తాత్వికత ఎక్కడ ఘనీభవించిందో కావ్యతత్వ శాస్త్రం సరిగ్గా అక్కడే ఘనీభవించింది. అభినవగుప్తుడి దగ్గర ఆగిపోయింది. శరీరం – ఆత్మ పరిధిలో పరిభ్రమిస్తూ స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోయి ఆధ్యాత్మీకరణకు లోనైంది. ఆగిపోయిన కావ్య తత్వశాస్త్రం గీసిన గీతల్లో సాహిత్యం నకిరం బట్టింది. ఈ స్థితికి అప్పకవి, ప్రబంధయుగ, ప్రబంధ యుగానంతర సాహిత్యం ప్రబలనిదర్శనం. ఈ తత్త్వశాస్త్ర కావ్యతత్త్వ శాస్త్ర మంచుఖండాన్ని పాశ్చాత్య ప్రభావంతో బద్దలు చేసింది సీమాంధ్రలో కట్టమంచి రామలింగారెడ్డి, తెలంగాణలో సురవరం ప్రతాపరెడ్డి.

ఆధునిక సాహిత్య వికాసానికి ఆ ప్రాచీన కావ్య తత్త్వశాస్త్రం ఆటంకం అని భావించినందు వల్ల వాళ్ళు ఈ పని చేసినారు. అయితే ద్విపద రామాయణం ఈ పరిణామం కంటె ముందుది. వర్తమానం లోంచి గతానికి వెళ్ళడం, గతంలోని వర్తమానానికి అనుగుణమైన మంచిని ముందుకు తేవడం, వర్తమానానికి అనుగుణంగా వ్యాఖ్యానించడం ఆధునికత.




కట్టమంచి లాగా అలంకార శాస్త్రం మీద విమర్శ చేయడం ఆధునికత, అంగాంగ వర్ణనను విమర్శించడం లక్షణ గ్రంథానుగుణ కవిత్వాన్ని విమర్శించడం ఆధునికత.

"సీత యౌవనమునొందు విషయమును వేరు కవులు అలంకార శాస్త్రము నంతయు బోధించి యుందురు".

బాహిర (శరీర) వర్ణనను దాటి స్త్రీ ఆంతరిక వర్ణన చేయడమనేది పాశ్చాత్య రొమాంటిక్ ఏజ్ లక్షణం. దానిని కట్టమంచి, సురవరం స్వీకరించి ప్రస్తుతించడం యుగస్వభావం.

ప్రబంధాల మితిమీరిన అంగాంగ వర్ణనకు ప్రత్యామ్నాయంగా ఆధునికమైన అంతరంగ వర్ణనను ముందుకు తేవడమే గాక చరిత్రలోకి వెళ్ళి దీనికి తుల్యమైన వర్ణన రంగనాథ రామయణం నుంచి ముందుకు తేవడం ఇ.హెచ్.కార్ చెప్పినట్టు వర్తమానం నుంచి చరిత్రలోకి వెళ్ళడం ఆధునికత.

కవి స్థల కాలాలను, గ్రంథకర్తృత్వాన్ని నిర్ధారణ చేయడం చారిత్రక విమర్శ (ఆధునిక విమర్శలో భాగమైన) లో భాగం. రంగనాథ రామాయణ కర్త రంగనాథుడు అనే వాదాన్ని పూర్వపక్షం చేసి గోన బుద్ధారెడ్డే కర్త అని సురవరం నిర్ధారించడం ఇక్కడ గమనించవలసిన అంశం.

ఈ చర్చను బట్టి సురవరం తొలి విమర్శకుడే కాక, తొలి ఆధునిక విమర్శకుడు కూడానని తేలుతున్నది.

"దేవులపల్లి రామానుజరావు ప్రాంతీయ దృష్టితో సాహిత్య వివేచన చేసిన తెలంగాణ ప్రాంత తొలి సాహిత్య విమర్శకుడని" (పేజీ–62) లక్ష్మణ చక్రవర్తి అభిప్రాయ పడినాడు. ఇది కూడా చర్చకు నిలబడదు.

తెలంగాణ దృష్టితో సాహిత్య వివేచన చేసిన తొలి సాహిత్య విమర్శకుడా కూడ సురవరం ప్రతాపరెడ్డే. అది ఎట్లానో వచ్చే సంచికలో చూద్దాం.




–డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి
మొబైల్: 98856 82572
మెయిల్: narayanareddy.sunkireddy@gmail.com

# తెలుగు వాచకాల విశిష్టత

## ఏడవ తరగతి తెలుగు వాచకం - నవ వసంతం - 2

**గత సంచిక తరువాయి**

**తె**లంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొలి ప్రయత్నంగా రూపొందించిన తెలుగు వాచకాల్లో అనేక విశేషాలు ఉన్నాయి. పద్యాలు, పాటలు, ఆటలు, పండుగలు, కలిసి మెలిసి ఉండడం, పరోపకారం, మూర్తిమత్వ వికాసం, తల్లిప్రేమ, వృద్ధులపట్ల గౌరవం, కులమతాలకు అతీతమైన దృష్టి పెంపొందించడం, మనుషులందరూ ఒక్కటే అని, ఏ కులం గొప్పది కాదు. ఏ కులం చిన్నది కాదు. అన్ని కులాలు సమానమే అనే దృష్టిని పెంపొదించడానికి తెలంగాణ వాచకాల్లో అనేక జాగ్రత్తలు తీసుకుని పాఠాలు రూపొందించడం గమనించవచ్చు. ఈ ప్రత్యేక దృష్టితో 7వ తరగతి 'తెలుగు ప్రథమభాష' పాఠ్య పుస్తకం నవ వసంతం-2 శీర్షికతో ప్రచురించారు. ఇందులో 12 పాఠాలు ఉన్నాయి. వీరుల సాహసాలను, త్యాగాలను జీవితమంతా ఉపయోగపడే సూక్తులు గల పద్యాలను, పాటలను పొందుపర్చిన ఈ తొలి ప్రయత్నం ఎంతో ప్రశంసనీయం.

1. చదువు-కొఱవి గోపరాజు విద్య ఆవశ్యకత కథాకావ్యం
2. నాయనమ్మ-వృద్ధులపట్ల వైఖరి కథానిక
3. శతక సుధ-శతక కవులు నైతిక విలువలు పద్యం
4. అమ్మ జ్ఞాపకాలు-టి. కృష్ణమూర్తి యాదవ్ మాతృప్రేమ వచన కవిత
5. పల్లె అందాలు-అచ్చి వేంకటాచార్యులు గ్రామసౌందర్య చిత్రణ పద్యం (లఘుకావ్యం)
6. ప్రేరణ ఎ.పి.జె. అబ్దుల్ కలాం-వ్యక్తిత్వ వికాసం ఆత్మకథ
7. శిల్పి-గుఱ్ఱం జాషువా కళా సౌందర్యం ఖండకావ్యం
8. గ్రామాలలోని వేడుకలు క్రీడావినోదాలు - దేవులపల్లి రామానుజరావు సాంస్కృతిక విలువలు రేడియో ప్రసంగం
9. ఏకులం? చెరబండ రాజు సామాజిక స్పృహ గేయం
10. సీత ఇష్టాలు బాలికా విద్య బుర్రకథ
11. శ్రీలు పొంగిన జీవగడ్డ రాయప్రోలు సుబ్బారావు సాంస్కృతిక వైభవం దేశభక్తి గేయం
12. రాణి శంకరమ్మ చారిత్రక వీరగాథ గేయకథ

పల్లె వాతావరణాన్ని తెలిపే చక్కని ముఖచిత్రాన్ని వేశారు. అట్ట లోపల వెలపాటి రామరెడ్డి తెలంగాణ గేయాన్ని ప్రచురించారు. ఆ గేయంలోని అంశాలను నేపథ్యంగా బొమ్మలు ప్రచురించారు.

'చదువు' పాఠం ప్రారంభంలో 'ఆటలాడు వేళలయందు నాడవలయు, జదువుకొనఁదగు వేళలఁ జదువ వలయు, నట్లుకాకున్న నారోగ్య మంతరించు, దాన మేధస్సు బలహీన మౌను సుమ్ము' అనే తేటగీతి పద్యం ఇచ్చి ఈ పద్యానికి సంబంధించిన ఆటలు ఎందుకు ఆడుకోవాలి? ఎప్పుడు ఆడుకోవాలి?, ఏ సమయంలో చదువుకోవాలి? ఎందుకు?, ఆటలు ఆడకుండా టీ.వీ చూస్తూ కూర్చుంటే ఏమౌతుంది? చదువు సరిగ్గా చదువుకోకుంటే ఏమౌతుంది? వంటి ప్రశ్నలను ఇచ్చారు. అలాగే ఈ పాఠం యొక్క నేపథ్యం చదువు యొక్క ఆవశ్యకతను తెలియజెప్పడం ఈ పాఠం యొక్క ఉద్దేశం. ఈ పాఠం కథాకావ్యం ప్రక్రియకు చెందినది. కొఱవి గోపరాజు రచించిన 'సింహాసన ద్వాత్రింశిక చతుర్థాశ్వాసం' నుండి ఈ 'చదువు' పాఠం తీసుకోవడం జరిగింది. ఇందులో వివిధ కథల సమాహార కావ్యం, కథాకావ్యం. దీనిలో వస్తువు ప్రధానం. రమణీయ కథన విధానం కలిగిన కావ్యమే కథాకావ్యం, నీతిని, వ్యవహార దక్షతను కార్యకుశలతను, ఉత్తమ గుణాలను పెంపొందించే కథలు ఇందులో ఇచ్చారు.

'నాయనమ్మ' పాఠం కథానిక ప్రక్రియకు చెందినది. వృద్ధులపట్ల ఎలాంటి గౌరవం, శ్రద్ధ వహించాలో చెప్తుంది ఈ పాఠం. అయితే ఈ మొత్తం పుస్తకంలో నాయనమ్మ కథను ఎవరు రాశారో సీత కష్టాలు అనే బుర్రకథ, రాణి శంకరమ్మ చారిత్రక వీరగాధ గేయ కథను ఎవరు రాశారో పేర్కొనలేదు. వెతికి వారి పేర్లను పేర్కొంటే బాగుండేది.

'శతకసుధ' అనే పాఠంలో సుమతీ శతకం, దాశరథి శతకం, నరసింహ శతకం, వేమన శతకం, నగ్నసత్యాలు శ్రీ శ్రీనివాస బొమ్మల శతకం, యాదగిరి లక్ష్మీనరసింహ శతకం, ఆయా రచయితల పరిచయం పేర్కొన్నారు. వారు రాసిన పద్యాలు ఒక్కొక్కటి ప్రచురించారు. వాటి తాత్పర్యాలు కూడా ఇచ్చారు. వ్యక్తిత్వ వికాసాన్ని పెంచేవిధంగా ఈ శతక పద్యాలు ఉన్నాయి. సత్పురుషుల స్నేహం యొక్క అవసరం, ఉన్నఊరు, కన్నతల్లి, స్వర్గం వంటివి, ధనం బాగా ఉంటే ఏమేం మంచి పనులు చేయవచ్చు వంటివి ప్రశ్నల ద్వారా ఒక చక్కని ఉదాత్త స్నేహశీల వ్యక్తిత్వానికి బాటలు వేస్తాయి ఈ పద్యాలు. చదవండి - తెలుసుకొండి శీర్షికలో కొన్ని శ్లోకాలు ఇచ్చి వాటి అర్థాలు యివ్వడం ద్వారా శ్లోకాలను పరిచయం చేయడం బాగుంది.

టి. కృష్ణమూర్తి యాదవ్ రాసిన 'అమ్మ జ్ఞాపకాలు' పాఠం వచన కవిత ప్రక్రియకు చెందినది. పాఠం ప్రారంభంలో చక్కని తల్లీ పిల్లల చందమామ బొమ్మ ప్రచురించారు. పాఠం ఉద్దేశం అమ్మంటే ప్రేమ, అమ్మంటే ఆప్యాయత, అనురాగం, అమ్మ ప్రాధాన్యతను, విలువను తెలపడం ఈ పాఠం యొక్క ఉద్దేశం. 'అమ్మ ముగ్గులేస్తే

ప్రాంగణం అద్దకపు చీరలా కన్పించేది...' అంటూ ప్రారంభమైన ఈ కవిత అమ్మగురించిన అనేక కోణాలను, అమ్మచేసే అనేక పనులను మనకు తెలుపుతుంది. ఇలా కుటుంబంలో అమ్మ నిర్వహించే పాత్రను తెలుపుతూ అపారమైన ప్రేమను పంచే తల్లిగురించిన పాఠం పెట్టడం ప్రశంసనీయం. అమ్మగురించి, అమ్మను సంతోషపెట్టడం గురించి మాట్లాడగలను అని కొన్ని సూచనలు చేశారు. చదవండి-తెలుసుకొండి సూచనలో కొన్ని పద్యాలు ఇచ్చి వాటి తాత్పర్యాలు ఇచ్చారు. తర్వాత కొన్ని తెలంగాణ పదాలు, వాటి అర్థాలు, కొన్ని తెలంగాణ సామెతలు పొందుపరిచారు.

'పల్లె అందాలు' పాఠం ప్రారంభంలో అందమైన పల్లెసీమ బొమ్మను చిత్రించారు. పల్లెటూర్లు శాంతి సౌభాగ్యాలకు నిలయాలు, ప్రేమాభిమానాలకు కోవెలలు అని పేర్కొన్నారు. ఈ పాఠం పద్య ప్రక్రియకు చెందినది. అయితే సామాజిక సంబంధాల్లో పల్లెలు కొందరికి అనేక హక్కులు, అధికారాలు, సౌకర్యాలను ఇచ్చి ఎక్కువమంది ప్రజలకు అనేక వివక్షలు, అసమానతలను, అణచివేతలను, వేలయేళ్ళుగా కొనసాగిస్తూ వచ్చాయి. అంటరానితనం, కులవివక్ష, కులవృత్తికే పరిమితం కావలసిన దుస్థితి, గ్రామీణ పెత్తందార్ల కింద నలిగిపోయిన ప్రజలు, శతాబ్దాలుగా సాగిన దౌష్ట్యం గ్రామాల్లోనే కొనసాగింది. ఇలా కొన్ని సామాజిక వర్గాలకు వెనుకటి గ్రామ జీవితం ఎంతో బాగున్నట్టు ప్రచారం చేస్తారు. అనుభూతి చెందుతారు. కానీ గ్రామాల్లో అణచివేయబడిన ప్రజలు, ఈ ఆధునిక అభివృద్ధిలో కులవృత్తులు వదిలి, విద్య నేర్చుకుని, ప్రభుత్వ ఉద్యోగులుగా, ఉపాధ్యాయులుగా స్థిర జీవితం సాధించుకున్న జీవితమే మంచిదని భావిస్తారు. అందుకే అలాంటి ప్రజలు 'వెనుకట ఏముండె' అని వెనుకటి కాలం ఎడ్డికాలం, ఆ ఆటలు ఇప్పుడు సాగవు, సాగనీయవు అని అంటుంటారు. నేను ఈ విషయాల గురించి 'వెనుకట ఏముండె' అనే కథ రాశాను. కొందరికి బాల్యం ఎంతో ఆనందంగా ఉంటుంది. ఎందరికో బాల్యం గుర్తొస్తేనే బాధగా ఉంటుంది. అలాంటి జీవితాల గురించి 'వారి యవ్వనం నాకివ్వు' నా బాల్యం వారికివ్వు అని ఒక కవితాత్మక కథ రాశాను. అందువల్ల గ్రామం అందరికి సమానమైన జీవితాన్ని యివ్వలేకపోయింది. అలాగే శ్రమైక జీవన సౌందర్యం గురించి కొన్ని పాఠ్యాంశాల్లో నొక్కి చెప్పాయి. శ్రమ చేసేటప్పుడు చూసేవారికి శ్రమైక జీవన సౌందర్యం కనపడుతుంది. శ్రమ చేసేవారికి చెమట, అలసట, విసుగు, రిస్కు, కష్టం, ప్రమాదాలు అనుభవిస్తుంటారు. వారు శ్రమైక జీవన సౌందర్యం అని అనుభవించలేరు. అలా శ్రమైక జీవన సౌందర్యం అని ఆనందించేవారు ఆ పని చేసేవారు కాదు. చేస్తుంటే చూసేవారు మాత్రమే. అందువల్ల ఈ తేడాను పాఠ్యపుస్తక రూపకర్తలు స్పష్టంగా గుర్తుంచుకోకపోతే శ్రమజీవులకు అన్యాయం చేసినట్టే.

చదవండి-తెలుసుకొండి శీర్షికలో ఉప్పల మల్సూర్ గురించి, మీకు తెలుసా శీర్షికలో మదర్ థెరిస్సా, మల్లినాథ సూరి గురించి చక్కని పరిచయాలు చేశారు. ఎ.పి.జె. అబ్దుల్ కలాం రచనల నుండి సేకరించి 'ప్రేరణ' అనే పాఠం ఇందులో పొందుపరిచారు. కలాంగారి

'పల్లె అందాలు' పాఠం ప్రారంభంలో అందమైన పల్లెసీమ బొమ్మను చిత్రించారు. పల్లెటూర్లు శాంతి సౌభాగ్యాలకు నిలయాలు, ప్రేమాభిమానాలకు కోవెలలు అని పేర్కొన్నారు. ఈ పాఠం పద్య ప్రక్రియకు చెందినది. అయితే సామాజిక సంబంధాల్లో పల్లెలు కొందరికి అనేక హక్కులను, అధికారాలను, సౌకర్యాలను ఇచ్చి ఎక్కువమంది ప్రజలకు అనేక వివక్షలు, అసమానతలను, అణచివేతలను, వేలయేళ్ళుగా కొనసాగిస్తూ వచ్చాయి. అంటరానితనం, కులవివక్ష, కులవృత్తికే పరిమితం కావలసిన దుస్థితి, గ్రామీణ పెత్తందార్ల కింద నలిగిపోయిన ప్రజలు, శతాబ్దాలుగా సాగిన దౌష్ట్యం గ్రామాల్లోనే కొనసాగింది.

ఆత్మకథ నుండి ఈ పాఠ్య భాగం స్వీకరించబడింది. ఈ పాఠం ఆత్మ కథ ప్రక్రియకు చెందినది. ఒక వ్యక్తి తన జీవిత విశేషాలను తానే గ్రంథం చేసుకుంటే అది ఆత్మకథ. ఆత్మకథనే స్వీయ చరిత్ర అని కూడా అంటారు. ఇతరులు రాస్తే జీవిత చరిత్ర అంటారు. కష్టపడి పట్టుదలతో ముందుకు సాగితే ఎంత ఎత్తుకు ఎదగవచ్చో అబ్దుల్ కలాం జీవితం ఒక స్ఫూర్తిని ఇస్తుంది.

గుఱ్ఱం జాషువా రచించిన ఖండకావ్యం లోంచి 'శిల్పి' అనే పద్య భాగం ఇందులో చేర్చారు. ఇది ఖండకావ్య ప్రక్రియకు చెందినది. ఖండకావ్యం అంటే పెద్ద కావ్యం రాయకుండా, చిన్నగా రాయడం. అలాంటివన్నీ కలిపి పుస్తకంగా వేసినప్పుడు ఖండకావ్యం అంటారు. శిల్పి యొక్క గొప్పతనాన్ని ఈ పాఠం వివరిస్తుంది. అజంతా గుహల్లోని నైపుణ్యం తలెత్తుకుంది. ఓ శిల్పి శ్రేష్ఠుడా నువ్వు పుణ్యమూర్తివి అంటూ జాషువా కీర్తించారు. ప్రాజెక్టు పనిలో మీ గ్రామంలోని, ప్రాంతంలోని కళలను గురించి, కళాకారుల గురించి వివరాలు తెలుసుకొని వాళ్ళ గొప్పతనాన్ని గురించి నివేదిక రాయండి అని పేర్కొనడం బాగుంది.

'గ్రామాలలోని వేడుకలు - క్రీడావినోదాలు' గురించి దేవులపల్లి రామానుజరావు రాసిన పాఠ్యాంశం ప్రచురించారు. ఈ పాఠం అనేక ఆటపాటలను తెలుపుతుంది. అందులో కొన్ని కాలక్రమంలో నశించిపోతున్నాయి. మరికొన్ని కొత్త ఆటపాటలు వచ్చి చేరుతున్నాయి.

చెరబండరాజు రాసిన 'ఏ కులం?' అనే పాఠం చేర్చారు. ఎంతో చక్కని పాఠను పాటలో మరెంతో, మరెంతో చక్కని అవగాహనతో ఈ పాఠం కుల మతాలను, వృత్తులను గురించిన చక్కని అవగాహన, సమైక్యతా భావనను కలిగిస్తుంది.

'సీత కష్టాలు' బుర్రకథ పాఠంలో బుర్రకథ వేషధారణ, ప్రదర్శనను బొమ్మగా వేశారు. ఆధునిక జీవితానికి సంబంధించిన అంశాలతో ఒక మంచి బుర్రకథను ఇందులో చేర్చారు. జాతీయ స్ఫూర్తిని కలిగించే ఈ పాఠం చరిత్రతో పాటు, ఆధునిక విషయాలను తెలియజేస్తుంది. ప్రాజెక్టు పనిలో మీ ప్రాంతంలోని కళారూపాలను తెలుసుకొని మీకు నచ్చిన కళారూపాన్ని గురించి రాయమని కోరారు. మీకు తెలుసా శీర్షికలో మలాలా గురించి పరిచయం చేశారు. చద వండి శీర్షికలో మాట్లాడడం ఒక కళే అనే ఒక పేజీ వ్యాసాన్ని ప్రచురించారు.

శ్రీలు పొంగిన జీవగడ్డ పాఠం రాయప్రోలు సుబ్బారావు రాశారు. ఇది మాత్ర ఛందస్సులో అంత్యప్రాసలతో రాసిన గేయ ప్రక్రియకు చెందినది. ఇందులో గోదావరి, కృష్ణా, మంజీర, ప్రాణహిత, శబరి మొదలైన మన నదుల గురించి లేకపోవడం ఒక లోపమనే చెప్పాలి. తుంగభద్ర నది గురించి మాత్రమే ప్రశంసించారు. కాకతీయుల కదన రీతిని ప్రశంసించినప్పటికి చారిత్రిక అంశాల కన్నా, ఇతిహాస అంశాలకు ప్రాధాన్యత ఇచ్చాడు. జైనమహావీరుడు, బుద్ధుడు, అశోకుడు, మౌర్య చక్రవర్తులు, శాతవాహనులు మొదలుకొని సాగిన చరిత్రను కలుపుకొని రాసివుంటే బాగుండేది. ఇలాంటి పాఠాలు ఎన్నిక చేసినప్పుడు ఎప్పుడో రాసిన వాటిలో అనేక లోపాలు ఉంటాయని, అనేక కోణాల్లో గమనించి చేర్చడం అవసరం. ఈ మాత్రా ఛందస్సులో పిల్లలు రాయడాన్ని ప్రోత్సహించడం ఎంతో అవసరం. నేను చిన్నప్పుడు ఇలాంటివి చాలా రాశాను. మాత్ర ఛందస్సు తెలిస్తే రాయడం ఎంతో సులభం. ఈ పాఠం తర్వాత స్వీయ రచనల్లో బానిసతనం అంటే ఏమిటి? అనే ప్రశ్న ఇచ్చారు. ఉపాధ్యాయులు తమ నైపుణ్యాన్ని, అధ్యయనాన్ని ఎంతగానో ఉపయోగించుకునే సందర్భం ఇది. పదజాల వినియోగంతో పాటు వాక్యాల రీతులను, విభాగాలను పరిచయం చేశారు. విరామ చిహ్నాలు ఎక్కడ ఎలా ఉంచాలో? పని చెప్పారు. ప్రాజెక్టు పనిలో భారతమాతను స్తుతించే గేయాలను సేకరించి రాసి ప్రదర్శించమని కోరారు.

ఈ పాఠం తర్వాత 'గర్వించదగ్గ తెలంగాణ బిడ్డ కెప్టెన్ విజయ రఘునందన్‌రావు' జీవిత పరిచయం ఇచ్చారు. 1965లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం చెందిన రఘునందన్‌కు భారత ప్రభుత్వం 'వీరచక్ర' అవార్డు ఇచ్చి గౌరవించింది.

'రాణి శంకరమ్మ' పాఠం చూసిన తర్వాత ఆశ్చర్యం వేసింది. ఈ పాఠం చూసేదాక రాణి శంకరమ్మ గురించి నాకు తెలియనే తెలియదు. ఇలా మన చరిత్ర మనకు తెలియకుండా చేశారు. కాకతీయ రుద్రమదేవితో పోల్చదగిన 'రాణిశంకరమ్మ' పాఠం ఉయ్యాల పాటలో కొనసాగుతుంది. ఈ పాఠం చివర స్త్రీని మాతృదేవతగా భావించి, పూజించే అంశానికి సంబంధించిన పేరాను యివ్వడం చాలా బాగుంది. సృజనాత్మకత శీర్షికలో రాణి శంకరమ్మ చరిత్రను ఏకపాత్రాభినయం చేయడానికి వీలుగా రచన చేసి ప్రదర్శించండి అని కోరారు. ఉపాధ్యాయుల శక్తి సామర్థ్యాలకు ఇది ఒక గొప్ప అవకాశం. కొన్ని సందులను, సమాసాలను వివరించారు. బతుకమ్మ పాటల్లో పాడుకునే వీరగాథలను సేకరించి రాసి ప్రదర్శించమని ప్రాజెక్టుపని నిర్దేశించారు.

**జైనమహావీరుడు, బుద్ధుడు, అశోకుడు, మౌర్య చక్రవర్తులు, శాతవాహనులు మొదలుకొని సాగిన చరిత్రను కలుపుకొని రాసివుంటే బాగుండేది. ఇలాంటి పాఠాలు ఎన్నిక చేసినప్పుడు ఎప్పుడో రాసిన వాటిలో అనేక లోపాలు ఉంటాయని, అనేక కోణాల్లో గమనించి చేర్చడం అవసరం. ఈ మాత్రాఛందస్సులో పిల్లలు రాయడాన్ని ప్రోత్సహించడం ఎంతో అవసరం. నేను చిన్నప్పుడు ఇలాంటివి చాలా రాశాను. మాత్ర ఛందస్సు తెలిస్తే రాయడం ఎంతో సులభం. ఈ పాఠం తర్వాత స్వీయ రచనల్లో బానిసతనం అంటే ఏమిటి? అనే ప్రశ్న ఇచ్చారు. ఉపాధ్యాయులు తమ నైపుణ్యాన్ని, అధ్యయనాన్ని ఎంతగానో ఉపయోగించుకునే సందర్భం ఇది.**

7వ తరగతి ఉపవాచకంలో ఈ పాఠాలు చేర్చారు. 1. అద్భుతమైన సెలవులు, 2. రుద్రమదేవి, 3. మన పండుగలు, 4. www. కారడవి.కామ్, 5. ఆరుట్ల కమలాదేవి

ఒక్కొక్క పాఠం ఒక్కొక్క ప్రత్యేకతను కలిగి ఉంది. www. కారడవి.కామ్ కథ కొత్తగా ఉంది. ఎంతో ఆసక్తికరంగా ఉన్న ఈ కథను నేషనల్ బుక్‌ట్రస్ట్ ప్రచురణ నుండి తీసుకొని ఇందులో చేర్చారు. ఆరుట్ల కమలాదేవి తెలంగాణ స్వాతంత్ర్య సమర యోధురాలు, రాణి రుద్రమదేవి కాకతీయ సామ్రాజ్యాన్ని ఏలిన వీర వనిత. మన పండుగలతో సహా ఈ పాఠాలన్నీ మన చరిత్రను, సంస్కృతిని, పండుగలను, జీవన విధానాన్ని తెలుసుకోవడానికి స్ఫూర్తి పొందడానికి ఎంతగానో ఉపకరిస్తాయి. పుస్తకం చివరలో పదాలు-అర్థాలు శీర్షికలో చిన్నపాటి నిఘంటువు లాగా యివ్వడం బాగుంది. అలాగే పర్యాయ పదాలతో పాటు నానార్థాలు, ప్రకృతి, వికృతులు సూచించడం ఎంతో బాగుంది. చివరి అట్టపై పాఠంలోని అంశాలను అందులోని ఆయా రచయితల ఫోటోలను ప్రచురించడం చాలా బాగుంది.

*With Best Compliments*

From

**VIVA EDUCATION**

**సూచనలు:**

పాఠం చివరలో పదాలు-అర్థాలు, పర్యాయ పదాలు, నానార్థాలు, ప్రకృతి-వికృతులు, వ్యుత్పత్తి అర్థాలు, విశేషాంశాలు, విద్యార్థులకు సూచనలు యివ్వడం పిల్లలకు, ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగం. అలాగే ఇందులో పాఠం చివరలో ఇచ్చిన భాషా వ్యాకరణాంశాలను కూడా అన్నీ కలిపి సంక్షిప్తంగా మరోసారి వాచకం చివరలో చేర్చితే మరింత సమగ్రంగా ఉంటుంది.

భాష మారుతున్నది. ఒకోసారి వేగంగా మారుతుంది. ఒకోసారి మారినట్టు కనపడదు. కానీ ఎంతో కొంత మారుతూనే ఉంటుంది. రెండువేల ఏళ్ళ నాడు శాతవాహనుల కాలంలో తెలుగు భాష నేటి తెలుగు భాషలో ఎన్నో మార్పులు కనపడతాయి. ఈ మార్పుల్లో పదాల రూపాలు, వాక్య రూపాలు అర్థ వైవిధ్యం, అర్థ వైరుధ్యం, గద్యంలో వాక్య నిర్మాణం, శైలి ఎంతో మారుతూ వచ్చింది. శాస్త్ర విజ్ఞానం, టెక్నాలజీ, అనేక శాస్త్రాలు విస్తరిస్తున్న కొద్దీ, వాటి ప్రాతిపదికగా జీవితంలో ప్రవేశిస్తున్న అనేక సరుకులు, సౌకర్యాలు, పదాలు, నుడికారాలు పెరుగుతూ వస్తున్నాయి. ఒకనాటి భాష ఈనాడు లేదు. మారుతూ వస్తున్న ఈ భాషా పరిణామాన్ని ఒకటి రెండు పాఠాల్లో పరిచయం చేయడం అవసరం. అదికూడా వృద్ధ పండితుడికి, అతనితో ముచ్చటించే మనుమలు, ముని మనుమలు, మనుమరాళ్ళు మాట్లాడుకుంటున్న సంభాషణ కథన రూపంలో చేర్చితే మరింత స్పష్టంగా భాషా పరిణామం చెప్పే అవకాశం ఉంటుంది. వెనుకటి సాహిత్యంలో, పద్యాల్లో, కావ్యాల్లో, ఆ భాష అలా ఎందుకు ఉందో, నేడు ఆ అవసరాలు తీరి నూతన అవసరాలు ఎలా పెరుగుతూ వచ్చాయో అందుకు అనుకూలంగా భాషను, వాక్యాలను, వాడుక భాషను ఎలా అభివృద్ధి పర్చుకుంటున్నామో ఏడో తరగతి నుండి పదో తరగతి దాకా, కొన్ని పాఠాలు చేర్చి వివరించడం అవసరం. అప్పుడే పదో తరగతి పూర్తయ్యేసరికి భాషపట్ల ఒక చక్కని అవగాహన కలుగుతుంది. స్వయంగా వార్తలు రాయడం, కరపత్రాలు, వ్యాసాలు, కవితలు, పాటలు, లేఖలు, పద్యాలు, కథలు రాసే సామర్థ్యం పెరుగుతుంది. తద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. భాషపట్ల ఒక పట్టు వస్తుంది. ఏడో తరగతితో అప్పర్ ప్రైమరీ స్కూల్ చదువు పూర్తవుతుంది. ఆ తర్వాత ఎనిమిదో తరగతి నుండి ఉన్నత పాఠశాలలో చేరతారు. అందువల్ల ఇంకా అనేక అంశాలు ఏడో తరగతి వాచకంలో పొందుపర్చాలి. ఇందుకు అనుబంధంలో సూచనలు ఇచ్చాను.

**- బి.ఎస్. రాములు**

**మొబైల్: 8331966987**

**మెయిల్:** bsramulu@gmail.com

## సంజీవయ్య పార్క్‌లో భారీ జాతీయ జెండా

తెలంగాణ ఆవిర్భవించి రెండేండ్లు పూర్తవుతున్న శుభ సమయంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు హైదరాబాద్‌లోని సంజీవయ్య పార్క్‌లో ఆవిష్కరించిన భారీ జాతీయ జెండా హైదరాబాద్‌కు మరో ప్రత్యేకతను సంతరింపచేసింది. దీన్ని ఎగురవేసిన తరువాత పార్క్‌కు సందర్శకుల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. 92 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సంజీవయ్య పార్కు ఈ జెండాతో నూతన అందాలు పొందింది.

జెండా వివరాలు:

త్రివర్ణ పతాకం కొలతలు: 72 అడుగుల పొడవు, 108 అడుగుల వెడల్పు

జెండా స్తంభం ఎత్తు: 291 అడుగులు, స్తంభం బరువు: 40 టన్నులు

పతాకం బరువు: 65 కేజీలు, తయారు చేయడానికి పట్టిన సమయం: 25 రోజులు

ప్రాజెక్టు వ్యయం : రూ. 3 కోట్లు

స్తంభాన్ని తయారు చేసిన వారు: స్కిప్పర్ లిమిటెడ్, కోల్‌కతా

జెండా సరఫరా చేసిన వారు: ఫ్లాగ్ షాప్, ముంబై, ఫిలెటెక్స్ హాబీ సొసైటీ, ఖమ్మం

ప్రాజెక్టు పర్యవేక్షణ: రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ



# నకాశి కళకు వన్నె తెచ్చిన

# చేర్యాల్ స్క్రోల్ పెయింటింగ్

**చే**ర్యాల్ స్క్రోల్ పెయింటింగ్ అనేది నకాశి ఆర్ట్‌కు స్థానిక ప్రత్యేక శైలిని జోడించిన హస్తకళ. తెలంగాణకు మాత్రమే పరిమితమైన అద్భుతకళారూపాలను ఇందులో చూడవచ్చు. ఈ శైలి తెలంగాణలో మాత్రమే కానవస్తుంది. వీటినే పటం బొమ్మలుగా వ్యవహరిస్తుంటారు. ఫిల్మ్ రోల్, కామిక్ స్ట్రిప్ తరహాలో ఈ పటాలు పురాణగాధలను, ఇతిహాసాలను వివరిస్తుంటాయి. సాధారణంగా జానపద పురాణాల, చిన్న చిన్న కథలకు దృశ్యరూపం వీటిలో ఉంటుంది. ఒకప్పుడు ఈ కళ దేశం లోని వివిధ ప్రాంతాల్లో కూడా ప్రాచుర్యంలో ఉండింది. ఎక్కడికక్కడ ఈ కళ ప్రాంతీయ విశిష్టతలను పొంది ఒక్కో చోట ఒక్కో శైలిగా పేరొందింది. స్థానిక సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఈ కళను ప్రభావితం చేస్తూ వచ్చాయి. అదే విధంగా చేర్యాల్ పటం చిత్రాలు తెలం గాణలో బాగా పేరొందాయి. టీవీలు, సినిమాల, కం ప్యూటర్ల రాకతో వివిధ ప్రాంతాల్లో ఈ కళ సన్నగిల్లుతూ వచ్చి చివరకు చేర్యాల్ గ్రా మాన్ని చివరిస్థానంగా చేసుకొని స్థిరపడింది.



పటం బొమ్మలకు సుసంపన్న చరిత్ర ఉంది. ఆసియా కళాత్మక సంప్రదాయాల్లో ఇవి ముఖ్యపాత్రను పోషించాయి. చైనాలో స్క్రోల్ పెయింటింగ్స్ అనేవి రాచరికపు ఆచార వ్యవ హారాల్లో భాగంగా ఉండేవి. భారతదేశంలో మాత్రం ఈ కళ గ్రామీణుల జీవితాలకే పరిమితమై జానపదకళగా వెలుగొందింది.

భారతదేశంలో ప్రతి ప్రాంతం, గ్రామం కూడా తనదైన శైలిలో పటం బొమ్మల సంప్రదాయాన్ని వృద్ధి చేసుకుంది. స్థానిక విశ్వాసాలు, ఆదరణ, సామాజిక-ఆర్థిక పరిస్థితులపై ఆధారపడి విషయం, రూపం, సాంకేతికతలలో తమదైన ముద్రను కలిగి ఉంటాయి.

రాజస్థాన్‌లో ఈ కళ ద్వారా పభుజీ కి పాద్, దేవ్‌నారాయన కథ, ధోలా, మరు లాంటి కథలు ప్రచారం చేస్తారు. గోవాలో దశావ తారం ప్రఖ్యాతి గాంచింది. మహారాష్ట్రలో పింగులి, చిత్రకథా సం ప్రదాయాలు పేరొందాయి. మహారాష్ట్ర, గుజరాత్ అధునాతన స్క్రోల్ పెయింటింగ్ సంప్రదాయం 'ప్రశస్తి పత్ర'కు ప్రఖ్యాతి చెందాయి. ఒడిషా, బెంగాల్‌లు పట చిత్ర సంప్రదాయానికి పేరొందాయి.

**తెలంగాణలో...**

నకాశిపెయింటింగ్స్, చేర్యాల స్క్రోల్ పెయింటింగ్స్, పట చిత్రాలు... పేర్లు వేరైనా కళ ఒక్కటే. ఈ ఆర్ట్‌కు వందల ఏళ్ల చరిత్ర ఉంది. పటం చిత్రాలను గీసే కళాకారులు నకాశిలు. ఒకప్పుడు వీరు ఎక్కువగా కరీంనగర్‌లో ఉండేవారు. ఇప్పుడు వేములవాడ తదితర ప్రాంతాల్లో ఉన్నారు. దేవాలయాలలో విగ్రహాలు, హంసవాహనం, గరుడవాహనం, సింహవాహనం, చెక్క రథాలు లాంటివి తయారు చేయడంలో వీరు నిష్ణాతులు. వీటిని ఎత్త పొనికి కర్రతో చేసేవారు. పండుగల సమయంలో ఉత్సవ విగ్రహాలకు, రథాలకు రంగులు వేసేవారు. గ్రామ దేవతలు ఎల్లమ్మ, మైసమ్మ, మహంకాళమ్మ, దుర్గమ్మల విగ్రహాలను తయారు చేసేవారు.

తెలంగాణలో నకాశి వారసత్వం వందల ఏళ్ళుగా కొనసాగుతున్నది. ఆ కళాకారుల కుంచె పురాణాల కథలను బొమ్మల రూపంలో చెబుతున్నది. చరిత్రను చిత్రరూపంలో చిత్రిస్తున్నది. సాంస్కృతిక సంపదను భావితరాల వారికి వారసత్వంగా అందిస్తున్నది. సంప్రదాయం, పురాణం, విశ్వాసాలు, ఊహల సమ్మేళనంగా ఆ చిత్రం రూపుదిద్దుకుంటుంది. అదే నకాశి. పటం చిత్రకారులుగా పేరొందిన నకాశీలు తెలంగాణకు ప్రత్యేకతను సంతరింపచేశారు. కొన్ని దశాబ్దాలుగా

ఇతర అనేక హస్తకళలకు పట్టిన దుర్గతే దీనికీ పట్టింది. ఆ కళకు ఆదరణ తగ్గి చేతిలో పనిలేకపోవడంతో ఆ కళాకారులంతా వేరే వృత్తుల్లోకి వెళ్ళిపోయారు. మిగిలిన ఒకటి అరా కుటుంబాల వారు పల్లెలను విడిచి నగరాలకు వలస వెళ్ళారు. వారు తమకళకు ఆధునిక టెక్నాలజీ, మార్కెటింగ్ ఎత్తుగడలను జోడిస్తున్నారు. తద్వారా ఈ కళను సజీవంగా ఉంచడంతో పాటు ఎంతో కొంత ఆదాయాన్ని కూడా పొందుతున్నారు.



### నకాశి పటాలు కుల పురాణాలకు కీలకం

వివిధ కులాల ఆవిర్భావం, గొప్పదనాన్ని వివరించే కులపురాణాలను ఆయా కులాల ఆశ్రిత కులాల వారు చెబుతారు. అలా చెప్పడం ద్వారా వచ్చే కొద్దిపాటి ఆదాయంతో తమ బతుకులు గడుపుతుంటారు. ఆవిధంగా ఆ కుల పురాణాలను పటాలపై దృశ్యీకరించి ఇచ్చేవారు నకాశిలు. పద్మశాలీలకు భక్త మార్కండేయ కథను చెప్పే కూనపులివారికి, గౌండ్లకు కంతమ మహేశ్వర పురాణం చెప్పే ఏనుటివారికి, చాకలివారికి దక్షపురాణం, చాకలి పురాణం వివరించే పటపోళ్లకు, మాదిగలకు జాంబవ, ఆది పురాణాలు చెప్పే డక్కలివారికి, మాలలకు గుర్రం మల్లయ్య కథను చెప్పే గుర్రపోళ్లకు, మంగలి కులానికి రామాయణం చెప్పే అద్దపోళ్లకు, ముదిరాజ్‌లకు మహభారతం చెప్పే కాకి, గొల్ల కురుమలకు కాటమరాజు కథలను చెప్పే మందహెచ్చులకు వీరిచ్చిన చిత్రపటాలే ఆధారం. అయితే ఒక్కసారి గీసిచ్చిన బొమ్మలు రెండు, మూడు వందల సంవత్సరాలపాటు పాడవ్వకుండా ఉంటాయి. తరతరాలుగా ఈ పటాలను వారసత్వంగా అందిపుచ్చుకునే కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. అదీ నకాశి చిత్రకళ విశిష్టతగా చెప్పవచ్చు.

### చేర్యాల పెయింటింగ్స్‌గా మారిన వైనం

ఇలా ఒక్కసారి చేసి ఇచ్చిన పటాలు వందల ఏళ్లపాటు ఉండటం, ఆ ఒక్క చిత్రపటంపైనే పదుల కుటుంబాలు ఆధారపడటం వల్ల... చిత్రపటాల కొనుగోలు అంతంత మాత్రమే. దీనికితోడు ఆధునికత నకాశి కళపై ప్రభావం చూపింది. ఫొటోస్ వచ్చాయి. సిమెంట్, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వర్క్, ఎనామిల్ కలర్స్ వాడకం పెరిగింది. దీంతో రానురాను నకాశి పని తగ్గిపోయింది. వివిధ ఆశ్రిత కులాల కళాకారులు కూడా ఆ వృత్తి లో నుంచి బయటకు వస్తున్నారు. దీంతో నకాశీ కళాకారులు బతుకుదెరువు నిచ్చే ఇతర పనులను ఆశ్రయించారు. 1942లో ఒకరిద్దరు కళాకారులు వరంగల్ జిల్లా చేర్యాలకు వలస వచ్చి తమ కుటుంబసభ్యులకు నకాషి నేర్పించారు. ఆ విధంగా కొన్నేళ్ళ తరువాత నకాశి పటచిత్రాలు కాస్తా చేర్యాల పెయింటింగ్స్‌గా మారిపోయాయి.

1978లో ప్రభుత్వం వీరిని గుర్తించింది. ఆ గుర్తింపే వీరి జీవితాలను మలుపు తిప్పింది. లేపాక్షితో అనుబంధంతో కొంత మార్పు వచ్చింది. ప్రాచీనతకు ఆధునికతను జోడించడం మొదలుపెట్టారు. రామాయణ, మహాభారతాలను చిత్రీకరించి ఇవ్వడం, ఫొటో ఫ్రేమ్స్‌ను తయారు చేయడం, విగ్రహాలను తయారు చేసే పద్ధతిలోనే మాస్క్‌లను తయారు చేయడం మొదలుపెట్టారు. దేశవ్యాప్తంగా జరిగే ఎగ్జిబిషన్స్‌లో పాల్గొంటున్నారు. అయినప్పటికీ 500 ఏళ్ల చరిత్ర ఉన్న కళకు రావాల్సి నంత ప్రచారం రాలేదు. ఇప్పుడిప్పుడే పరిస్థితి కాస్తంత మెరుగు పడుతోంది.

### సహజమైన రంగులు

నకాశి కళలో సహజసిద్ధ రంగులకే పెద్దపీట. మొదట ఖాదీ కాన్వాస్‌ను పెయింటింగ్‌కోసం సిద్ధం చేసుకుంటారు. సహజంగా తయారు చేసిన రంగులను ఉపయోగించి పెయింటింగ్స్ వేస్తారు. రంగురాళ్లను కొనుగోలు చేసి... వాటిని నూరుకొని రంగులు తయారు చేసుకుంటారు. తిరుమని చెట్లనుంచి తీసిన బంకను నూరి నీళ్లు కలిపి సిద్ధం చేసుకుంటారు. ఈ రెంటిని కొంచెంకొంచెంగా కలిపి రంగులద్దుతారు. ఒక్కో పెయింటింగ్ కొన్ని నెలలు కూడా పట్టవచ్చు. ఇక మాస్కులు, విగ్రహాల తయారీ పెద్ద తతంగమే. ఒక్క మాస్క్ త యారీకి వారం రోజుల సమయం పడుతుంది. ముందుగా బుర్కపెద్దల మట్టి, కోడిగుడ్డు సొన, బంక కలిపి బొమ్మను తయారు చేస్తారు. ఇది ఆరడానికి రెండు రోజులు పడుతుంది. దానికి చింత అంబలితో బట్టను అతికిస్తారు. అతికించిన బట్టపై రెండుమార్లు సున్నం నీటిని అద్దుతారు. ఆ తరువాత వాటర్ కలర్స్ వేస్తారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయితే గానీ ఆకట్టుకునే కళాఖండాలు తయారుకావు.

### కాలంతోపాటు మారుతూ...

ఇప్పుడు కృష్ణలీల, రామాయణ, మహాభారతాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. కృష్ణుడి పటాలను ఇళ్లలో ఇంటీరియర్ డెకరేషన్ కోసం వాడుతున్నారు. నగరాల్లో పెరుగుతున్న ఇప్పటి తరానికి గ్రామీణ వాతావరణం గురించి తెలుసుకోవాలన్న తపన మొదలైంది. తమ మూలాల గురించి అన్వేషణ ప్రారంభమైంది. అందుకే కులవృత్తులు, వ్యవసాయం, గ్రామీణ వాతావరణం, గంగిరెద్దులు, హరిదాసులు, బతుకమ్మ, బోనాలు, ముగ్గులు వంటి చిత్రపటాలకు డిమాండ్ ఎక్కువ ఉంటోంది. ఆయా సంస్థల ఆవరణలలో హ్యాంగ్ చేయడానికి, హొటల్స్‌లో ఇంటీరియర్ డిజైనింగ్ కోసం కూడా ఈ పెయింటింగ్స్‌ను వాడుతున్నారు. కళ మీద ఉన్న మక్కువతో ఇంట్లో మార్బుల్స్‌పైనా ఈ పెయింటింగ్‌ను వేయిస్తున్నారు. వాటర్‌ప్రూఫ్ కోసం వార్నిష్ కోటింగ్ ఇస్తారు.

ఆధునికత మోజులో పడి పురాతన కళారూపాలను మర్చిపోతున్న తరుణంలో ఏదోవిధంగా వాటికి జీవం పోస్తున్న వారికి యావత్ తెలంగాణ సమాజం రుణపడి ఉంటుంది. అలాంటి వారి చరిత్రలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

-దక్కన్ న్యూస్ ద

# షితాబ్ ఖాన్ మహల్

**కా**కతీయ కట్టడాల పర్యటన గాని, ప్రత్యేకించి వరంగల్ కోట పర్యటన గాని ఆ కోట మధ్యలోనే ఉన్న ఖుష్ మహల్‌ను దర్శిస్తేగాని పూర్తికాదు.

ఇది వరంగల్ కాకతీయుల కోట మధ్యలో ఉన్న కాకతీయ తోరణాలకు దగ్గరనే ఉంది. ఆ తోరణాల మధ్య దొరికిన స్వయంభు దేవాలయ శిథిల శిల్పాలను సైతం ప్రస్తుతం ఈ ఖుష్ మహల్‌లోనే భద్రపరిచారు. పర్యాటకులు వాటిని చూసి ఆశ్చర్య చకితులవుతుంటారు. లోతైన ఆలోచనల్లోకి వెళుతూ ఉంటారు.

ఖుష్‌మహల్ మరో పేరు 'షితాబ్ ఖాన్ సౌధం'. షితాబ్ ఖాన్ అనే వరంగల్ రాష్ట్రపు రాజు క్రీ.శ.1500 ప్రాంతంలో ఆ సౌధాన్ని కట్టించాడు. ఆయన అసలు పేరు సీతాపతి. ఆయన క్రీ.శ. 1504 జనవరి 21 నాడు వేయించిన శిలా శాసనం వరంగల్ కోటలోని దక్షిణ తోరణం దగ్గర దొరికింది. ఆయన మంత్రి ఎనుములూరి పెద్దన పోషణలో చరిగొండ ధర్మన్న అనే కవి 'చిత్రభారతం' అన్న అద్భుతమైన కావ్యం రాశాడు. సమకాలిక ముస్లిం చరిత్రకారుల రచనల్లో కూడా షితాబ్ ఖాన్ ప్రస్తావించబడ్డాడు.

సీతాపతి బోయ కులానికి చెందినవాడు. బోయ కులం అంటే 'భోగం కులం' అని కొందరు, 'భోజ కులం' అని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు. 'భోజ' అనేది గ్రామాధికారుల కులం. ఏదేమైనా సీతాపతే షితాబ్ ఖాన్ అయ్యాడు.

సీతాపతి తండ్రీ, అతడి తాతలు విలువిద్యలో, మల్లయుద్ధంలో నిష్ణాతులు. షితాబ్ ఖాన్ ఆ విద్యలను నేర్చుకొని క్రీ.శ.14వ శతాబ్ది చివరి దశాబ్దాల్లో ఓరుగల్లు (తెలంగాణ) రాజ్యాన్ని పాలిస్తున్న బహమనీ సుల్తానుల సైన్యంలో సైనికుడిగా చేరాడు. ఆయన తన యుద్ధవిద్యలతో వారిని మెప్పించి, ముస్లిం మతంలోకి మారి తన పేరును సీతాపతి నుండి షితాబ్ ఖాన్‌గా మార్చుకొన్నాడు. ఇలా వారి అభిమానాన్ని చూరగొని, ఓరుగల్లు దుర్గాధిపతిగా, తెలంగాణ రాష్ట్ర గవర్నరుగా ఎదిగాడు. అడ్డువచ్చిన రాజాద్రి (రాచకొండ, నల్గొండ జిల్లా) రాజులనూ జయించాడు.

తన సార్వభౌములైన ముస్లిం రాజులను సంతృప్తి పరచడం కోసం షితాబ్ ఖాన్ వరంగల్ కోటలోనే రాజ దర్బార్ కట్టించాడు. వరంగల్ కోట కొన్ని శతాబ్దాల కాలం తెలుగు వారి రాజధాని కాబట్టి ప్రజల మనోభావాలను సంతృప్తి పరచడం కోసం కూడా ఆ కోటలోనే ఈ రాజదర్బార్ కట్టడానికి ఒక ప్రధాన కారణమయ్యుంటుంది. అది తెలంగాణలోను, యావత్ తెలుగుదేశంలోనూ కట్టిన మొట్ట మొదటి ప్రజా భవనం. అందులో ప్రజలు, ప్రముఖులు షితాబ్ ఖాన్‌ను కలిసేవారు.



షితాబ్‌ఖాన్ కట్టించిన ఖుష్ మహల్ లోపలి దృశ్యం

ప్రజలకు అందుబాటులో ఉన్న భవనంలోనే తన నివాసం కూడా ఉండాలని షితాబ్‌ఖాన్ ఆ మహల్‌లోనే రాజ గృహాలను, రాణీ వాసాలను ఏర్పాటు చేశాడు. మనం ఆ సౌధంలోకి ప్రవేశించగానే ఎడమ పక్క, కుడి పక్క, పైన కనిపించే గదులు అవే! మొత్తంగా ఈ సౌధం నిర్మాణం ఇంగ్లీష్ అక్షరం 'టీ' (క్యాపిటల్/పెద్ద అక్షరం) ఆకారంలో ఉంటుంది. నిలువు గీత అనేది పొడవైన దర్బారును సూచిస్తుంది. అడ్డ గీత రాజు, రాణి, మంత్రుల/అధికారుల నివాస గదులను సూచిస్తుంది. వీటిని దాటాకే దర్బారులోకి ప్రవేశిస్తాం. ఇంత అందమైన దర్బారు, ఇప్పటికీ నిలిచి ఉన్నది తెలుగుదేశంలో ఇదొక్కటే.

ఈ దర్బారు పొడవు సుమారు 90 అడుగులుండగా, వెడల్పు-ఎత్తులు వరుసగా 45, 30 అడుగులుంటాయి. దర్బారు పైకప్పును కొనదేలిన ఆర్చిలు మోస్తున్నట్లుగా ఉన్నాయి. ఆర్చిల మధ్యన కర్ర దూలాలున్నాయి. నిజానికి పైకప్పును మోస్తున్నది ఈ దూలాలే. పెద్ద



ఖుష్‌మహల్ ప్రాంగణంలో




ఖుష్ మహల్ ప్రాంగణం

పెద్ద పరిమాణాల్లో కనిపిస్తున్న ఈ ఆర్చీలు కేవలం అందాన్ని అతిశయింపజేయడానికే. ఆర్చీల ముందు దర్వాజా లాంటి ఆర్చి, దాని పైన అందమైన అల్లికలతో కూడిన కిటికీలు దర్బార్ శోభను మరింత పెంచాయి.



దర్బారులోకి ప్రవేశించే ప్రాంగణం (ఎలివేషన్) మరింత అందమైంది. నిజానికిది రెండంతస్తుల్లో ఉంది. ఇందులోని రెండు వరుసల్లో ఉన్న స్తంభాలు మూడు పొడవాటి హాల్‌లను ఏర్పరుస్తున్నాయి. ఈ కింద, పైనున్న గదులు రాచ కుటుంబీకులకు చల్లని, స్వచ్ఛమైన గాలిని ఆస్వాదించేందుకు వీలుగా నిర్మించబడ్డాయి. దర్బారు హాలు మధ్యలో అందమైన నీటి కుండం ఉంది. దీన్ని అప్పుడు 'ఫౌంటేన్'గా వాడేవారు. ఇది ఆనాడు రాచవర్గ ప్రజలకు ఎంత ఆనందాన్ని, ఆహ్లాదాన్ని ఇచ్చేదో! కాబట్టే, ఈ మహల్‌కు 'ఖుష్ మహల్' అని పేరొచ్చింది. ఖుష్ అంటే సంతోషం కదా!

ఈ మహల్ గోడలు చాలా వెడల్పుండి బలిష్టమైనవి. అవి సుమారు 77 డిగ్రీల వాలుతో ఉండి వేలాడు తున్నట్లుగా కన్పిస్తాయి. కాబట్టి, ఈ ఖుష్ మహల్ మాతృకైన మహల్‌ను 'హిందోళ మహల్' అంటారు. అంటే, 'ఊగే సౌధం' అని అర్థం. దీనిని మధ్యప్రదేశ్, గుజరాత్‌లలోని మాళ్వా ప్రాంతపు రాజధాని మాండులో హుషాంగ్ అనే రాజు క్రీ.శ. 1425లో కట్టించాడు. దాని కంటే కొంచెం చిన్నది ఈ 'ఖుష్ మహల్'. కానీ, 'హిందోళ మహల్'లో లేని నీటికుండం ఖుష్ మహల్ మధ్యలో ఉంది. ఇది ఖుష్ మహల్ అదనపు ఆకర్షణ.




చారిత్రాత్మకంగా ఈ సౌధానికి మరో విశేషమూ, అందమూ ఉంది. తురక సైన్యాలు కూల్చిన, ధ్వంసం చేసిన వందలాది హిందూ దేవాలయాలను, విగ్రహాలను సీతాపతి ముస్లిం మతంలోకి మారి మరీ పునరుద్ధరించడం లోనే ఆసక్తికరమైన అందం కనిపిస్తుంది. కాకతీయులు కాలగర్భంలో కలిసిన రెండు వందల సంవత్సరాల తర్వాత కూడా ప్రజల్లో వారికున్న గౌరవాన్ని చూసి, వారు కట్టించిన దేవాలయ శిల్పాల సౌందర్యాలను చూసి ముగ్ధుడైన సీతాపతి ఖాన్ అంతే అందమైన, ఆసక్తికరమైన ఖుష్ మహల్‌ను కట్టించడంలో ఆశ్చర్యం లేదు.

షితాబ్ ఖాన్ 1515 ప్రాంతంలో ఒరిస్సా లోని కళింగ గజపతి రాజులకు విధేయుడిగా ఉన్నందుకు తెలంగాణలో తనపై దండెత్తిన మరో తెలుగువాడు శ్రీ కృష్ణ దేవరాయల సైన్యాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. తన విలువిద్యతో మొదట రాయల సైన్యాన్ని చిత్తు చేశాడు కూడా. చివరలో గుంటూరు జిల్లా పొన్నూరు ప్రాంతంలో రాయలతో జరిగిన యుద్ధంలో ఓడిపోయాడు. కానీ, ఆయన ప్రజలకు ప్రత్యేకించి కళా పిపాసకులకు ఇచ్చిన కానుక మాత్రం కాల గమనాన్ని తట్టుకొని నేటికీ అలరిస్తూనే ఉంది. అదే మన ఖుష్ మహల్.

**-ద్యావనపల్లి సత్యనారాయణ**
**మొబైల్: 94909 57078**
**మెయిల్:** dyavanapalli@gmail.com

(తెలంగాణ కొత్త విహార స్థలాలు' పుస్తకం నుంచి)
**ప్రతులకు:** తెలంగాణ రిసోర్స్ సెంటర్, చంద్రం 490, వీధి నెం. 12, హిమాయత్ నగర్, హైదరాబాద్-29, తెలంగాణ. వెల: రూ. 100

### స్వేచ్ఛా- స్వాతంత్ర్యం కోసం ధూం-ధాం చేసి, అసోయ్ ధులా దరువుల్లో దుమ్ములేసి

# కోటి గొంతులతో కోలాటమాడిన కోదారి శ్రీనివాస్ పాట

**శి**వసత్తులు ఊగినట్టు, కొండదేవర కొలుపుజెప్పినట్టు కోదారి శ్రీనివాస్ తన పాటలతో తెలంగాణ దుఃఖాన్ని వలపోస్తడు. మస్కట్, దుబాయ్‌లలో బతికే తెలంగాణ బిడ్డల దుర్భర జీవితాన్ని, బతుకు దెరువు లేక బొంబాయికి వలసబాటలు పట్టిన నల్లగొండ జిల్లా జీవన ముఖచిత్రాన్ని ప్రతీకలుగా చేసి పదాలల్లుతడు, పాటల ఉత్తరాలతో పల్లెల్ని పలకరిస్తడు. ఆత్మీయత, అనురాగాల్ని కలవరిస్తడు. తెలంగాణ రాష్ట్ర సాధనే అంతిమ లక్ష్యమని చాటింపువేసి, జనాన్ని జాగృతం చేసిన తెలంగాణ ఉద్యమ పాటగాళ్ళలో అగ్రగణ్యుడు కోదారి శ్రీనివాస్ గురించి నేటి మన 'అలుగెల్లినపాట'లో..



నల్లగొండ జిల్లా గుండాల మండలం గంగాపురం గ్రామంలో చంద్రగిరి అంజయ్య, యాదమ్మ దంపతులకు ఆగస్టు 30, 1976వ సంవత్సరంలో శ్రీనివాస్ జన్మించిండు. ఆ తర్వాత అమరావతి, శోభారాణి అనే ఇద్దరు ఆడపిల్లలు కలిగిండ్రు. చంద్రగిరి అంజయ్య గౌడ కులవృత్తిని నమ్ముకొని, తనకున్న కొద్దిపాటి వ్యవసాయంతో సంసారం ఎల్లదీసుకుంటు బతికిండు.

శ్రీనివాస్ స్థానిక పాఠశాలలో ప్రాథమిక విద్యను, గుండాల హైస్కూల్‌లో ఉన్నత విద్యను పూర్తి చేసిండు. ఆ తర్వాత ఇంటర్ విద్య కోసం మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లిండు. దాదాపుగా చిన్నప్పటి నుంచి హాస్టల్‌లో ఉండి చదువుకున్న శ్రీనివాస్ అనేక బాధలు అనుభవించిండు. డిస్టెన్స్‌లో డిగ్రీని పూర్తి చేసిండు. శ్రీనివాస్ తండ్రి చంద్రగిరి అంజయ్య మంచి బుర్రకథ కళాకారుడు యక్షగాన ప్రదర్శనలు చేసేవాడు. అదేవిధంగా శ్రీనివాస్ పెదనాన్న బాలనర్సయ్య కూడ ఆ కాలంలో ప్రసిద్ధి చెందిన బుర్రకథ కళాకారుడు. సుద్దాల హన్మంతుతో సమానంగ ప్రదర్శనలు చేసేవాడు. "రేణికుంట రామిరెడ్డి" జీవిత చరిత్రను బుర్రకథగా ఊరూర ప్రచారం చేసిండు. ఆ క్రమంలోనే కొంత నిర్బంధాన్ని కూడ ఎదుర్కొన్నడు. ప్రజాచైతన్యమే పరమావధిగా పనిచేస్తున్న బాలనర్సయ్య తన వైవాహిక జీవితాన్ని కూడ వదులుకొని కళారంగంలో జీవించిండు. తండ్రితో పాటు పెద నాన్న కూడ కళాకారులు కావడం వల్ల శ్రీనివాస్‌కు కళారంగం పట్ల ఆసక్తి పెరిగింది. దీంతో చిన్ననాటి నుండే జానపద, విప్లవ పాటలవైపు దృష్టి మరల్చిండు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ద్వార తన కలానికి పదును పెట్టిండు. అమరవీరుల పాటలతో విప్లవోద్యమ చైతన్యాన్ని పాదుగొల్పిండు. ఈ క్రమంలోనే అమర్, గోరటి వెంకన్న, విమలక్క, బి.నర్సింగరావు వంటి ప్రముఖులతో సంబంధాలు ఏర్పడ్డాయి. గద్దర్ "సిరిమల్లె చెట్టుకింద లచ్చువమ్మ", అమర్ "పల్లె పల్లెన పల్లేర్లు మొలిచే" పాటలు శ్రీనివాస్ మనసుని కదలించినయి. అరుణోదయలో పాటలు రాసే క్రమంలోనే చంద్రగిరి శ్రీనివాస్ కోదారి శ్రీనివాస్‌గా మారిండు. శ్రీనివాస్ పాటలు విన్న అమర్, గోరటి వెంకన్నలు ఇద్దరు కూడా శ్రీనివాస్ పాటల్లోని కోయిల స్వరాన్ని గుర్తించిండ్రు. శ్రావ్యమైన రాగంతో పాటు, సాహిత్యంలోని ఎత్తుగడల్ని, సొగసైన నడకను గుర్తించి, గోదారి లోయ అలజడి తన పాటల్లో ఉందని ప్రశంసించిండ్రు. ఆ రెండు పదాల్లోని అక్షరాలను తీసుకొని కోదారిగా నామకరణం చేసిండ్రు. నాటి నుంచి కోదారి శ్రీనుగా తన పాటల ప్రస్థానాన్ని మొదలు పెట్టిండు. వాళ్ళ ప్రేరణతోనే అనేక పాటలు రాసిండు. ఆ తర్వాత 1999లో మొట్టమొదట ఉద్యమపాటను రాసిండు. అదే బొంబాయి పాట. ఈ పాట తెలంగాణ ఉద్యమానికి, ముఖ్యంగా ధూం-ధాం వేదికల మీద దృశ్యకావ్యంగా ప్రదర్శించబడింది. అదూరి సంతోష్, వేముల పువ్వల ప్రదర్శన ఎందరినో కంట కన్నీరు పెట్టించింది. తెలంగాణ కరువు పరిస్థితిని, ఇక్కడి ప్రజల గోసను

కండ్లకు కట్టినట్టు చూపించిన ఈ పాట తెలంగాణ ఉద్యమానికి ఊతమిచ్చింది. ప్రతి ఒక్కరిని ఆలోచింప జేసింది.

"ఉండు పైలంగుదు అమ్మ మాయమ్మ –
ఇల్లు పైలం జూడు తల్లి మాయమ్మ
బతుకు దెరువు లేక అమ్మ మాయమ్మ –
బొంబాయి బోతున్న తల్లి మాయమ్మ
అవ్వంటె బువ్వేది– ఊరులంటె పేరేది /
పనిని అర్సుకున్న తొవ్వ జూసుకున్న
జొన్నరొట్టల సద్ది మూట గట్టుకున్నా..
మొదలున్న నానమ్మి నల్లరేగడి గొంటి –
కాళ్ళ కడియాలమ్మి సౌదోబీడో కొంటి
కన్న కష్టం జేసి కంచె అచ్చుగట్టిన –
ఏడుగోలల లోతు బాయిని తవ్విస్తి
నన్నిడిసి పోవద్దు కొడుక మల్లయ్య
ఊరిడిసి పోవద్దు బిడ్డ మల్లయ్య" అంటూ సాగే పాటలో అచ్చమైన తెలంగాణ నుడికారాన్ని ముఖ్యంగా నల్లగొండ మాండలిక సొగసుల్ని తెలుగు భాషా కిరీటంలో వజ్రాలుగా పొదుగుతడు. ఈ పాటవిన్న తెలంగాణేతరులు సైతం కన్నీరు పెట్టిటంద్రంటే అతిశయోక్తి కాదు. తెలంగాణ వలసబతుకుల మీద కోదారి శ్రీనివాస్ రాసిన మరోపాట..

"తెల్ల కాకుల రాజ్యం కానరాని దేశం
దుబాయి నువు బోతివా నా కొడుకా –
దూర దేశానుంటివా నా బిడ్డా
తలకు మించిన అప్పు తాళలేనన్నావు /
వలసపోయే తప్పదనుకున్నావు
అమ్మమీది సొమ్ము అలి మీది పుస్త /
ఉన్న భూమి నమ్మి వీసా అందుకున్నావు
మస్కట్‌కు నువు పోతివా నా బిడ్డా –
మాయా రాజ్యం పోతివా నా కొడుకా" అంటూ కన్నపేగుని కదిలిస్తడు.

తనవితీరా తన పల్లెని తడిమీ చూస్తడు. దుబాయ్, మస్కట్ వంటి గల్ఫ్ దేశాలకు వలసబోయిన తెలంగాణ బిడ్డల వెతల్ని చూసి గుండెలి పిండి చేస్తడు. వాళ్ళ అంతరంగంలోని బాధని పాటల ఉత్తరం జేస్తడు.

"ముద్దల రాజాలో కొడుక – ఉత్తరమేస్తున్నా బిడ్డ
సల్లంగుండు రాజాలు నువ్వు సక్కగుండూ రాజాలు
ఎక్కాడున్న రాజాలు నువ్వు సుఖంగుండు రాజాలు
చేనులోని బతుకుతమని చెలకాలల్ల బోర్లేస్తే
అప్పులోతు ఎక్కువాయె సుక్కానీళ్ళు ఎల్లకాపయే
కాలము కరకరమని కడుపు మీద కొట్టిపాయె
అప్పులొద్ది తాళలేక అయ్య ఆత్మ సచ్చిపాయె" అంటూ ఆర్తిని వెళ్ళగక్కుతడు. కోదారి శ్రీనివాస్ కేవలం తెలంగాణ దుఃఖాన్ని వల పోయకుండ ప్రతిపాటలోను లక్ష్యాన్ని గుర్తుచేస్తడు. వడిసెల రాళ్ళతో

> **నన్నిడిసి పోవద్దు కొడుక మల్లయ్య ఊరిడిసి పోవద్దు బిడ్డ మల్లయ్య" అంటూ సాగే పాటలో అచ్చమైన తెలంగాణ నుడికారాన్ని ముఖ్యంగా నల్లగొండ మాండలిక సొగసుల్ని తెలుగు భాషా కిరీటంలో వజ్రాలుగా పొదుగుతడు. ఈ పాటవిన్న తెలంగాణేతరులు సైతం కన్నీరు పెట్టిటంద్రంటే అతిశయోక్తి కాదు.**
>
> **రామ రామ ఉయ్యాలో రాఘవ రామ ఉయ్యాల / జనం కదిలె ఉయ్యాలో జెండాలెత్తె ఉయ్యాల" అంటూ ఛిద్రమైన తెలంగాణ బతుకుల్ని ఉయ్యాలలూగిస్తడు.**

శత్రువుని ఉరికిచ్చిన పౌరుషాన్ని రగలిస్తడు.

"సురకత్తుల సూరులారా తల్వారు సూపులారా / ఆంధ్ర దొరల తరమనీకి రండిర కదలండిరా
తెలంగాణ సాథియో.. లడాయ్ పరో ఖాయియో..' అంటూ తెలంగాణ మట్టిని కదలిస్తడు. జరుగుతున్న తెలంగాణ ఉద్యమాన్ని జనజాతర చేద్దాం పదమని కదం తొక్కుతడు.

"జమగూడు జాతరెల్లి పోదాం తెలంగాణ /
ఉద్యమాల ఉర్సుకెల్లి పోదాం తెలంగాణ
రామ రామ ఉయ్యాలో రాఘవ రామ ఉయ్యాల /
జనం కదిలె ఉయ్యాలో జెండాలెత్తె ఉయ్యాల" అంటూ ఛిద్రమైన తెలంగాణ బతుకుల్ని ఉయ్యాలలూగిస్తడు. ఉద్యమ బాటవేస్త డు. సీమాంధ్ర పాలనలో రాలిపోతున్న రైతులను చూసి ...

"అయ్యా సావనీకి మనసుల ఎట్లొచ్చే /
అయ్యా.. మేము నీకు గుర్తు రాలేదా
కష్టమే నీ వంతు అనుకొని – కాలముతో పోటీ పడితివి
కలిమి లేములు ఎరుగకుండ ప్రేమతోటి మమ్ము పెంచితివే
ప్రేమకోసం సెలుకకోసం సాగునీళ్ళ బోరు కోసం
అప్పుదెచ్చి పత్తి పెడితే నకిలివిత్తనాలు ముంచె
వరుస కరువుల అరకవిడిసెనయా.. అయ్యా.. " అంటూ కరువుకు కారణమైన పాలకుని మీద దుమ్మెత్తిపోస్తడు.

"ఏడు గడిసీపాయె దినము గడిసీపాయె
ఎట్లా ఉన్నరో బిడ్డలు నా ఇల్లు తొవ్వ మరిసీపోయిరా!
సద్దుల బతుకమ్మ దగ్గరికొచ్చింది తీసుకురమ్మని చెప్పుదు
బిడ్డల తోల్కరమ్మని చెప్పుదు కోడుకూల
పత్తిసేండ్ల అన్న పెద్దకొడుకా రారా పయనమయ్యిపోరో సెల్లెల్ని తోలుకోని రారో మా అయ్య.." అంటూ బిడ్డ మీద తల్లి మమారాన్ని ప్రేమానురాగాల్ని పాటగ జేస్తరు. కుదుమంటే పండుగనే తెలంగాణ సంస్కృతిని చెప్పకనే చెప్పుతడు. ఆస్తిపాస్తుల కన్నా అన్నదమ్ముల అనుబంధమే గొప్పదన్న తెలంగాణ వైఖరిని ఈ ప్రపంచానికి చాటి చెప్పుతడు. ఆటకోయిల పాటలుగా అలవోకగా గ్రామీణ పదాలను పాటలుగా చేసిన కోదారి శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమ పాటకవులలో అగ్రగణ్యుడుగా చెప్పవచ్చు. ముఖ్యంగా నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ మీద

ఆనాటి ఉద్యమ రథసారథి నేటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సమక్షంలో కోదారి శ్రీనివాస్ రాసిన పాట "సూడు సూడు నల్ల గొండ / గుండె మీద ఫ్లోరైడు బండ / బొక్కలొంకరబోయిన బతుకూలు / దుఃఖమెల్లా దీసదెన్నాళ్ళు" తూటాగ పేలింది. అయితే స్వతహాగా కవి, గాయకుడైన కేసీఆర్ "నవుసుతున్న నల్లగొండన ఎగురుతున్నయి జెండాలెన్నో, పాపిష్టి జెండాల పాతరబెట్టాలె, పరాయి జెండాల తరిమికొట్టాలి / వీళ్ళతోని దూపదీరదు, దుఃఖమెడుసదు / స్వంత రాష్ట్రాన్ని సాధించుకుందం / మంచినీళ్ళను మనమే తెచ్చుకుందాం" అంటూ కోదారి శ్రీనివాస్ రాసిన పాటకు కొన్ని పాదాలను, పదాలను అందించండు. తెలంగాణ మాటని, పాటని పరిపుష్టం చేసిండు.

తెలంగాణలో ఎందరో వీరులు, పోరాట యోధులు వలసాంధ్ర పాలనలో మరుగున పడిపోయిన విషయాన్ని కోదారి శ్రీనివాస్ కొలువుపెట్టి చెప్పుతడు, తెలంగాణ మణిదీపాలను తలుచుకుంటు వీరగానం చేస్తడు.

"స్వేచ్ఛా స్వాతంత్ర్యంతై రణరంగ సమరంలో /
ప్రాణాలు ఎదురొడ్డి పోరాడి హొరాడిని
తెలంగాణ వీరులది ఈ వీరచరిత / చరిత్ర పుటలల్లోన రాయని ఘనత. "సమ్మక్క, సారక్క, సర్వాయి పాపన్న, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, కొమురం బీం, తుర్రేబాజ్‌ఖాన్ వంటి ఎందరికో తన పదాలతో పాటపోస్తడు. అక్షరాలతో హారతిస్తడు చాలా చోట్ల కోదారి శ్రీనివాస్ బొంబాయి పాటతో మొదలైన ధూం-ధాం అసోయ్ ధూలా పాటతో ముగుస్తుంది. తెలంగాణ ఉద్యమానికి ముఖ్యంగా సకలజనుల సమ్మెలో ఒక ఊపునిచ్చిన కోదారి శ్రీనివాస్ పాట.

"అస్సోయ్ ధులా హారతి కాళ్ళ గజ్జెల గమ్మతి /
తెలంగాణ లడాయికి కదులుతున్న..
పోరాటం పొద్దులయ్యి ఎర్రకండ్ల పగులయ్యి /
కుట్రదారి ఎత్తులను చిత్తుచేసే శక్తులై
పొక్కిలైన వాకిళ్ళల దుఃఖాలను తీర్చరా /
ఎక్కిపడే వాకిళ్ళను ఎదలకద్ది కదలరా
ఎన్నాళ్ళీ సహింపులు తెగదెంపుల తశ్వ కొరకు /
ఎంతైనా ఏదైనా తెగిస్తేనే తెలంగాణ
గాయపడిన గుండెగొంతు దండయాత్ర తమ్ముడా /
రగలి రగిలి పొగులుతుంది తెలంగాణ తమ్ముడా" అంటూ

లక్ష్యం వైపు పాటల ఈటెల్ని ఎక్కువపెట్టిన మొనగాడు కోదారి శ్రీనివాస్. ఈ పాటని ఆర్.నారాయణ మూర్తి చిన్న చిన్న చిన్న మార్పులు చేసి 'వీరతెలంగాణ' సినిమాలో వాడుకున్నాడు ఆర్. నారాయణమూర్తి. మరో సినిమా "పోరు తెలంగాణ"కు కోదారి శ్రీనివాస్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిండు. ఇట్ల తెలంగాణ ఉద్యమానికి ఎన్నో పాటల్ని అందించిన కోదారి శ్రీనివాస్ బతుకుపోరాటంలో అనేక బాధలు పడ్డడు. విజయలక్ష్మిని వివాహం చేసుకున్న కోదారి శ్రీనివాస్‌కు సాకేత్, యశస్విని అనే ఇద్దరు పిల్లలు జన్మించిండ్రు. తాత తండ్రుల మాదరి గానే శ్రీనివాస్ కూడ అరకొర వసతులతో కుటుంబాన్ని పోషించుకుంటూ పాటని ఇడువకుంట సంసారాన్ని ఈదుకొచ్చిండు. 1999లో తన తల్లి చనిపోయిన దుఃఖాన్ని దిగమింగుకుంటూ ఆకలి, దరిద్రం, కరువు, నిరుద్యోగం వంటి సామాజిక సమస్యలమీద తనదైన శైలిలో స్పందించిండు. ప్రతి అంశాన్ని పాటగ మలిచిండు. గౌడ్‌లు, బీసీలు, దళిత సమస్యల మీద అనేక పాటలు రాసిండు. సాధారణ మధ్యతరగతి గౌడ కుటుంబంలో పుట్టిన కోదారి శ్రీనివాస్ వృత్తి పనులు చేస్తూనే అనేక సామాజిక అంశాల మీద అవగాహనతో పాటలు రాసిండు.

ఎం.వి.ఫౌండేషన్ భువనగిరి డివిజన్ కో-ఆర్డినేటర్‌గా పని చేసిండు. ఆ తర్వాత ఈనాడు రిపోర్టర్‌గా, నమస్తే హైద్రాబాద్ పత్రికకు ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా, బ్యూరోచీఫ్‌గా కొంతకాలం పనిచేసిండు. కలువకుంట్ల కవిత స్థాపించిన తెలంగాణ జాగృతి సంస్థలో సాంస్కృతిక విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేసిండు. వివిధ గ్రామాలలో తిరిగి 40కి పైగా బతుకమ్మ పాటల్ని సేకరించి పుస్తకంగా ప్రచురించడంతో పాటు ఆడియో రూపంలో అదించడానికి తనవంతు కృషి చేసిండు. జాగృతి సంస్థ పాటల సి.డి. కోసం రాసిన "పౌరుషాల పోరు పటిమలా గడ్డ" పాటలో తెలంగాణ ధీరవనితల చరిత్రను కీర్తించిండు. ఈ సందర్భంగా కవిత "మా పాటల పుట్ట కోదారి" అని తన ముందు మాటలో చెప్పింది.

కోదారి శ్రీనివాస్ సాహిత్య కృషికి గాను తెలంగాణ వ్యాప్తంగా వివిధ సంస్థలతో పాటు ముఖ్యంగ తెలంగాణ ఎన్.ఆర్.ఐ. అసోసియేషన్ (తె.నా) వారు 2012లో ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా 'జానపద కళారత్న' అవార్డును మంత్రివర్యులు జూపల్లి చేతుల మీదుగా అందుకున్నాడు. పాటలు రాసి, పాడడమే కాకుండ తన చక్కటి ప్రసంగానికి ముగ్ధులైన డా॥బి.ఆర్.అబేద్కర్ యూనివర్సిటీ వారు 'సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ ఇన్ కల్చరల్' సర్టిఫికెట్‌ను ప్రదానం చేయడం జరిగింది. తెలంగాణ అవార్డులకు, రివార్డులకు అసలు సిసలైన వారసుడు కోదారి శ్రీనివాస్. అలసిపోయిన మనుసుకు కొంత ఊరట దొరికినట్టు, శ్రమజీవికి చెట్టునీడ దొరికినట్టు తెలంగాణ ఉద్యమ కవిగాయకులు, కళాకారులకు మన తెలంగాణ ప్రభుత్వం 550 మందికి పైగా ఉద్యోగ భద్రతను కల్పించింది. అట్ల తెలంగాణ సాంస్కృతిక సారథిలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాడు. తెలంగాణ ప్రభుత్వం కళల్ని ఆదరించి, కళాకారుల కన్నీరు తుడవడం నిజంగా అభినందించదగిన అంశం. తెలంగాణ పాటని గుర్తించిన ప్రభుత్వాన్ని ఇయ్యాల ప్రతి ఒక్కరు ప్రశంసిస్తున్నరు. గొప్పపనిగా అభివర్ణిస్తున్నరు. ఈ విషయం ఏట్ల ఉన్నా పాటల ఊటబాయిగా పేరు తెచ్చుకున్న కోదారి శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమ ప్రేరణతో 370కి పైగా పాటలు రాసి ఎన్నింటినో రికార్డు చేసిండు.

ప్రస్తుతం తన పాటలన్నింటిని ఒక పుస్తక రూపంలో తీసుకు రావాలనే ప్రయత్నంలో ఉన్నడు. తన ప్రయత్నం సఫలీకృతం కావాలని, ముందు ముందు మరెన్నో కీర్తి కిరీటాలు సాధించాలని కోరుకుందాం.

-అంబటి వేకువ
మొబైల్: 94927 55448
మెయిల్: varjj.ambati@gmail.com

# ముద్దుల రాజాలో

ముద్దుల రాజాలో కొడుక – ఉత్తరమేస్తున్నా బిడ్డ
సల్లంగుండు రాజాలు నువ్ సక్కంగుమడు రాజాలూ
ఎక్కడున్నా రాజాలు నువ్ సుఖంగుండు రాజాలు
॥ముద్దుల॥

చేసుకొని బతుకుతమని చెలకాలల్ల బోర్లేస్తే
అప్పులోతు ఎక్కువాయె సుక్కా నీళ్ళు ఎల్లకపాయే ॥అ॥

కాలము కరకరమని కడుపూ మీద కొట్టీపాయే
అప్పులొడ్డీ తాళలేక అయ్యా ఆత్మ సచ్చీపాయే ॥2 ॥ ॥అ॥

ఏడు తిరుగక ముందే ఊరు ఇడిసినవుర కొడుక
పట్నంలో పనిచేసీ పైసా పైసా పంపిస్తివి ॥2 ॥
చిన్నానాడురో కొడుక సీతా కష్టంరో బ్డి ॥2 ॥
చింతా జెందకురో కొడుకో చిక్కీపోతవ్‌రో బిడ్డ
॥2 ॥ ॥సల్లంగుండు॥

ఇల్లిడిసి నువుబోయి యాడాది నర్ధామాయె ॥2 ॥
ఉన్నకూలికన్నా కూలి చేసీ కాలం బొలిపిస్తి ॥2 ॥
పైస పైస పోగు చేసీ అయ్యా సావు బాకీ తీర్చినవు ॥2 ॥
బియ్యమూ నూకలూ లేక తొప్పాలొచ్చినాయి కొడుక ॥2 ॥
కంటికి పట్టెడురో కొడుక కష్టాలున్నాయిరో బిడ్డా ॥2 ॥
ఎప్పుడొస్తవో కొడుక ఎట్లా చెప్పుదురో బిడ్డా ॥2 ॥
॥సల్లంగుండు॥

నెత్తిన అక్షింతలేస్తె పచ్చని సంసారమగును ॥2 ॥
మనవళ్ళనెత్తుకోని ముద్దాడ నోచుకోలే ॥2 ॥
గూడు చెదిరిన పక్షులోలె చెట్లకొకరమైనాము
దేవునింట్ల మన్నూ బొయ్య వీసమంత సాయంగాలె ॥2 ॥
ఏమీ రాతలురో కొడుక ఏట్లో ఈతలురో బిడ్డా ॥2 ॥
బాటా దొరకనీ కొడక బోయిల మైతిమో బిడ్డా
॥2 ॥ ॥సల్లంగుండు॥

ఎండల్ల కూలిజెయ్యా వరికోతకు నేనుబోతే ॥2 ॥
చేతగాని ఎపానమాయె అలిపిరొచిచ కూసుంటి ॥2 ॥
నెత్తురు సచ్చీ ఒండ్లో సత్తువ కరువై పాయె ॥2 ॥
దమ్మార నీళ్ళు తాగి వరిమోపు నెత్తూకుంటే ॥2 ॥
కన్నులకు చీకటొచ్చి పానమంత సోలబట్టే ॥2 ॥

విరిసిపడితె ఒరం మీద కాళ్ళు రెక్కలిరిగిపాయే ॥2 ॥
లేసేదెట్లరో కొడుక చేసేదెట్లరో బిడ్డా ॥2 ॥
ఎట్లా చెప్పుదో కొడుక ఎప్పుడొస్తవో బిడ్డా
॥2 ॥ ॥సల్లంగుండ॥

దూరాన ఉన్న నీవు దుమారంగ రాకు కొడుకా ॥2 ॥
సావుకూ దగ్గరైన చేతకాదు నాకు కొడుకా ॥2 ॥
కానీ రాజ్యమెల్లీపోతివి కండ్లా నిండా నీవే కొడుకా ॥2 ॥
కడుపు నిండ సూచీనంక కన్ను మూసుకుంటా బిడ్డా ॥2 ॥
గంజీబోసి సాదుకున్నా దగ్గారుండి కర్మా జెయ్యా ॥2 ॥
చేతులెత్తి మొక్కూతున్న సెలవు తీసుకుంటా బిడ్డా ॥2 ॥
ఆఖరి ఉత్తరమో కొడక అందీనంకరా బిడ్డా ॥2 ॥
అవ్వనుంటనురో బిడ్డీ ముట్టీనంకరా కొడుకా ॥2 ॥

–కోదారి శ్రీను




హైదరాబాద్‌లోని పబ్లిక్‌గార్డెన్‌లో ఆర్కియాలజీ ఏర్పాటు చేసిన కోటిలింగాల శాతవాహనుల నాటి నాణేల ఎగ్జిబిషన్‌లో పుస్తకావిష్కరణ చేస్తున్న డాక్టర్ డి. రాజారెడ్డి, ఐఏఎస్ అధికారి బి.వెంకటేశం, డైరెక్టర్ విశాలాక్షి

# కరీంనగర్ జిల్లాలో వట్టిపోతున్న చారిత్రక సంపద!

**మురిగిపోతున్న కేంద్ర ప్రభుత్వ నిధులు!**

**ఆలనాపాలనా లేని సంబంధిత శాఖలు!**

**ఇంచార్జీలు, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో**

**అస్తవ్యస్తంగా సాగుతున్న పాలన!**

**దురాక్రమణలో పెద్దబొంకూర్ శాతవాహనస్థావరం!**

**పట్టించుకోని ప్రజాప్రతినిధులు!**

**మూసివేసిన నిజామాబాద్ మ్యూజియం!**

వేల సంవత్సరాల నాటి అదిమానవుల నాగరికతలు, చరిత్రలున్న ఉత్తర తెలంగాణా జిల్లాల కేంద్రమైన కరీంనగర్‌లో అపూర్వ చారిత్రిక సంపద పట్టించుకనే నాథుడు లేక వట్టిపోతున్నది. జిల్లా పురావస్తుసంపద సరైన ఆలనాపాలనా లేక శిథిలావస్థకు చేరుకుంటుండగా, పురావస్తుశాఖకు చెందిన స్థలాలు అన్యాక్రాంతమయ్యే దశకు చేరుకుంటున్నాయి. పురావస్తుశాఖ పనుల కోసం కేంద్రం, వివిధ పథకాల కింద మంజూరైన నిధులు సుమారు నాలుగైదుకోట్లు వెచ్చించకపోవడం వల్ల, అవి మురిగిపోయే దశకు చేరుకుంటున్నాయన్న విమర్శలు వస్తున్నవి. గత ఏడాది నుండి కరీంనగర్ పురావస్తు శాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో సహాయ సంచాలకుల తోపాటు, టెక్నికల్ అసిస్టెంట్, రిటైర్డయిన నాలుగు అటెండర్ల పోస్టులు, మరో పదివరకు వాచ్‌మెన్‌ల వంటి ముఖ్యపోస్టులు ఖాళీలుగా ఉండటం, ఇంచార్జీలతో పాలన సాగడం వల్ల ఈ కార్యాలయం పరిధిలో వున్న ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల పురావస్తు సంపద పరిరక్షణ సమస్యైపోతున్నది. కరీంనగర్ జిల్లా పరిధిలోని పెద్దబొంకూర్ శాతవాహన తొలి స్థావరమైన దాదాపు 70 ఎకరాల భూమిని కొంతమంది ఆక్రమించుకుని, ట్రాక్టర్లచే దున్నించుకోవడం వల్ల గత కొద్దిరోజులుగా ఆ స్థలంపై వివాదం రాజుకుంటోంది. ఈ మూడు జిల్లాలలో గుర్తించబడిన పలు చారిత్రిక చిహ్నాలు, కోటల వద్ద వాచ్‌మెన్‌ల పోస్టులు ఖాళీలుగా వుండటం, వాటిని భర్తీ చేయకపోవడం వల్ల, పురావస్తుసంపద పరిరక్షణ ప్రశ్నార్థకమైపోయిందని చరిత్రకారులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఈ మూడు జిల్లాలలోని చారిత్రక సంపదలు, కోటలు, గడులు, బురుజులు, పాత దేవాలయాల పరిరక్షణ కట్టుదిట్టమై పోతుందనుకుంటే, భిన్నంగా అధికారుల పోస్టులు ఖాళీలుగా వుండటం వల్ల వీటి పరిరక్షణ విషయమై ఈ మూడు జిల్లాల ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు తగినంతగా లేవని చరిత్రకారులు ఆరోపిస్తున్నారు. కరీంనగర్ సహాయసంచాలకులు పోస్టులో వున్న ఆర్. మల్లికార్జునరావు, టెక్నికల్ అసిస్టెంట్ ఫల్గున్‌లు ఆంధ్రాకోటాలో వెళ్లిపోవడం వల్ల, హైదరాబాద్ ఆఫీస్‌లోని టెక్నికల్ అధికారి ప్రేంసాగర్ రావుకు కరీంనగర్ ఆఫీస్ సహాయ సంచాలకుల ఇంచార్జి బాధ్యతను అప్పగించడం వల్ల పరిపాలన భారం పెరిగిపోవడం సమస్యయై కూచున్నది.

**మూతబడిన నిజామాబాద్ మ్యూజియం**



పాదాలు (ఫైల్)
ధ్వంసమైన బాహుబలి పాదాలు

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గత ఐదేళ్ల కిందట ప్రారంభించిన జిల్లా మ్యూజియం తగిన సిబ్బందిని కేటాయించకపోవడం వల్ల గత రెండేళ్ల కిందట మూసివేసి ఒక పుల్‌టైం వాచ్‌మెన్‌ను నియమించినట్లు తెలిసింది. ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, నిజామాబాద్ జిల్లాలోని పలు కోటలు, బురుజుల మొదలగు చారిత్రిక చిహ్నాల పరిరక్షణకై అవుట్ సోర్సింగ్ ద్వారా సెక్యూరిటీ గార్డులను నియమించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆదిలాబాద్ కేంద్రంలో మ్యూజియం ఏర్పాటు చేద్దామనుకున్న ప్రతిపాదనలు గత దశాబ్దకాలం నుండి పెండింగ్‌లోనే వుండి, ఆచరణలోకి రావడం లేదు. ఇది ఇలా వుండగా 12, 13, 14వ కేంద్ర ఆర్థిక సంఘం కింద మంజూరైన సుమారు నాలుగైదు కోట్ల రూపాయల నిధులు సకాలంలో వెచ్చించకపోవడం వల్ల అవి మురిగిపోయే దశకు చేరుకున్నయన్న ఆరోపణలు వస్తున్నాయి.

**పెద్దబొంకూర్ శాతవాహన స్థావరం దురాక్రమణలు**

కరీంనగర్ జిల్లా పెద్దపల్లి రెవిన్యూడివజన్ కేంద్రానికి అతి సమీపంలో వున్న పెద్దబొంకూర్ లోని 70 ఎకరాల శాతవాహన స్థావరం దురాక్రమణకు గురైంది. పెద్దబొంకూర్, పెద్దకల్వలకు చెందిన రైతులు కొంతమంది రాజకీయనాయకులు అండదండలతో ఈ స్థావరంలోని

కొంత స్థలంలో ట్రాకర్లుపెట్టి దున్నించగా, అధికారులు అడ్డుకున్నారు. గత ఐదారేళ్ళ నుండి నానుతూ వస్తున్న ఈ సమస్యపై పురావస్తుశాఖ అధికారులు దృష్టిపెట్టాలని పెద్దపల్లి ప్రాంత చారిత్రిక అభిమానులు డిమాండ్ చేస్తున్నారు. పెద్దబొంకూర్ స్థావరం చౌకీదార్ అంజయ్య, ఇంటాక్ పాలకమండలి సభ్యుడు ఎం.వేదకుమార్, ఈ వ్యాసకర్త తదితరులు స్పందించి, రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళడం, కరీంనగర్ జిల్లా కలెక్టర్ నీతూప్రసాద్, ఆర్‌డివో నారాయణ రెడ్డిలు తగిన హామీ ఇవ్వడంతో ఈ దురాక్రమణ వివాదం తాత్కాలికంగా సమసిపోయినట్లు అయింది. 1970వ చివరి దశకంలో పెద్దపల్లి ప్రముఖ పురా చారిత్రిక వేత్త కీ.శే. ఠాకూర్ రాజారాంసింగ్, అప్పటి పురావస్తు శాఖాధికారి డా.వి.వి.కృష్ణశాస్త్రిల చారిత్రిక పరిశోధనలతో రెండువేల సంవత్సరాల నాటి ధూళికట్ట, బౌద్ధస్థూపం, సుల్తానాబాద్ మండలంలోని కదంటాపూర్ ఆదిమానవుల బృహత్ సమాధులు, పెద్దబొంకూర్ గ్రామీణ నాగరికతకు అద్దంపట్టే స్థావరాలు బయట పడ్డాయి. పెద్దబొంకూర్ స్థావరాన్ని పురావస్తుశాఖ స్వాధీనంలోకి తీసుకొని, తొలుత కొంతకాలం తవ్వకాలు జరిపి, బయల్పడిన అంటిక్విట్స్‌ను కరీంనగర్, హైదరాబాద్‌లోని మ్యూజియాలకు తరలించారు. ఈ స్థావరం చుట్టూ కంచె నిర్మించడానికి 14వ ఆర్థిక సంఘం ద్వారా రూ.1.20 కోట్ల నిధులు మంజూరైనాయని, వీటిని సకాలంలో వినియోగించడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. నగునూర్ నల్లగుడిని బదలాయించిన స్థలంలో కబ్జా కాకుండా కంచె వేయాల్సిన అవసరం వుంది.

**పర్యాటక కేంద్రంగా కోటిలింగాల శాతవాహన స్థావరం**

జిల్లాలోని వెల్గటూర్ మండలంలోని కోటిలింగాలలో ప్రాచీన శాతవాహన, పూర్వశాతవాహన స్థావరాన్ని 1978లో అప్పటి చారిత్రిక పరిశోధకులు కీ.శే.సంగనభట్ల నరహరిశాస్త్రి నాణేలు సేకరించి, బయటి లోకానికి తెలియజేయడంతో జిల్లాలో గుంటూరు జిల్లాలోని అమరావతి కంటే ముందుగానే శాతవాహనులు ఈ ప్రాంతాన్ని పరిపాలించారని రూఢీ అయింది. 1978లో, 1981, 2009లలో ఇక్కడ పాక్షికంగా పురావస్తుశాఖ తవ్వకాలు జరిపి, అనేక నూతన పురావస్తు సత్యాలను ఆవిష్కరించింది. ప్రస్తుతం ఎల్లంపల్లి శ్రీపాదసాగర్ ప్రాజెక్టు ముంపులో ఈ కోటిలింగాల చారిత్రిక స్థావరం వుంది. ఇక్కడ వంద ఎకరాల స్థలం సేకరించి, తక్షణమే ఆగిపోయిన పురావస్తు తవ్వకాలను కొనసాగించాలని గతంలో రాష్ట్ర చరిత్ర నిపుణులు డా.దెమోరాజి రెడ్డి, వేదకుమార్, జితేంద్రబాబు, నాగేంద్రశర్మ, డా.జైకిషన్, డా.సంగనభట్ల నర్సయ్య తదితరులతో పాటు, తెలంగాణా సిద్ధాంత కర్త జయశంకర్, దేశపతి శ్రీనివాస్, తెలంగాణా విద్యావంతుల వేదిక బాధ్యులు డా. కోదండరాం, పిట్టల రవీందర్, జాగృతి నాయకురాలు కవిత తదితరులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇక్కడ తవ్వకాలకు సుమారు మూడున్నరకోట్ల రూపాయలను కేటాయించినట్లు, ఇటీవల ఈ ప్రాంతంలో పర్యటించిన రాష్ట్ర పురావస్తుశాఖ నూతన డైరెక్టర్ శ్రీమతి విశాలక్ష్మి ప్రకటించారు. కోటిలింగాల పరిశోధక స్థావరం ముంపునకు గురికాకుండా చూడడానికి, ఆలంపురంలో లాగా గోడల



గ్యాలరీలో నాణేలను తిలకిస్తున్న పర్యాటక శాఖ కార్యదర్శి బీ వెంకటేశం

వంటి తగిన రక్షక కట్టడాలు నిర్మించడానికి, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి టి.హరీష్‌రావు, ఇరిగేషన్ సలహాదారు ఆర్. విద్యాసాగర్ రావుల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రెండుమూడుసార్లు సమీక్షా సమావేశాలు జరిగాయి. ఇందులకై సుమారు 75 కోట్ల రూపాయలు కాగలదని ఇంజనీరింగ్ నిపుణులు ప్రాథమికంగా అంచనావేసినట్లు తెలిసింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ధ్యాంల నిర్మాణాలు జరిగినపుడు పురావస్తు అంశాల పరిరక్షణ బాధ్యతను ఇరిగేషన్ మంత్రిత్వశాఖలే తీసుకున్నాయి. నాగార్జున సాగర్‌లో నందికొండ మ్యూజియం, ఆలంపురంలోని సంగమేశ్వర దేవాలయ కట్టడాలు కృష్ణానదిలో మునగకుండా దేవాలయాల బదలాయింపులు భారీ వ్యయంతో జరిగాయి. శ్రీపాదసాగర్ డ్యాంలో పూర్తిస్థాయిలో నీటినిల్వలు పెంచాలని నిర్ణయించడంతో కోటిలింగాలలో బ్యాక్‌వాటర్ చేరి, శాతవాహన స్థావరం మునిగిపోయే దశకు చేరుకుంటుందన్న ఆందోళనను చరిత్రకారులు వ్యక్తం చేస్తున్నారు. కోటిలింగాలలో సేకరించిన ఆంటిక్విట్స్‌ను, సైట్ మ్యూజియం ఏర్పాటు చేసి ప్రదర్శించాలని, నందికొండ మ్యూజియంలాగా కోటిలింగాలను టూరిజం కేంద్రంగా తీర్చి దిద్దాలని చరిత్రాభిమానులు కోరుతున్నారు. కొసమెరపు ఏమిటనగా, మే4, 2016న హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో వున్న స్టేట్ మ్యూజియంలో కోటిలింగాల కైన్స్ ప్రదర్శనను రాష్ట్ర పురావస్తుశాఖ వారు ప్రారంభించడం శుభసూచకం. గత ఏడాది జరిగిన గోదావరి పుష్కరాలలో కోటిలింగాల కోటేశ్వరస్వామివారి క్షేత్రం అశేష పుష్కర భక్తజనాలతో కళకళలాడింది.

**ధూళికట్టబౌద్ధస్థూపం:** జూలపల్లి, ఎలిగేడు మండలాల సరిహద్దుల్లో వున్న ఈ ప్రాచీన బౌద్ధస్థూపాన్ని అభివృద్ధి చేయడానికి రాష్ట్ర పురావస్తుశాఖ సుమారు రూ.41 లక్షలు మంజూరీ చేయగా, ఈ స్థూపం చేరుకోవడానికి అప్రోచ్‌రోడ్డు సరిగా లేకపోవడం వల్ల, ఈ నిధుల వినియోగం సమస్యగా మారింది. పెద్దపల్లి ఎంపి బాల్క సుమన్ రూ.10 లక్షల నిధుల్ని రోడ్డువేయడానికి మంజూరీ చేస్తామని హామి ఇచ్చినా పనులు మాత్రం ఇంతవరకు ప్రారంభం కాలేదు. ఎక్కడ వేసిన గొంగడిలాగే అక్కడే వున్నవి. గద్దర్, మందక్రిష్ణ మాదిగ

మొదలగు ప్రముఖులు ఈ స్థూపాన్ని అభివృద్ధి చేయాలని ధర్నాలు, బహిరంగసభలు నిర్వహించి వెళ్ళినా, అధికారులకు చీమకుట్టినట్లయినా లేదన్న విమర్శలు వస్తున్నాయి. 2011 డిసెంబరులో ఈ స్థూపాన్ని గుప్తనిధుల పేరి వెనకభాగంలో పెద్దగోతి చేసి తవ్వి స్థూపానికి భారీగా నష్టం కలిగించారు. జపాన్, చైనా బౌద్ధ బృందాలు ఇక్కడ పర్యటించి వెళ్ళాయి. ఈస్థూపం అభివృద్ధికి నిధులు ఇవ్వడానికి వారు సంసిద్ధంగా వున్నారు. ఇక్కడ తొమ్మిది ఎకరాల భూమి సేకరణ జరిగినా, భూదాతలకు రెవిన్యూశాఖ ద్వారా పూర్తిగా చెల్లింపు కాలేదని తెలిసింది.

**బొమ్మలమ్మగుట్ట మెట్ల నిర్మాణం**

తెలుగుభాషకు ప్రాచీన భాషాహోదా రావడానికి గంగాధర మండలంలోని కురిక్యాల బొమ్మలమ్మగుట్ట త్రిభాషాశాసనం ఎంత గానో ఉపయోగపడింది. ఇక్కడి గుట్ట గండశిలపై తెలుగు, సంస్కృతం, కన్నడంలో పద్యాలు రాయబడ్డాయి. ఆదికవి నన్నయ్య కాలం కంటే వంద ఏళ్ల ముందే ఇక్కడ తెలుగులో మూడు కంద పద్యాలను జినవల్లభుడు రాశాడు. క్రీ.శ.945వ సంవత్సరం వేములవాడ రెండవ అరికేసరి పరిపాలనా కాలంలో కన్నడ ఆదికవి పంపమహాకవి సోదరుడైన జినవల్లభుడు ఈ శాసనాన్ని జైన మతాచార్యునిగా చెక్కించినట్లు ఆధారాలు లభించాయి. ఈ గుట్టను గత ఐదేళ్ళకిందట గ్రానైట్ మాఫియా విధ్వంసం చేయడానికి ప్రయత్నించినపుడు రాష్ట్రంలోని చారిత్రిక వేత్తలు, రచయితలు పెద్ద అభ్యంతరం లేవదీసి ఉద్యమం చేయగా, అప్పటి కర్నాటక ముఖ్యమంత్రి యడ్యూరప్ప రాసిన లేఖతో ఆగిపోయింది. ఈ గుట్టను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి సుమారు రూ.పదిలక్షల వ్యయంతో మెట్ల నిర్మాణాలను ఇటీవల పూర్తిచేశారు. ఈ మెట్ల నిర్మాణాలతోపాటు రేలింగ్, లైటింగ్, మంచినీరు, క్యాంటిన్, తగిన వసతి వంటి సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి మరో రూ. ఇరవై లక్షల అవసరముందని పురావస్తుశాఖ అధికారులు అంటున్నారు. ఇక్కడ గుప్తనిధుల వేటగాళ్ళు వచ్చి, బాహుబలి పాదాలను ధ్వంసం చేయడంతో ఈ గుట్టపరిరక్షణకై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**కరీంనగర్ కార్యాలయ నిర్మాణం:**

1965లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వంలోని విద్యామంత్రి, మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు చొరవతో బస్టాండ్ ఎదురుగా వున్న 20 గుంటల అతి విలువైన స్థలంలో కరీంనగర్‌లో మ్యూజియం భవనాల నిర్మాణాలు జరిగాయి. యాభైఏళ్ళు దాటిన ఈ భవనాలు శిథిల దశకు చేరుకున్నాయి. ఇక్కడ బౌద్దిస్టు గ్యాలరీ నిర్మాణానికి గత పదేళ్ళకిందట రూ.పదిలక్షలు మంజూరై, టెండరై ఎందులకో అర్థాంతరంగా పనులు ఆగిపోయాయి. ఇక్కడ నూతన భవనాల నిర్మాణాలకు రూ.5కోట్ల అవసరముందని పురావస్తుశాఖ అధికార వర్గాలు అంటున్నాయి. అధునాతన హంగులతో మ్యూజియం, ఆఫీస్ భవనాలు, లైబ్రరీ, రీడింగ్ రూంల నిర్మాణాలు కావాల్సి వుందని అధికారులు అంటున్నారు. ఇటీవలె రోడ్డు వెడల్పువల్ల, మ్యూజియంకు చెందిన ఐదుగుంటల స్థలం కోల్పోవాల్సి వచ్చింది.



చారిత్రక ఆధారాలపై బొమ్మలగుట్ట కురికాల గ్రామం, కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న వేదకుమార్. చిత్రంలో సంకేపల్లి నాగేంద్ర శర్మ, అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం

**ఎలగందుల కోటలో సౌండ్ అండ్ లైటింగ్**

కరీంనగర్‌కు సమీపంలో వున్న చాళుక్యుల కాలం నాటి ఎలగందుల కోటలో శిథిల నిర్మాణాల పునరుద్ధరణ, సౌండ్ అండ్ లైటింగ్ సౌకర్యాలకై రూ.ఆరుకోట్లు మంజూరీ అయ్యాయి. కోటలోని పలు గోడలు, ఇతర విభాగాల మరమ్మత్తులు నత్తనడకన సాగుతుండడంతో పలువిమర్శలు వస్తున్నాయి.

ఎలగందుల కోట చుట్టువున్న కొండలన్నీ గ్రానైట్ మాఫియా బారిన పడి, కరిగిపోతుండడంతో కోట ఉనికి ప్రశ్నార్థకమై పోతున్నది. శంకరపట్నం మండలంలోని మొలంగూర్ ప్రాచీన కోట గ్రానైట్ విధ్వంసంలో ఇరుక్కుపోవడం వల్ల పలువురు ఈ కోట ఉనికి పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేములవాడ దేవస్థానంలో గత యాభై ఏళ్ల కింద పెకిలించిన ప్రాచీన బౌద్ధ, జైన విగ్రహాలతో సైట్ మ్యూజియం ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. ఇక్కడ చాళుక్యుల కాలం నాటి ఇరవైకి పైగా వున్న శిలాశాసనాల ఆదరణ దిక్కూమొక్కులేకుండా పోయింది. అమరావతి మ్యూజియంకు వెళ్ళిన ధూళికట్ట శిల్పాలు వెనక్కి తెచ్చే ప్రయత్నాలు చేయాలని చరిత్రకారులు డిమాండ్ చేస్తున్నారు.

మంథని సమీపంలోని రామగిరి ఖిల్లా అభివృద్ధి, కోటిలింగాల సమీపంలోని జైనులకు చెందిన మునులగుట్ట అభివృద్ధి, పరిరక్షణ, మంథని గోదావరి సమీపంలోని కాకతీయ శిథిల దేవాలయాల పరిరక్షణ వంటివి ప్రశ్నార్థకంగా మిగిలాయి.

జగిత్యాల ఖిల్లా అభివృద్ధి పనులు కొంతమేరకు జరిగి, అర్ధాంతరంగా ఆగిపోయాయి. కాళేశ్వర దేవాలయంలో పీకివేసిన పలు ప్రాచీన విగ్రహాలను సేకరించి, సైట్ మ్యూజియంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం వుంది.

**-సంకేపల్లి నాగేంద్రశర్మ**, హిస్టోరియన్, కరీంనగర్,
సెల్: 9441797650

# ఆలోచనలు రేకెత్తించేలా.. క్లిక్.. క్లిక్..

**ఫో**టోగ్రాఫర్‌గా రాణించేందుకు ఆకర్షణీయమైన బ్యాంకు ఉద్యోగాన్ని సైతం వదులుకున్నారు **కొమ్మిడి విశ్వేందర్ రెడ్డి**. ఫోటోగ్రఫీపై ఆయనకు ఉన్న అభిరుచికి ఇది నిదర్శనం. ఫోటోగ్రఫీలోని వివిధ విభాగాల్లో 30 ఏళ్ళ అనుభవం ఆయన సొంతం. ఆలోచనలు రేకెత్తించే ఫోటోలు తీయడంలో ఆయన దిట్ట. అనలాగ్ కాలంలో ఫోటోగ్రఫీ రంగంలోకి ప్రవేశించిన ఆయన సంప్రదాయక, డిజిటల్ ఫోటోగ్రఫీలో సంపూర్ణ అవగాహన సాధించారు. గత 30 ఏళ్ళలో ఆయన 100కు పైగా ఫోటోగ్రాఫిక్ ఈవెంట్స్ నిర్వహించారు. ఫోటోగ్రఫీ వర్క్‌షాప్స్, టూర్స్, ఫోటో వాక్స్, సలోన్స్, సెమినార్స్, టాక్ షోస్ లాంటివి వీటిలో ఉన్నాయి. తాను నిర్వహించే ప్రతీ ఫోటోగ్రాఫిక్ ఈవెంట్‌ను అత్యంత నైపుణ్యంతో, విజ్ఞానాన్ని అందించేలా, ఉత్సాహంతో నిర్వహించడం ఆయన విశిష్టత. ఫోటోగ్రఫీ అసైన్‌మెంట్స్ / ప్రాజెక్ట్స్ చేపట్టి కోరుకున్న విధంగా, అనుకున్న సమయానికి, ఈస్తటిక్స్‌తో అందించడం ఆయన ప్రత్యేకత. ఫోటోగ్రఫీకి ప్రాచుర్యం కల్పించేందుకు మెసర్స్ ఈకోస్‌ఫోటోఆర్ట్ సంస్థను ఆయన నెలకొల్పారు. ఫోటో సర్కిల్-హైదరాబాద్ వ్యవస్థాపక సభ్యుల్లో ఆయన ఒకరు. నల్గొండ జిల్లా బీబీనగర్ మండలం జమీల్‌పేట ఆయన జన్మస్థలం. ఒక్క ముక్కలో చెప్పాలంటే సృజనాత్మకత, వృత్తినైపుణ్యం కలబోసుకున్న విశిష్ట ఫోటోగ్రాఫర్ కొమ్మిడి విశ్వేందర్ రెడ్డి.



**చదువు:**

- అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ స్టిల్ ఫోటోగ్రఫీ (రాజన్స్ స్కూల్ ఆఫ్ ఫోటోగ్రఫీ-1981)
- ప్రొఫెషనల్ డిప్లొమా ఇన్ వీడియోగ్రఫీ, వీడియో ఎడిటింగ్ (రీజెంట్ స్కూల్ ఆఫ్ వీడియోగ్రఫీ, హైదరాబాద్, 1983)

**అవార్డులు:**

- అసోసియేట్‌షిప్ ఆఫ్ ది రాయల్ ఫోటోగ్రాఫిక్ సొసైటీ ఆఫ్ గ్రేట్ బ్రిటన్ ఇన్ విజువల్ ఆర్ట్స్ (ఏఆర్‌పీఎస్) 1997
- ఫెలోషిప్ ఆఫ్ ది ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫోటోగ్రఫీ (ఎఫ్ఎఫ్ఐపీ) న్యూఢిల్లీ, 2004
- గ్రాండ్ అవార్డ్ ఇన్ బి/డబ్ల్యూ ఇన్ సీనియర్ కేటగిరీ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫోటోగ్రఫీ 1992
- కొడక్ బెస్ట్ వెడ్డింగ్ ఫోటోగ్రాఫర్, 1997
- బాలంటైన్ ఇంటర్నేషనల్ అవార్డ్, లండన్, 1998
- బెస్ట్ పోర్ట్రాయిట్ అవార్డ్, బెటర్ ఫోటోగ్రఫీ, 1998
- బ్లూ రిబ్బన్ హానర్ అవార్డ్ ఇన్ ది ఇంటర్నేషనల్ కెమెరా క్లబ్స్ బులెటిన్ కాంటెస్ట్ (ఫోటోగ్రాఫిక్ సొసైటీ ఆఫ్ అమెరికా (పీఎస్ఏ), 1999)









- ఫస్ట్ ప్లేస్ అవార్డ్, ఏపీ గవర్నమెంట్, 2003
- లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్ ,ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రాఫిక్ కౌన్సిల్ (ఐఐపీసీ), న్యూఢిల్లీ, ఇదే సందర్భంగా ఆయనపై ప్రభుత్వం కలెక్టర్స్ పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేసింది.

**చేపట్టిన ప్రాజెక్టులు:**

- మెసర్స్ పవర్ మెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్, విజయవాడ పవర్ ప్లాంట్ ప్రాజెక్ట్స్
- ప్రఖ్యాత కూచిపూడి నృత్యకారిణి డాక్టర్ పద్మజా రెడ్డి డాన్స్ బాలెట్స్
- ఆంధ్రా బ్యాంక్ వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు
- టూరిజం ప్రాజెక్ట్స్ (ఏపీ గవర్నమెంట్)

**జ్యూరీ, గెస్ట్ లెక్చర్స్:**

- దేశవ్యాప్తంగా వివిధ కెమెరా క్లబ్‌లు నిర్వహించిన పలు జాతీయ, అంతర్జాతీయ సలోన్స్‌కు జ్యూరీ సభ్యుడు
- ప్రెస్‌క్లబ్ (హైదరాబాద్), విర్చుసా ఐటీ కంపెనీ, ఉస్మానియా యూనివర్సిటీ ఉమెన్స్ కాలేజ్, మెడ్‌రెక్ ఇనిస్టిట్యూట్‌లలో గెస్ట్ లెక్చర్స్
- ప్రెస్‌క్లబ్ (హైదరాబాద్)లో పాఠశాల విద్యార్థులకు, వరల్డ్ వైడ్ లైఫ్ హైదరాబాద్ చాప్టర్ సభ్యుల కోసం డెమో లెక్చర్స్
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ కెమెరా క్లబ్స్ నిర్వహించిన ఫోటోగ్రఫీ వర్క్‌షాప్‌లలో ఫ్యాకల్టీ, మెంటర్
- ప్రతిష్టాత్మక ఫోటోగ్రాఫిక్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా – హైదరాబాద్ 2015లో ఆర్టిస్ట్ టాక్

**ప్రదర్శనలు / వన్ మ్యాన్ షోస్**

- దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అరకు ట్రైబ్స్‌పై వన్ మ్యాన్ షోస్
- దక్కన్ బ్యాలెన్సింగ్ రాక్స్‌పై దేశంలో, అమెరికాలో వన్ మ్యాన్ షోస్
- స్ట్రీట్ ఫోటోగ్రఫీపై వివిధ కెమెరా క్లబ్ వర్క్‌షాప్‌లలో వన్ మ్యాన్ షోస్
- ఫేసెస్ ఆఫ్ హైదరాబాద్, చిల్డ్రన్, జంగిల్ ఫ్లవర్స్–అరకు ట్రైబ్స్ పై గ్రూప్ షోస్
- దక్కన్ రాక్స్ పై ఆయన పిక్టోరియల్ వర్క్ 'ఎకోస్'... ఆస్ట్రేలియాలోని సిడ్నీలో 2016 ఏప్రిల్ 30 నుంచి మే 8 వరకు జరిగిన హెడ్ ఆన్ ఫోటోగ్రఫీ ఫెస్టివల్‌లో ప్రదర్శించబడింది.

**ఇతర వివరాలు**

- 1972లో ఏర్పడిన ఏపీ స్టేట్ అకాడమీ ఆఫ్ ఫోటోగ్రఫీ ద్వారా ఆయన తన సేవలను అందించారు. 1993 నుంచి ఆయన అకాడమీకి ట్రెజరర్‌గా వ్యవహరించారు. 2015లో సంస్థకు కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అనంతరం తెలంగాణ స్టేట్ అకాడమీ ఆఫ్ ఫోటోగ్రఫీని కూడా నెలకొల్పారు. ఈ రెండు సంస్థలు కూడా ఫోటోగ్రఫీకి ప్రాచుర్యం కల్పించేందుకు, గ్రామీణ ప్రాంతాల ఫోటోగ్రాఫర్ల నైపుణ్యాలు పెంచేందుకు కృషి చేస్తున్నాయి.
- గ్రామీణ ఫోటోగ్రాఫర్లకు ఉచితంగా ఫోటోగ్రఫీ నైపుణ్యాలు అందించేందుకు కృషి. జీవనోపాధి పొందేందుకు మాత్రమే గాకుండా జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందేలా మార్గదర్శకత్వం
- ఆయన సీనియర్ సినీ ఆర్టిస్టు కూడా. యాభైకి పైగా తెలుగు, తమిళం, హిందీ సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్ పాత్రలు పోషించారు. ఆపరేషన్ ధుర్యోధన, మనోడులలో ప్రధాన విలన్‌గా నటించారు. బాహుబలి–2, మెంటల్ పోలీస్, గౌతమి పుత్ర శాతకర్ణిలలో కూడా ఆయన నటించారు.

–దక్కన్ న్యూస్ ద





## కేటీఆర్ అమెరికా పర్యటన జయప్రదం

రెండు వారాల పాటు సాగిన మంత్రి కె. తారక రామారావు అమెరికా పర్యటన విజయవంతమైంది. అమెరికా లోని అనేక రాష్ట్రాలతో కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ నూతన సంబంధాలను ఏర్పాటు చేసుకునేందుకు ఈ పర్యటన దోహదం చేసింది.. తెలంగాణతో వ్యాపార, వాణిజ్య సంబంధాలను పెట్టు కునేలా ఆయా రాష్ట్రాలను ఒప్పించడంలో ఈ పర్యటన సత్ఫలి తాలివ్వగలదు. ఇలినాయస్, అయోవా, మిన్నసోటా, కాలిఫోర్ని యా, ఇండియానా రాష్ట్రాల్లో పర్యటించి, ఆయా రాష్ట్రాల నుంచి తెలంగాణకు పెట్టుబడులు వచ్చేలా చర్చలు జరిగాయి. ప్రఖ్యాత కంపెనీల ఛైర్మెన్లు, సీఈఓలతో సమావేశమైన కేటీఆర్ వాటి విస్తరణ ప్రణాళికలను తెలుసుకున్నారు. తెలంగాణ పారిశ్రామిక విధానాన్ని వివరించి తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. మంత్రి ఆలోచనలు, ప్రభుత్వ విధానాలకు ముగ్ధుడైన డ్రీమ్ వర్క్స్ సీఈఓ జెఫ్రీ క్యాట్జన్ బర్గ్ ఐటీ, ఇన్నోవేషన్ రంగాల్లో తెలంగాణ వినూత్న పథకాలతో ముందుకు వెళుతోందని ప్రశం సించారు.








తెలంగాణ రాష్ట్ర 2వ అవతరణ దినోత్సవం సందర్భంగా 2016 జూన్ 2న పరేడ్ గ్రౌండ్స్‌లో పతాకావిష్కరణ అనంతరం ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు. చిత్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ డీజీపీ అనురాగ్ శర్మ



నిజాంకాలేజ్ గ్రౌ




ఉమ్మడి హైకోర్టు వి
హైకోర్టు ఎదుట
నిర్వహిస్తు
తెలంగాణ అడ్వకేట్
అసోసియేషన్ న
తెలంగాణ న్యాయ
న్యాయాధికారులు. చి
న్యాయవాదుల సం
గండ్ర మోహనరావు












ండ్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, చిత్రంలో మేయర్ బొంతు రాంమోహన్, ఎంపీ కె.కేశవరావు, హెూంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, కేంద్రమంత్రి దత్తాత్రేయ, శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌లతో పాటు ఎంపీ డీఎస్, ఏసీబీ డైరెక్టర్ జనరల్ ఏకే ఖాన్ తదితరులు

భజన కోరుతూ
ఆందోళన
స్తున్న
స్ జాక్, బార్
నాయకులు,
యవాదులు,
చిత్రంలో హైకోర్టు
ఘం అధ్యక్షులు
వు తదితరులు




ఫ్యాప్సీభవన్‌లో మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) ఆధ్వర్యంలో సావనీర్ ఆవిష్కరణ. చిత్రంలో ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, హామీద్ మహమ్మద్‌ఖాన్, కోదండరాం, ఎం. వేదకుమార్, ప్రెసిడెంట్ ఎంపీజే ఖాజా మొహినుద్దీన్, బి.కృష్ణయాదవ్ తదితరులు

# దక్కన్ గుట్టల్ని కాపాడుకుందాం!

ప్రకృతిని దాని మానాన దాన్ని వదిలేస్తేనే అది ప్రశాంతంగా ఉంటుంది. లేకుంటే ప్రకోపిస్తుంది. మరి ప్రకృతిని ప్రశాంతంగా ఉండనీయకుండా చేస్తున్నదెవరు? మనమే. అందుకే దాని దుష్ఫలితాలను ఇప్పుడు మనం చవిచూస్తున్నాం. చేయని తప్పుకు ఇతక జీవరాశులూ ఆ దుష్ఫలితాలను అనుభవిస్తున్నాయి. అభివృద్ధి పేరిట, నాగరికత పేరిట చెట్లను నరకడం, గుట్టలను చదును చేయడం వేల ఏళ్ళుగా కొనసాగుతూనే ఉంది. ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లోనూ అలా జరుగుతూనే ఉంది. మరి మనం దీనికి అడ్డుకట్ట వేయలేమా? మన గుట్టల్ని పరిరక్షించుకోలేమా?

ఈ గుట్టలే ఒకప్పుడు గుహల ద్వారా ఆదిమ మానవులకు ఎండా వానల నుంచి రక్షణ ఇచ్చాయి. దక్కన్ గుట్టల విషయానికి వస్తే, లక్షలాది ఏళ్ళ నాటి రాక్ ఫార్మేషన్స్ ఇక్కడ అనేకం ఉన్నాయి. అమూల్య శిలాసంపద అది. వివిధ భౌగోళిక, చారిత్రక, జీవశాస్త్ర సంబంధిత పరిశోధనలకు జీవం పోసే ఆనవాళ్ళు వాటిల్లో ఉంటాయి. వాటిని కాపాడుకోవడం మన బాధ్యత.

మానవచరిత్ర వికసించింది ఈ గుట్టల్లోనే. చిల్లర పైసలకు ఆశపడుతూ వెలకట్టలేని ప్రయోజనాలను అందించే గుట్టలను గుట్టలను చేజేతులా ధ్వంసం చేసుకోవడం ఎంత వరకు సబబు?

ఒక్కో గుట్టకూ స్థానికంగా ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. ఆ గుట్టను కేంద్రంగా చేసుకొని ఎన్నో జీవరాశులు బతుకుతుంటాయి. ఎన్నో చెట్లు, వివిధ రకాల మొక్కలకు గుట్ట ఆశ్రయమిస్తుంది. స్థానిక వాతావరణాన్ని కూడా ఆ గుట్టలు ప్రభావితం చేస్తుంటాయి.

వ్యవసాయం, పరిశ్రమలు, మౌలిక వసతుల పేరిట గుట్టల విధ్వంసం చోటు చేసుకుంటున్నది. బీడు భూములను సాగులోకి తీసుకువస్తే, సాగు పేరిట గుట్టలను ధ్వంసం చేయడాన్ని కొంతవరకు నిరోధించవచ్చు. అదేవిధంగా పరిశ్రమలకు ఇచ్చే భూముల్లో గుట్టలు ఉంటే, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యతను ఆయా సంస్థలపై ఉంచాలి. రహదారుల నిర్మాణంలో గుట్టలు నాశనం కాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది.

**గుట్టలతో ఎన్నెన్నో ఉపయోగాలు:**

- గుట్టలు ఎన్నో వాగులు, వంకలకు జన్మస్థలాలుగా ఉంటున్నాయి. గుట్టల మధ్య ఉండే లోయల్లో, గుట్టల దిగువన వాన నీటిని నిల్వ చేసుకోవచ్చు.
- పరిసర ప్రాంతాల్లో భూగర్భజలమట్టం పెరిగి బావులు ఎండిపోకుండా ఉంటాయి.
- గొర్రెల పెంపకం, పశువుల పెంపకం లాంటివాటికి గుట్టలు తోడ్పడుతాయి.
- సీతాఫలాల చెట్లు, వనమూలికలు లాంటివి పెరుగుతాయి.
- భూసార పరిరక్షణకు తోడ్పడుతాయి.
- మైదాన ప్రాంతాలతో పోలిస్తే, గుట్టలు ఉండే చోట వర్షపాతం అధికం.
- ఎలుగుబంట్లు, తోడేళ్ళు, కోతులు మొదలైనవి ఊర్ల మీద పడకుండా గుట్టల్లోనే ఉంటాయి.
- తేనె లాంటి అటవీ ఉత్పాదనలు పొందవచ్చు.
- సూర్యుడి నుంచి వచ్చే ఉష్ణాన్ని తిరిగి వాతావరణంలోకి వెదజల్లి భూమి వేడెక్కకుండా గుట్టలు కాపాడుతాయి.
- పిడుగుపాట్ల నుంచి కాపాడుతాయి. సుడిగాలులు రాకుండా అడ్డుకుంటాయి.
- వాగులకు, వంకలకు ఇసుకను అందిస్తాయి.
- గుట్టలపై పెరిగే చిట్టడవులు గాలిని శుభ్రపరుస్తాయి.

భూమిపై బతికే హక్కు మనకు మాత్రమే కాదు... ఇతర జీవరాశులకూ ఉంది. వాటి హక్కులను కాలరాస్తూ మనం మాత్రమే బతకాలనుకోవడం బాధ్యతారాహిత్యం. వివిధ రకాల వనమూలికలు గుట్టలపై లభిస్తుంటాయి. ఉచితంగా లేదా అతి తక్కువ మొత్తానికి లభించే వనమూలికలతో గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్యాలను కాపాడవచ్చు. బయటి ప్రపంచానికి తెలియని ఎన్నో వనమూలికలు నేటికీ గుట్టల్లో ఉన్నాయి. వాటిపై పరిశోధనలకు, వాటి ప్రయోజనాలను మనం పొందేందుకు గుట్టలు 'సజీవం'గా ఉండడం ఎంతో అవసరం. గుట్టల్ని కాపాడుకోవడం ద్వారా ప్రకృతి రమణీయతను ఆరాధించవచ్చు. పర్యాటకాభివృద్ధి ద్వారా స్థానికులు లబ్ధి పొందవచ్చు.

**ఇలా కాపాడుకుందాం!**

అటవీ ప్రాంతాలను నోటిఫై చేసుకున్నట్లుగానే కేంద్రం, రాష్ట్రం, జిల్లా, మండల స్థాయిల్లో వివిధ గుట్టలను నోటిఫై చేయాలి. అలా నోటిఫై చేసిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులను నియంత్రించాలి. అవసరమైతే స్థానికులు మినహా బయటి వ్యక్తుల జోక్యాన్ని నిరోధించాలి. గుట్టలను కాపాడే విషయంలో స్థానికుల్లో చైతన్యం పెంచాలి. గుట్టల ద్వారా వారు వివిధ రకాలుగా సుస్థిరదాయక ఆదాయం పొందే మార్గాలు అన్వేషించాలి. గుట్టలను సామాజిక పర్యాటక, విజ్ఞాన కేంద్రాలుగా తీర్చి దిద్దాలి. వన్య ప్రాణులు ఉన్న చోట మానవ సంచారాన్ని నిరోధించాలి.

గుట్టలను ఆదాయవనరులుగా భావించడాన్ని, మైనింగ్ తదితరాలకు కేటాయించడాన్ని మానాలి. వన్యప్రాణుల కోసం గుట్టల మధ్య ప్రత్యేక కారిడార్‌లు ఏర్పాటు చేసి మానవ సంచారాన్ని, మానవ కార్యకలాపాలను నియంత్రించాలి. అటవీ చట్టాల తరహాలోనే గుట్టల పరిరక్షణకు ప్రత్యేక చట్టాలు చేసి సమర్థంగా వాటిని అమలు చేయాలి.

-దక్కన్ న్యూస్ ద

# దృశ్యభాషకు ప్రతిరూపం

చిప్ప సుధాకర్



**బయోడేటా**

**పుట్టిన తేది:** ఫిబ్రవరి 2, 1967
**చదువు:** పోస్ట్ డిప్లొమా ఇన్ ప్రింట్‌మేకింగ్ (ఎంఎస్ యూనివర్సిటీ ఆఫ్ బరోడా, 1990),డిప్లొమా ఇన్ ఫైన్ ఆర్ట్స్ (జేఎన్‌టీ యూనివర్సిటీ, హైదరాబాద్, 1987)
**అనుభవం:** జేఎన్‌టీ యూనివర్సిటీ (హైదరాబాద్)లో ప్రింట్‌మేకింగ్ విభాగంలో 13 ఏళ్ళ పాటు లెక్చరర్.

నేటి కాలంలో సమకాలీన వాస్తవికత అనేది దాన్ని ప్రతిబింబించడంలో చిత్రకారుడికి ఎన్నో సవాళ్ళు విసురుతుంటుంది. డిజిటల్ ఆర్ట్, ఇంటరాక్టివ్ ఇంటర్నెట్, వర్చువల్ రియాలిటీ, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా, అడ్వర్టైజింగ్, హోర్డింగ్స్, ఫిల్మ్స్... ఇలా ఎన్నో వనరులు చిత్రకారుడికి అందుబాటులో ఉన్నాయి. ఇలాంటి నేపథ్యంలో చిత్రకారుడు తన పరిణతి చెందిన వ్యక్తిగతీకృత శైలితో పని చేస్తూ, తన టెక్నో-సోషియో- కల్చరల్- ఎకొలాజికల్- ఎన్విరాన్‌మెంట్ పరిధిని విస్తృతం చేసుకోవాల్సి ఉంటుంది. అది ఒక సవాల్‌గా ఉంటుంది గానీ ప్రతి చిత్రకారుడు కూడా తన వ్యక్తిగతీకృత శైలిని ఏర్పరుచుకునేందుకు, వైవిధ్యాన్ని చాటుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాడు. అలా తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్న చిత్రకారుడే హైదరాబాద్‌కు చెందిన చిప్ప సుధాకర్.

చిప్ప సుధాకర్ వ్యక్తిగతీకృత దృశ్యభాష విభిన్న మీడియా, టెక్నిక్‌లతో అంతర్ముఖ సంభాషణ. ఆయన తన పరిసర వాతావరణానికి ఎంతో సున్నితంగా దృశ్యరూపం ఇస్తుంటారు. మెటాఫర్స్, సింబల్స్‌తో ఆయన సమకాలీన వాస్తవికతను చిత్రీకరిస్తుంటారు. నున్నటి శిరస్సు, లోటస్, తీగలు, త్రికోణాలు, చతురస్రాలు, ఇళ్ళు, చెట్లు, పడవలు, కుండలు, దీపాలు....ఇవే ఎక్కువగా ఆయన చిత్రాల్లో కనిపిస్తుంటాయి. సుధాకర్ చిత్రాల్లో అనుబంధాలు, సంబంధాలు ఒక విడదీయరాని భాగంగా ఉంటాయి. విభిన్న మీడియాను అన్వేషించడం, అనుభూతి చెందడం అనేది తన పరిసరాలను అర్థం చేసుకోవడంలో భాగం అని అంటారు ఆయన. అదే సమయంలో ఆయన చిత్రాల్లో సార్వత్రికత కూడా కనిపిస్తుంటుంది. గ్రామీణ ప్రాంతంలో గడిచిన బాల్యం, హైదరాబాద్‌లో ఫామ్‌హౌస్‌లో జీవితం కూడా ఆయన చిత్రాల్లో ఒక విలక్షణ ఫోక్ ఆర్ట్‌గా కానవస్తాయి.

ఉడ్, గ్లాస్ రెసిన్‌లను మెటీరియల్‌గా ఉపయోగిస్తూ, ఆక్రిలిక్, ఎచింగ్‌లు మాధ్యమాలుగా, కార్వ్‌డ్ రిలీఫ్, కలర్ వాషెస్‌లు టెక్నిక్‌లుగా సుధాకర్ తన చిత్రాలను చిత్రీకరిస్తుంటారు. తన భావాలు తన దృశ్యభాషతో మమేకం అయ్యేలా ఆయన జాగ్రత్త వహిస్తుంటారు. ఆర్గానిక్ మీడియంగా ఆయన ఎంచుకునే చెక్క ప్రకృతి పరిరక్షణను చాటిచెబుతుంది. అదేవిధంగా ఆయన ఎంచుకునే గ్లాస్ రెజిన్ శిల్పాలు యాంత్రిక జీవనాన్ని ప్రతిఫలిస్తూ ఆలోచింపజేస్తుంటాయి.

సృజనకారుడిగా సుధాకర్ తన టెక్నిక్స్, నైపుణ్యాలతో ఒక దృశ్యభాషను వృద్ధి చేయడంలో ఉత్కృష్టతను సాధించాడు. అదే పదిమందిలో ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టింది. మానసికంగా, మేధోపరంగా, సాంకేతికతలతో కూడిన ఆయన సృజనాత్మకత ఆయన విజయానికి బాటలు వేసింది.

**సోలో ప్రదర్శనలు**

- 2013: గ్యాలరీ వేదా చెన్నై
- 2007: జహంగీర్ ఆర్ట్ గ్యాలరీ
- 2007: అప్పారావు గ్యాలరీస్, చెన్నై
- 2005, 2006: గణేశా గ్యాలరీస్, న్యూఢిల్లీ
- 2005: కళాకృతి ఆర్ట్ గ్యాలరీ, హైదరాబాద్
- 2003: ఆర్ట్‌డి ఎన్‌చాంటె ది గ్యాలరీ, ముంబై
- 2002: టావో ఆర్ట్ గ్యాలరీ, ముంబై
- 2000: శ్రీధరణి గ్యాలరీ, న్యూఢిల్లీ



**గ్రూప్ షోస్**

- 2008: మ్యూజియం ఆర్ట్ గ్యాలరీ, ముంబై
- 2004: దృష్టి ఎ కాంటెంపరరీ విజన్, కోయంబత్తూర్
- 2001: గ్యాలరీ గణేశా, న్యూఢిల్లీ
- 1999: హార్మనీ షో, ముంబై
- 1998: అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, కోల్‌కతా
- 1994: సర్లా ఆర్ట్స్ సెంటర్, చెన్నై
- 1991: సొసైటీ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఆర్ట్స్, హైదరాబాద్

**పార్టిసిపేషన్స్**

- 2005: 11వ ట్రైనేల్ - ఇండియా ఎగ్జిబిషన్, లలిత కళా అకాడమీ, న్యూఢిల్లీ
- 2000: ఇండియన్ ఎక్స్ఛేంజ్ ఆర్ఇ 2000, బ్యాంక్ సైడ్ గ్యాలరీ, లండన్
- 1995: రాయల్ సొసైటీ ఆఫ్ పెయింటర్ - ప్రింట్ మేకర్స్ యాన్యువల్ ఎగ్జిబిషన్ బ్యాంక్ సైడ్ గ్యాలరీ, లండన్
- 1999: 4వ కొచి ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ ఆఫ్ ప్రింట్స్, జపాన్
- 1997: తెలుగు యూనివర్సిటీ స్టేట్ ఎగ్జిబిషన్, హైదరాబాద్
- 1993: నేషనల్ ఎగ్జిబిషన్, న్యూఢిల్లీ
- 1990: నేషనల్ ఎగ్జిబిషన్, లక్నో

**స్కాలర్‌షిప్స్**

- 1998-2000, 2006-2008: జూనియర్ ఫెలోషిప్, మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ
- 1999: ఆర్టిస్ట్ ఇన్ రెసిడెన్స్ ఎట్ కనోరియా సెంటర్ ఫర్ ఆర్ట్స్, అహ్మదాబాద్
- 1998: తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్

**అవార్డులు:**

- 2015: 28వ నేషనల్ ఎగ్జిబిషన్ ఆఫ్ కాంటెంపరరీ అవార్డ్ 2015 ఇన్ సీనియర్ కేటగిరీ, సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్, నాగపూర్
- 2002: బెంద్రె హుసేన్ అవార్డ్ 2002 ఇన్ స్కల్ప్చర్, ముంబై ఆర్ట్ సొసైటీ
- 1994: హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ, హైదరాబాద్
- 1993: 50 ఇయర్స్ ఆఫ్ ఆర్ట్ ఇన్ ఇండిపెండెంట్ ఇండియా, హైదరాబాద్, బాంబే ఆర్ట్ సొసైటీ, ముంబై
- 1993: కర్నాటక చిత్రకళా పరిషద్, బెంగళూరు



**క్యాంప్స్**

- 2006, 2008, 2012: రెండు నెలల పాటు జీ మేస్ ఓపెన్ స్టూడియోస్, ఫ్లోరెన్స్, మాసాచుసెట్స్ (అమెరికా)
- 2011: ఆల్ ఇండియా నేషనల్ ప్రింట్ మేకింగ్ క్యాంప్, కెరాగడ్ లలిత కళా అకాడమీ
- 2010: లలిత కళా అకాడమీ రీజనల్ డిజిటల్ క్యాంప్, పుణె
- 2009: సన్‌బావో ఇంటర్నేషనల్ ప్రింట్‌మేకింగ్ ఎగ్జిబిషన్, సింపోజియం, చైనా
- 2008: సన్‌రైజ్ ఇన్ ఇటలీ ఆల్ ఇండియా ఆర్టిస్ట్ క్యాంప్, ఆర్గనైజ్డ్ బై పింక్ జిజర్ ఆర్ట్స్, ముంబై
- 2007: నేషనల్ ప్రింట్ మేకింగ్ క్యాంప్ లలితా కళా అకాడమీ, అహ్మదాబాద్
- 2006: కృష్ణాకృతి ఫౌండేషన్ ఆన్ ప్రింట్‌మేకింగ్ వర్క్‌షాప్
- 2005: ఆల్ ఇండియా పెయింటింగ్ క్యాంప్ - సిక్కిం
- 2001: నేషనల్ పెయింటింగ్ క్యాంప్, గోవా
- 1993: సమతా ప్రింట్‌మేకింగ్ వర్క్‌షాప్, హైదరాబాద్
- 1989: స్పానిష్ ప్రింట్‌మేకింగ్ క్యాంప్, బరోడా.

-దక్కన్ న్యూస్ ద

# మెరుగైన హైదరాబాద్ కోసం యువతలో అవగాహన పెంచాలి

## ఎఫ్‌బీహెచ్ 16వ వార్షికోత్సవం (జూన్5, 2016)




ఫోరం అన్యువల్ నంబర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథి ప్రఖ్యాత చిత్రకారుడు ప్రొ॥ లక్ష్మాగౌడ్. చిత్రంలో సంఘమిత్ర మల్లిక్, సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ రాకేశ్ కె. మిత్రా, ఎఫ్‌బీహెచ్ అధ్యక్షులు ఎం.వేదకుమార్, ఆస్కీ (ఏఎస్‌సీఐ) సెంటర్ ఫర్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్, అర్బన్ గవర్నెన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.శ్రీనివాసాచారి, ఎఫ్‌బీహెచ్ కార్యదర్శి ఒ.ఎం. డెబెరా

మెరుగైన హైదరాబాద్ కోసం యువతలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని వక్తలు అన్నారు. జూన్ 5న ఆదివారం నాడు ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ (ఎఫ్‌బీహెచ్) 16వ వార్షికోత్సవం సోమాజిగూడ లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో జరిగింది. ఈ కార్యక్రమానికి పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత చిత్రకారుడు కె.లక్ష్మాగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ రాకేశ్ కె. మిత్రా, ఆస్కీ (ఏఎస్‌సీఐ) సెంటర్ ఫర్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్, అర్బన్ గవర్నెన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.శ్రీనివాసాచారి గౌరవ అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి ఎఫ్‌బీహెచ్ అధ్యక్షులు యం. వేద కుమార్ అధ్యక్షత వహించారు. సంస్థ ప్రధానకార్యదర్శి ఒ.ఎం. డెబెరా సంస్థ వార్షిక నివేదికను సమర్పించారు. సంస్థ సంయుక్త కార్యదర్శి సంఘమిత్ర మలిక్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత చిత్రకారుడు కె.లక్ష్మాగౌడ్ మాట్లాడుతూ, ఒక నాటి హైదరాబాద్‌ను ఏనాడో కోల్పోయామని అన్నారు. సౌందర్య దృష్టి, ప్రజల బాధలను అవగాహన చేసుకునే శక్తి లేకుండా నగరాన్ని అభివృద్ధి చేసుకోలేమన్నారు. ఆకాశ హర్మ్యాలను నిర్మించడానికి పాత భవనాలను కూలగొట్ట రాదరన్నారు. సింగపూర్, చైనా తరహా నగర అభివృద్ధి మనకు అవసరమా అని ప్రశ్నించారు. మన సమస్యల్ని మనం అర్థం చేసుకుంటూ వాటి పరిష్కారాలపై ఇతరులకూ అవగాహన కల్పించాలని సూచించారు. మనకు ఏం అవసరమో గుర్తించాలన్నారు.

ఆస్కీ (ఏఎస్‌సీఐ) సెంటర్ ఫర్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్, అర్బన్ గవర్నెన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.శ్రీనివాసాచారి మాట్లాడుతూ, నగర సమస్యలు, పరిష్కారమార్గాలపై భావి తరాలకు అవగాహన కల్పించాలన్నారు. నగరం ఎదుర్కొనే నీటి సమస్యకు ప్రధాన కారణం లీకేజీ అని, సరఫరా అవుతున్న నీటిలో 55శాతం వరకు లీకేజీ చోటు చేసుకుంటున్నదన్నారు. దీన్ని గనుక నివారిస్తే నీటి సమస్యలను చాలా వరకు పరిష్కరించవచ్చునని సూచించారు. వాన నీటి సంరక్షణ చర్యలను సమర్థంగా చేపట్టలేకపోతున్నామన్నారు. హైదరాబాద్‌తో సహా ఎన్నో నగరాల్లో సీవరేజ్ వ్యవస్థ సరిగా లేదన్నారు. ఇలాంటి వాటికి మనమంతా బాధ్యులమేనని, వాటి పరిష్కారంలో మనకూ బాధ్యత ఉంటుందన్నారు. అధునాతన సాంకేతికతను వినియోగించడం ద్వారా వివిధ సమస్యలను సులువుగా




**కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్య అతిథి ప్రఖ్యాత చిత్రకారుడు ప్రొ॥ లక్ష్మాగౌడ్. చిత్రంలో డాక్టర్ రాకేష్ మిశ్రా, ఎం. వేదకుమార్. డాక్టర్ శ్రీనివాసాచారి, ఒ.ఎం.దెబెరా**

పరిష్కరించే వీలుంటుందని, అలాంటి వాటిపై దృష్టి సారించాలని కోరారు. మూసీ నది ప్రక్షాళనకు విదేశీ సాంకేతికత అవసరం లేదని, మన వద్ద విద్యాసంస్థలు, పరిశోధన సంస్థల సాయంతో ఈ సమస్యను పరి ష్కరించుకోవచ్చునని అన్నారు. వివిధ సమస్యల పరిష్కారానికి సామూహిక స్పందన అవసరమని, ఇందుకు యువత ముందుకు రావాలని సూచించారు.

సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ రాకేశ్ కె. మిశ్రా మాట్లాడుతూ, నగర అభివృద్ధికి సంబంధించి సమస్యలున్నా, వాటికి పరిష్కార మార్గాలు ఉంటాయన్నారు. ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య సంబంధం తెగిపోతున్నదని, ఆ లోటును ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ లాంటి సంస్థలు భర్తీ చేయాలని సూచించారు. స్విట్జర్లాండ్‌లో స్థానికంగా విధాన నిర్ణయాల్లో ప్రజల భాగస్వామ్యం అమలవుతున్న తీరును ఆయన ఈ సందర్భంగా వివరించారు.

ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ అధ్యక్షుడు యం.వేదకుమార్ మాట్లాడుతూ, సుమారుగా రెండు శతాబ్దాలుగా అభివృద్ధి పేరిట ప్రకృతి విధ్వంసం చోటు చేసుకుంటున్నదని అన్నారు. పర్యావరణ స్నేహపూర్వకంగా పండుగలను చేసుకోవాలని సూచించారు. బతుకమ్మ లాంటి పండుగలు ప్రకృతితో మన అనుబంధాన్ని చాటుతాయన్నారు. జలాశయాలను, ప్రకృతిని పరిరక్షించుకునేందుకు వీటిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. శాస్త్ర సాంకేతిక సంస్థలు సామాజిక సంస్థలతో అనుబంధాన్ని కలిగి ఉండాలన్నారు. కుతుబ్ షాహీలు, అసఫ్‌జాహీలు నగరాభివృద్ధికి చేసిన కృషిని ఆయన ఈ సందర్భంగా వివరించారు. చిన్న నగరాలే మంచివని, విస్తీర్ణం పెరిగే కొద్దీ వాటి నిర్వహణ కష్టమవుతుందన్నారు. పెద్ద నగరాలను సమస్యలను పరి ష్కరించడంలో భాగంగా కౌంటర్ మాగ్నెట్స్‌గా చిన్న పట్టణాలను వృద్ధి చేయాలని సూచించారు. వివిధ అంశాలపై ప్రజలకు సాధికారికత కల్పించే దిశగా ఎఫ్‌బీహెచ్ కృషి చేసిందన్నారు. అధికారులతో చర్చలు, సంప్రదింపులు, న్యాయస్థానాల్లో పిటిషన్లు వంటి వివిధ మార్గాల్లో సంస్థ తన కృషిని కొనసాగిస్తోందన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభించే ముందు పర్యావరణ కోసం పరితపించిన మాజీ ఉన్నతాధికారి ఆర్. రాజమణి మరణానికి ముందు సంతాపసూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ప్రకృతిని పరిరక్షించుకుందాం అని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ విద్యార్థులు హిందీలో ఆలపించిన కార్యక్రమంతో సమావేశం ప్రారంభమైంది. ఇదే రోజున ప్రపంచ పర్యావరణ దినం కూడా కావడంతో అందుకు ప్రతీకగా అతిథులకు కరివేపాకు మొక్కలను జ్ఞాపికలుగా బహుకరించారు. సంస్థ వార్షిక సంచికను ఆవిష్కరించారు.

ఎఫ్‌బీహెచ్ ఉపాధ్యక్షులు యం. హెచ్.రావు, కోశాధికారి రావు చెలికాని తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఖుమర్ మహ్మద్ ఖాన్, ఎస్.పి. శోరె, నాగవేందర్ రావు, కె.ఎస్.మూర్తి, మెహతా, ఎస్.జీవన్ కుమార్, విష్ణుకాంత్ బీడె, జె.దేవీప్రసాద్, ఫ్రాకె ఖాదర్, దీపాంకర్ దత్త తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

–దక్కన్ న్యూస్

ద

## ఆ ఉద్యోగులను తెలంగాణకు తీసుకురావాలి

ఏపీలో విధులు నిర్వహిస్తున్న తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగులను రిలీవ్ చేసేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం సుముఖతగా ఉన్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్రం సంఘం అధ్యక్షుడు గద్దం జ్ఞానేశ్వర్ కోరారు. ఏపీలో పనిచేస్తున్న ఉద్యోగులను తెలంగాణకు తీసుకొస్తానంటూ కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. నాంపల్లిలోని తెలంగాణ నాలుగో తరగతి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో నగర నాలుగో తరగతి తెలంగాణ ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఖాదర్‌బిన్ హసన్, ధన్‌రాజ్, రవికుమార్ పాల్గొన్నారు.

# న్యాయంలో తెలంగాణకు అన్యాయం

# ఉమ్మడి హైకోర్టు విభజన ఏనాటికో?




తెలంగాణ రాష్ట్రం ఏర్పడి రెండేళ్ళు గడిచినా సంపూర్ణ స్వరాష్ట్రం సాధించామన్న భావన మాత్రం ప్రజలకు ఇంకా కలగడం లేదు. ఇందుకు ప్రధాన కారణం న్యాయ వ్యవస్థలో విభజన ఇంకా పూర్తిగాకపోవడమే. ఉన్నతస్థాయిలో శాసనవ్యవస్థలో విభజన పూర్తయింది. కార్యనిర్వాహక వ్యవస్థలో విభజన ఇప్పుడిప్పుడే ఒక కొలిక్కి వస్తున్నది. న్యాయవ్యవస్థలో మాత్రం ఉన్నత స్థాయిలో విభజన ఇంకా మొదలే కాలేదు. అది ప్రారంభం కాకుండానే కింది స్థాయిలో విభజనను చేపట్టి అందులోనూ అన్యాయం చేయడాన్ని తెలంగాణ ప్రజానీకం సహించలేకపోతున్నది. ప్రజల ఆకాంక్షలకు అద్దం పడుతూ న్యాయవాదులు, న్యాయాధికారులు ఆందోళన చేపట్టారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి రెండేండ్లు గడిచినప్పటికీ, ప్రత్యేక హైకోర్టు ఏర్పాటుపై స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో పాటు ఉమ్మడి ముసుగులో దిగువ కోర్టుల న్యాయాధికారుల నియామకాలు, కేటాయింపుల్లో తెలంగాణకు అన్యాయం చేస్తుండటాన్ని ప్రశ్నించ డానికి న్యాయవాదులు, న్యాయాధికారులు సంఘటితమయ్యారు.

**విభజన కోసం ఆందోళన**

ఉమ్మడి హైకోర్టును విభజించాలని న్యాయవాదులు కొన్నాళ్లుగా ఆందోళనలు చేస్తున్నారు. వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాలు తదితరాలన్నీ ఈ ఆందోళనకు మద్దతుగా నిలిచాయి. అయినా కూడా కేంద్రంలో పెద్దగా కదలిక రాలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకరించనిదే ఈ విషయంలో తాము చేయగలిగింది పెద్దగా ఏదీ లేదన్న ధోరణిలో కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తోంది. తెలంగాణవాదులు మాత్రం కేంద్రం తలుచుకుంటే కొద్ది రోజుల్లోనే ఈ సమస్య పరిష్కారం కాగలదని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో సెక్షన్ 31 ప్రకారం ప్రస్తుత హైకోర్టును విభజించి, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హైకోర్టును ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడం జరిగిందని వారంటున్నారు. ఈ విధమైన విభజనకు గాను కేంద్ర ప్రభుత్వం రెండు రాష్ట్రాలకు చెందిన న్యాయశాఖ నిపు ణులతో కమిటీ ఏర్పాటు చేయాలని స్పష్టంగా విభజన చట్టంలో చెబుతున్నప్పటికీ, ఇప్పటి వరకు వేయకపోవడం సరికాదని పేర్కొన్నారు.

**ఇదీ వివాదం**

తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య న్యాయాధికారుల విభజన విషయంలో అభ్యంతరాలను ఆహ్వానిస్తూ గత నెల 3న హైకోర్టు తాత్కాలిక జాబితాను విడుదల చేసింది. ఆ జాబితా ప్రకారం 2-6-2014 నాటికి జిల్లా జడ్జీల కేడర్‌లో 205 మంది న్యాయాధికారులు పనిచేస్తున్నారు. ఇందులో తెలంగాణకు 95, ఏపీకి 110 మందిని కేటాయించారు. తెలంగాణకు కేటాయించిన 95 మందిలో 58 మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారున్నారు. ఏపీలో 29 ఖాళీలునప్పటికీ భర్తీ చేయకుండా వారిని తెలంగాణకు కేటాయించారు. జూనియర్, సీనియర్ సివిల్ జడ్జీలతో కలుపుకుని అన్ని కేడర్‌లలో ఏపీకి చెందిన 143 మందిని తెలంగాణకు కేటాయించారు.

**ఆప్షన్ల పేరుతో అన్యాయం**

ఒక వైపున ఉమ్మడి హైకోర్టును విభజించాలని కోరుతూ ఆందోళన చేస్తుండగా, అదేమీ పట్టనట్లుగా తెలంగాణ రాష్ట్రంలో ఆప్షన్ల పేరుతో ఆంధ్ర ప్రాంత జడ్జీలను, న్యాయాధికారులను ప్రాథమికంగా కేటాయించడాన్ని నిరసిస్తూ జూన్ 26వ తేదీన తెలంగాణ ప్రాంత జడ్జీలు, న్యాయాధికారులు రోడ్డెక్కారు. న్యాయాధికారుల కేటాయింపు తీరుపై తెలంగాణ న్యాయవాదులు, న్యాయాధికారు లు, ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ కేటాయింపు గనుక కార్యరూపం దాలిస్తే

తెలంగాణ న్యాయవ్యవస్థలో పొరుగు రాష్ట్రానికి చెందిన వారి ఆధిపత్యమే కొనసాగుతుందని, ఎన్నో ఏళ్ళ పాటు తెలంగాణ న్యాయాధికారులు ఉన్నతపదవులు రావని తెలంగాణ వాదులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆందోళన ఉధృతం**

హైకోర్టు విభజించకుండానే, జడ్జీలను, న్యాయాధికారుల కేటాయింపుల వల్ల స్వరాష్ట్ర సాధన అనంతరం కూడా తెలంగాణ వారికి అన్యాయం జరుగుతుందని పేర్కొంటూ, దశలవారీగా జడ్జీలు తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తూ వచ్చారు. జడ్జీలు, న్యాయాధికారులు క్రమశిక్షణ ఉల్లంఘించారన్న కారణంతో తొలుత తెలంగాణ జడ్జెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులను హైకోర్టు సస్పెన్షన్ చేయడంతో ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. అనంతరం మరో తొమ్మిది మందిని సస్పెన్షన్ చేయడంతో అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. న్యాయవాదులు చేస్తున్న పోరాటానికి ఇప్పటి వరకు అన్ని రాజకీయపక్షాలు సంఘీభావాన్ని ప్రకటిస్తూ వచ్చాయి. న్యాయాధికారుల విభజన ప్రక్రియలో భాగంగా హైకోర్టు మే 3న విడుదల చేసిన ప్రాథమిక కేటాయింపుల జాబితాపై న్యాయవాద వర్గాల్లో నిరసన వ్యక్తమై న్యాయవాదులు విధుల బహిష్కరణకు దిగారు. అనంతరం న్యాయాధికారులు మూకుమ్మడి సెలవులు, న్యాయశాఖ ఉద్యోగులు సమ్మెకు దిగడంలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలో ఓ వైపు న్యాయవ్యవస్థ స్తంభించిపోగా మరోవైపు చర్చలు కొనసాగాయి.

**ఢిల్లీకి చేరనున్న ఆందోళన ?**

జడ్జీలు, న్యాయాధికారులను సస్పెండ్ చేయాన్ని అధికార టీఆర్ఎస్ తీవ్రంగా పరిగణిస్తూ, వారి ఆందోళనలకు సంఘీభావాన్ని ప్రకటించింది. న్యాయ వాదులు, న్యాయమూర్తుల ఆందోళన పట్ల స్పందించిన ఉమ్మడి హైకోర్టును తక్షణమే విభజించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్రానికి లేఖ రాశారు. హై కోర్టు విభజన అనంతరమే జడ్జీలను, న్యాయాధికారులను కేటాయించా లన్నారు. హైకోర్టు విభజన చేపట్టక పోతే, ఢిల్లీలో దీక్ష చేసేందుకు రెడీ అన్న సంకేతాలు కూడా వెలువడ్డాయి.

**సీఎం లేఖాస్త్రాలు**

ఉమ్మడి హైకోర్టు విభజన ప్రక్రియను వేగిరం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం కేసీఆర్ కోరారు. హైకోర్టు విభజన జరిగాకే న్యాయాధికారుల విభజన, కేటాయింపుల విషయంలో తగిన నోటిఫికేషన్ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సిబ్బంది శిక్షణ, వ్యవహారాల మంత్రి జితేందర్‌సింగ్‌లకు వేర్వేరుగా లేఖలు రాశారు. హైకోర్టు రూపొందించిన తాత్కాలిక జాబితా తెలంగాణ న్యాయాధికారులు, న్యాయవాదుల్లో అసంతృప్తిని రగిల్చిందని లేఖలో పేర్కొన్నారు. ఈ కేటాయింపులను ఖరారు చేస్తే అది తెలంగాణ న్యాయాధికారుల భవిష్యత్ ఆశలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. 2014 పునర్విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు కింది కోర్టుల్లో పనిచేసే న్యాయాధికారులు ప్రస్తుతం ఎక్కడ పనిచేస్తున్నారో తదుపరి ఉత్తర్వులు







జారీ చేసే వరకు అక్కడే పనిచేయాలని, కేంద్రం నుంచి ఉత్తర్వులు లేకుండా ఈ స్థితిని మార్చడానికి వీల్లేదని పేర్కొన్నారు. అంతేకాక కేటాయింపులను కేంద్రమే చేపట్టాలని కోరారు. గతంలో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్‌ల విభజన జరిగినప్పుడు రెండు రాష్ట్రాల హైకోర్టులు కేంద్రానికి సిఫారసులు పంపాయని, ఆ తరువాతనే కేటాయింపులు జరిగాయని గుర్తు చేశారు. అంతేకాక పునర్విభజన చట్టంలోని సెక్షన్ 80 ప్రకారం 30 రోజుల్లో కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు కమిటీ ఏర్పాటు కాలేదన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని న్యాయాధికారుల కేటాయింపులను పునర్విభజన చట్ట నిబంధనల ప్రకారం, గత రాష్ట్ర విభజన సమయంలో అనుసరించిన విధానాల మేర కేంద్ర ప్రభుత్వమే చేపట్టాలని కోరారు. అంతేకాక పునర్విభజన చట్టంలోని సెక్షన్ 31 ప్రకారం ఉమ్మడి హైకోర్టును విభజించి ఏపీకి వేరుగా హైకోర్టు ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఈ ప్రక్రియ ఇంకా పెండింగ్‌లోనే ఉందన్నారు. పాలన, శాసన వ్యవస్థలను మాత్రమే విభజించి హైకోర్టును విభజించకపోవడమంటే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పరిపూర్ణం కానట్లే లెక్క అని తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో కేంద్రం వెంటనే హైకోర్టు విభజన ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ సీఎం కేసీఆర్ కోరారు.

**ఎటూ తేల్చని కేంద్రప్రభుత్వం**

హైకోర్టు విభజన అంశం కేంద్రం పరిధిలో లేదని కేంద్ర న్యాయ శాఖ మంత్రి సదానందగౌడ్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంపై కేసీఆర్ విమర్శలు ఆశ్చర్యాన్ని కలిగించాయని అన్నారు. జంతర్‌మంతర్ వద్ద ఆయన ధర్నా చేయదలచుకుంటే స్వాగతిస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ కేంద్రాన్ని తక్కువ చేసి మాట్లాడటం సరికాదన్నారు. హైకోర్టు విభజన అంశం ఉమ్మడి హైకోర్టులో ఉన్నందున తానేమీ వ్యాఖ్యానించలేనని స్పష్టం చేశారు. ఈ అంశంలో కేంద్రానికి ఎలాంటి పాత్ర లేదన్నారు. రాష్ట్రాల నిర్ణయాల విషయంలో కేంద్రం జోక్యం చేసుకోదని స్పష్టం చేశారు. కేంద్రంపై నిరాధార ఆరోపణలు చేయటం సరికాదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు ఏర్పాటుకు మౌలిక వసతులు

కల్పించాల్సిన బాధ్యత ఆ రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. హైకోర్టు విభజనపై పలు దఫాలుగా రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని పరిణామాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రెండు రాష్ట్రాల గవర్నర్లకు లేఖ రాస్తానని తెలిపారు.

**చట్టం ఏం చెబుతోంది?**

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం ఏర్పడిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాలకు ఏం చేయాలో సవివరంగా చెప్పింది. దీనిప్రకారం రెండు రాష్ట్రాలకు ప్రత్యేక హైకోర్టులు ఏర్పాటు చేయాలి. ఈ చట్టంలో ప్రస్తావించబడిన సెక్షన్ 31(1) చెబుతున్నదాని ప్రకారం.. సెక్షన్ 30కి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హైకోర్టు (హైకోర్టు ఆఫ్ ఆంధ్రప్రదేశ్), తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక హైకోర్టు (హైదరాబాద్‌లో మరో ప్రత్యేక తెలంగాణ హైకోర్టు) ఏర్పాటు చేయాలి. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని సెక్షన్ 31(2) చెబుతున్నదేమంటే.. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఎక్కడ ఉండాలన్నది.. రాష్ట్రపతి సూచన మేరకు (నోటిఫై) ఏర్పాటు కావాలి. అలాగే కేంద్ర క్యాబినెట్ నిర్ణయానుసారం, రాష్ట్రపతి నోటిఫై సూచన మేరకు హైకోర్టు విభజన జరగాలి. దీనిప్రకారం హైకోర్టు విభజన అనేది పూర్తిగా కేంద్ర ప్రభుత్వం చేతిలోని పని. హైకోర్టు విభజన అనేది రాజకీయంగా మారిపోయి తెలంగాణ రాష్ట్ర న్యాయమైన హక్కు హరించివేయబడుతున్నది. ఇది ఒకరకంగా భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కును తిరస్కరించడమే. ఆర్టికల్ 214 ప్రకారం.. ప్రతి రాష్ట్రానికి ఒక హైకోర్టు ఉండాలి. అలాంటప్పుడు తెలంగాణ రాష్ట్రానికి హైకోర్టు ఏర్పాటు చేయకపోవడమనేది పవిత్రమైన రాజ్యాంగానికి గౌరవం ఏం ఇస్తున్నట్లు? అని తెలంగాణ ప్రజానీకం ప్రశ్నిస్తోంది.

**గతంలో జరిగింది....**

కేంద్ర మంత్రులు గతంలో చెప్పినదానికి అనుగుణంగా.. తెలంగాణ ప్రభుత్వం రెండు హైకోర్టులు ఏర్పాటు చేయడానికి తగు వసతి, స్థలం సమకూర్చింది. హై కోర్టులు ఏర్పాటు చేయడానికి తగు వసతుల కల్పన చేసినట్లయితే వెంటనే హైకోర్టు విభజన చేస్తామని అప్పట్లో వారు హామీ ఇచ్చారు. దీనికి అనుగుణంగానే.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కే.చంద్రశేఖరరావు చొరవ తీసుకొని ఓ అడుగు ముందుకేసి తెలంగాణ హైకోర్టును మరో ప్రత్యేక బిల్డింగ్‌లో పెట్టడానికి కూడా సిద్ధపడ్డారు. కానీ.. ఇంతవరకు ఏ నిర్ణయం జరుగలేదు. హైకోర్టు విభజన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిపోయింది. దీంతో.. తెలంగాణ రాష్ట్రంలోని న్యాయవాదులు తమ న్యాయమైన డిమాండ్ కోసం, హైకోర్టు ఏర్పాటు కోసం ఉద్యమానికి దిగక తప్పలేదు. దీనిలో భాగంగానే 2015 ఫిబ్రవరిలో 45 రోజులు పెద్ద ఎత్తున నిరసన ఉద్యమాలు చేశారు. ఈ క్రమంలోనే.. టీఆర్ఎస్ ఎంపీలు కూడా న్యాయం కోసం పార్లమెంటరీ పంథాలో అనేక పోరాటాలు చేస్తూ వచ్చారు. నిండు సభలో హైకోర్టు విభజన గురించి.. 377 రూల్ ప్రకారం జీరో అవర్‌లో ప్రశ్న లేవనెత్తారు. అయినా



నిర్ణయాత్మకమైన చర్య ఏమీ తీసుకోలేదు. దీంతో గత్యంతరం లేని పరిస్థితిలో పార్లమెంట్ కార్యకలాపాలకు భంగం కలిగించే రీతిలో వారు ఆందోళన చేయాల్సి వచ్చింది. ఆ ఆందోళన కారణంగా పార్లమెంటును వాయిదా వేయాల్సిన పరిస్థితులు కూడా ఏర్పడ్డాయి. అయినా కూడా కేంద్రం నుంచి ఏ స్పందన రాలేదు. ఈ నేపథ్యంలోనే.. 2015 మే 5న హైకోర్టు విభజనను వ్యతిరేకిస్తూ దాఖలైన పిల్ కూడా కొట్టివేయబడితే, హైకోర్టు విభజనను సాధ్యమైనంత తొందరగా చేస్తామని కేంద్ర మంత్రి లోక్‌సభకు హామీ ఇచ్చారు. సరిగ్గా ఆ నాటికే పిల్ కూడా కొట్టివేయబడింది. టీఆర్ఎస్ ఎంపీల విజ్ఞప్తులు, నిరసనోద్య మాలన్నీ నిరుపయోగంగా, పనికిరానివిగా మారిపోయాయి.

**విభజన పర్యవేక్షణ కమిటీ..**

హైకోర్టులో పనిచేస్తున్న సిబ్బంది, న్యాయాధికారుల విభజన ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. హైదరాబాద్‌లో పనిచేయాలనుకునే జడ్జీలను ఇప్పటికే ఆప్షన్లు కోరారు. ఉమ్మడి హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆప్షన్ల ప్రక్రియ మే నెల10న ముగిసింది. ఆప్షన్ ప్రక్రియను సీల్డ్ కవర్‌లో ఉంచాలని రిజిస్ట్రార్ జనరల్ సీ హెచ్. మానవేంద్రనాథ్ రాయ్ న్యాయాధికారులకు, జిల్లా జడ్జీలకు స్పష్టం చేశారు. వీటన్నింటినీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ఏర్పాటు చేసిన విభజన పర్యవేక్షణ కమిటీ ముందుంచుతారు.

**తాత్కాలిక కేటాయింపుల జాబితా..**

విభజన పర్యవేక్షణ కమిటీ పరిశీలనానంతరం తాత్కాలిక కేటాయింపుల జాబితా విడుదలవుతుంది. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు, విజ్ఞప్తులు ఉంటే వాటిని కూడా ఆయా న్యాయాధికారులు జిల్లా జడ్జీలకు సమర్పించాల్సి ఉంటుంది. అభ్యంతరాలు, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న తరువాత తుది జాబితా విడుదలవుతుంది. ఉమ్మడి రాష్ట్రాల్లో మొత్తం 1,034 కోర్టులుండగా.. తెలంగాణలో 439, ఏపీలో 595 దాకా ఉన్నాయి. అన్ని కేడర్లలో న్యాయమూర్తులు 916 మంది ఉండగా తెలంగాణ వారు 242 మంది, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు 674 మంది ఉన్నారు. ఇక ఉమ్మడి హైకోర్టులో 1467మంది పనిచేస్తుండగా వారిలో తెలంగాణ వారు 389,






ఆంధ్రావారు 1079 మంది దాకా ఉద్యోగులు, న్యాయాధికారులున్నారు.

**ఏపీ హైకోర్టుకు హైదరాబాద్ తగదా?**

హైకోర్టు ఏర్పాటుకు కేంద్రం తగువిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సూచించాల్సిన అవసరం ఉన్నది. హై కోర్టు చీఫ్ జస్టిస్ సూచనలు, సలహా మేరకు హైకోర్టు విభజనకు సహకరించవలసిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరాల్సిన అవసరమున్నది. హైకోర్టు ఏర్పాటుకుగాను గచ్చిబౌలి బిల్డింగులను ఉపయోగించుకోవచ్చున న్న దాన్ని తిరస్కరించారు. ఈ క్రమంలోనే 2015 జూన్ లో నాటి హైకోర్టు చీఫ్ జస్టిస్ సేన్.. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆంధ్రప్రదేశ్‌లోనే ఏర్పాటు చేయాలని సూచించారు. వింతేమిటంటే.. అప్పటికి ఏపీ అసెంబ్లీ, ముఖ్యమంత్రి కార్యాలయం, డీజీపీ ఆఫీసు లాంటివన్నీ హైదరాబాద్‌లోనే ఉన్నాయి. అలాంటిది హై కోర్టు మాత్రం ఏపీలోనే ఏర్పాటు కావాలనే పేరుతో అక్కడ తగు వసతులు లేవనే పేరుతో విభజన జరగకుండా అయింది. నిజానికి హైకోర్టు హైదరాబాద్‌లో ఉండాలా, అమరావతిలో ఉండాలా అన్నది సమస్య కాదు. హై కోర్టు విభజన జరగాలన్నది ప్రధానం. హైకోర్టు విభజనకు మరేదీ ప్రాతిపదిక, సమస్య కాదు. మరోవైపు.. హైకోర్టు తప్పనిసరిగా విభజన జరగాలని ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం చెబుతున్నది. కాకుంటే.. సెక్షన్ 31(2)లో హైకోర్టు విభజనకు కాల వ్యవధి లేదు. ఎంతకాలంలో విభజన చేయాలన్నది పేర్కొనలేదు. ఈ విషయాన్ని ఆసరా చేసుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైకోర్టు విభజనను కాలయాపనతో అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ఏపీ స్తబ్దతకు ఎన్నో కారణాలు**

తెలంగాణలో హైకోర్టు విభజన కోసం న్యాయవాదులు, రాజకీయ పార్టీలు నిరసనలకు దిగుతున్నా ఈ అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం పెద్దగా స్పందించడం లేదు. ఏపీలోని వివిధ ప్రభుత్వ శాఖలను విజయవాడలోని అద్దె భవనాల్లో ఉంచి మరీ పాలన సాగించాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో హైకోర్టు ఏర్పాటు చేయడం పెద్ద విషయమేమీ కాదు. కానీ.. హైకోర్టు విభజన కోరడం వల్ల ఏపీ ప్రభుత్వానికి మరో పెద్ద తలనొప్పి వచ్చిపడే అవకాశం ఉందని అక్కడి పాలకులు భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. అందుకే ప్రస్తుతానికి ఏపీలో హైకోర్టు ఏర్పాటు వద్దన్న నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ హైకోర్టును అమరావతిలోనే ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంటే దీనిపై రాయలసీమ, ఉత్తరాంధ్రల్లో నిరసనలు వచ్చే అవ కాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రతిపక్ష వైసీపీ ఈ అంశంపై మరో పెద్ద రగడ సృష్టించడానికి ప్రయత్నిస్తుందని భావిస్తున్న తెలుగు దేశం నాయకులు ప్రస్తుతానికి హైకోర్టు విభజన విషయంలో తొందర పడవద్దని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ఏపీలో విపక్ష నాయకుడైన జగన్‌పై ఉన్న కేసులు కూడా హైకోర్టు ఏర్పాటు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైఖరిని ప్రభావితం చేస్తున్నాయన్న వాదనలు ఉన్నాయి. తాజాగా వినిపిస్తున్న ఊహాగానం ఏమిటంటే హైకోర్టు విభజన జరిగితే జగన్ అక్రమాస్తుల కేసులన్నీ తెలంగాణా హైకోర్టుకి బదిలీ అయిపోతాయి. అందుకే హైకోర్టు విభజన జరుగకుండా రాజధాని నిర్మాణంతో దా నిని ముడిపెట్టారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

**ఎన్నో ప్రశ్నలు**

ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ నుంచి పదేళ్ళపాటు రాష్ట్రాన్ని పరిపాలించుకొనే అవకాశం ఉన్నప్పటికీ, తాత్కాలిక సచివా లయం పూర్తిగా సిద్ధం కాకపోయినా ఏపి ప్రభుత్వోద్యోగులందరిపై తీవ్ర ఒత్తిడి చేసి హడావుడిగా తరలించినప్పుడు, హైకోర్టు విభజనకి ఎందుకు వెనుకాడుతున్నారు? హైదరాబాద్ లో పదేళ్ళ పాటు ఉమ్మడి హైకోర్టు ఉండవచ్చును కొన్నపుడు సచివాలయం మాత్రం ఎందుకు ఉ ండకూడదు? అసలు హైకోర్టు విభజనకి వెనకడటానికి కారణం ఏమిటి? లాంటి ప్రశ్నలు అనేకం ఇప్పుడు వినవస్తున్నాయి.

**హైకోర్టు లేని స్వరాష్ట్రం నిరర్థకం**

తమకు అన్యాయం జరిగిందని న్యాయాధికారులు రోడ్డెక్కడం వారి ఉద్యోగ నిబంధనలకు విరుద్ధమైతే కావచ్చునేమో గానీ అందుకు దారి తీసిన పరిణామాల గురించి కూడా ఆలోచించాల్సిన అవసరం ఉ ంది. హై కోర్టు లేని స్వరాష్ట్రం నిరర్థకమే. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఏ ఉద్దేశాలతో చేశారో అవి నెరవేరాలంటే తెలంగాణకు హైకోర్టు తప్పనిసరి. అదే సమయంలో, రెండు రాష్ట్రాల ప్రయోజనాల కోసమైనా హైకోర్టు విభజన విషయంలో ఇద్దరు ముఖ్య మంత్రులు సామరస్యంగా చర్చించుకొని పరిష్కరించుకోవలసి వుంది. ఈ విషయంలో చొరవ తీసుకునేందుకు కేంద్రం ముందుకు రావాలి.

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి శరవేగంగా నిర్మాణమవు తున్న నేపథ్యంలో.. అక్కడనే ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఏర్పాటుచేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలి. హైదరాబాద్‌లో ఏదోవిధంగా తిష్ట వేసి ఆధిపత్యం చెలాయించాలనే చర్యలకు అడ్డుకట్టపడాలని తెలంగాణ ప్రజానీకం కోరుకుంటున్నది.

-దక్కన్ న్యూస్ ద

## విచక్షణాధికారం పేరిట ఇష్టానుసారంగా ఉత్తర్వులా?



క్వాసీ జ్యుడీషియల్ అధికారాలతో ఉత్తర్వులు జారీచేసే విషయంలో నిబంధనలు పాటించేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు హైకోర్టు స్పష్టం చేసింది. కిందిస్థాయి అధికారులు ఇచ్చే ఉత్తర్వులను పునఃపరిశీలించి, క్వాసీ జ్యుడీషియల్ ఉత్తర్వులు జారీచేసే విషయంలో ఇష్టానుసారంగా కాకుండా.. చట్టబద్ధంగా వ్యవహరించాలని, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అధికారులకు జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలోని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఏపీ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాకు చెందిన మైనింగ్ వ్యవహారంలో క్వాసీ జ్యుడీషియల్ అధికారాల పేరిటి ఇష్టానుసారంగా జరిమానాలు టవిధించడంపై దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ విషయంలో అధికారుల తీరుపై విస్మయం వ్యక్తం చేసింది. విచక్షణాధికారం పేరిటి చట్టాలకు అతీతంగా ఉత్తర్వులు వెలువరించడం కాదని పేర్కొన్నది. ఈ వ్యవహారాన్ని ఏపీ రాష్ట్రానికి మాత్రమే కాకుండా, తెలంగాణ రాష్ట్రానికి కూడా వర్తింపజేయాలని హైకోర్టు రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది.

## కోఠి దవాఖాన దుస్థితిపై స్పందించిన ధర్మాసనం

హైదరాబాద్‌లోని కోఠి ప్రసూతి దవాఖానలో మౌలికవసతులు లేక గర్భిణులు రోడ్డుపై వేచిచూడాల్సిన దుస్థితిపై హైకోర్టు స్పందించిది. వైద్యశాలలో పడకలు అందుబాటులో లేకపోవడంతో ప్రసవం కోసం వచ్చే గర్భిణులు రోడ్డుపైనే మకాం వేసిన స్థితిగతులపై పలు పత్రికల్లో వచ్చిన వార్త కథనాలను సుమోటోగా హైకోర్టు విచారణకు స్వీకరించింది. వీటి ఆధారంగా కేసు నమోదు చేయాలని రిజిస్ట్రీని ఆదేశించడంతో సుమోటోగా కేసును నమోదు చేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, కోఠి ప్రసూతి దవాఖాన సూపరింటెండెంట్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యదర్శులను ప్రతివాదులుగా పేర్కొన్నారు.

## గజరాజుల ఉపయోగంపై నిషేధం!

కేరళలో ప్రధాన పండుగ అయిన మకరవిలక్కు సందర్భంగా శబరిమలలో నిర్వహించే విగ్రహ ఊరేగింపుల కోసం గజరాజులను వినియోగించుకోవడంపై నిషేధం విధిస్తూ కేరళ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సంప్రదాయాలు, ఆచారాల ప్రకారం ఏనుగుల వినియోగంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో వాటిని ఉపయోగించ కూడదని కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి థొట్టాహిల్ బీ రాధాకృష్ణన్, జస్టిస్ అనుశివరామన్‌తో కూడిన ధర్మాసనం ప్రధాన పూజారులకు, ట్రావంకోర్ దేవస్థానం బోర్డులకు నోటీసులు జారీ చేసింది.

## ఓయూలో సభలకు అనుమతి వద్దు

ఉస్మానియా యూనివర్సిటీలో రాజకీయ పార్టీలు నిర్వహించే రాజకీయ సమావేశాలు, సభలకు అనుమతి ఇవ్వవద్దంటూ ఉమ్మడి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు సంబంధిత అధికారులకు నోటీసులు జారీచేసింది. ఓయూలో సభలకు అనుమతి ఇవ్వొద్దంటూ న్యాయ విద్యార్థి రాహుల్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై జస్టిస్ చల్లా కోదండరామ్ ఆధ్వర్యంలోని నాయ్యయస్థానం విచారించి ఆదేశాలు జారీచేసింది.

## అక్రమమైతే తప్ప ఆస్తుల సంపాదన నేరం కాదు

మార్గాలు అక్రమం అయితే తప్ప ఆస్తుల సంపాదన నేరం కాదని సుప్రీంకోర్టు పేర్కొంది. అక్రమాస్తుల కేసులో తమిళనాడు సీఎం జయలలితను నిర్దోషిగా ప్రకటిస్తూ కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పులో హేతుబద్ధత లేదని పేర్కొంటూ కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ విచారణకు స్వీకరించింది. సాధారణంగా వెకేషన్‌లో అత్యంత ముక్యమైన కేసులను మాత్రమే సుప్రీంకోర్టు విచారిస్తుంది. కానీ జస్టిస్ పీసీ ఘోష్, జస్టిస్ అమితావారాయ్ నేతృత్వంంలోని వెకేషన్ బెంచ్ అనూహ్య రీతిలో జయలలిత అక్రమాస్తుల కేసును తుది విచారణకు అనుమతించింది. ఇరుపక్షాల న్యాయవాదుల సమ్మతితో విచారణ జరిగిన తర్వాత ఈ కేసులో తమ ముందు మూడు ఆప్షన్లు ఉన్నాయని సుప్రీంకోర్టు పేర్కొంది. కర్ణాటక హైకోర్టు తీర్పు ధ్రువీకరించడంగానీ, దాన్ని తిప్పి కొట్టడం గానీ, పూర్తిగా ఆధారాల పునఃపరిశీలనలో తాజాగా కేసు పునర్విచారణకు చర్య తీసుకోవాలని హైకోర్టును ఆదేశించడంగానీ చేయాల్సి ఉంటుందని తెలిపింది.

## చెట్ల నరికివేతపై హైకోర్టు విస్మయం

వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రణాళిక (ఎస్ఆర్‌డీపీ) కింద నిర్మిస్తున్న బహుళ అంతస్తుల ఫ్లై ఓవర్ల నిర్మాణం కోసం హైదరాబాద్‌లో కాసు బ్రహ్మానందరెడ్డి పార్కులో చెట్ల నరికివేతకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో ప్రజా, ప్రైవేటు అవసరాల కోసం ఎంత విస్తీర్ణంలో భూమిని కేటాయించారో తెలుపాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ వివరాలన్నింటితో కౌంటర్ దాఖలు చేయాలని సూచించింది. ద

## యూట్యూబ్‌లో 'చర్చ' వీడియోలు

తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహించిన 'చర్చ' కార్యక్రమం వీడియోలో యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే కొన్ని వీడియోలను అప్‌లోడ్ చేశాం. మరి కొన్నింటిని త్వరలోనే అప్‌లోడ్ చేస్తాం.




## స్థానికతపై స్పష్టత ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు వచ్చి విధులు నిర్వహిస్తున్న ఆంధ్రా ఉద్యోగుల స్థానికతపై కేంద్రం స్పష్టత నివ్వాలని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఏపీకి వెళ్లనున్న ఆంధ్రా ఉద్యోగుల పిల్లల స్థానికతపై రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసినట్లే తెలంగాణలోని ఏపీ ఉద్యోగులపైనా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. ఇప్పటివరకు తెలంగాణలో ఉండి ఏపీకి వెళ్లిన ఉద్యోగులకు తెలంగాణలో స్థానికత హోదా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ ఉద్యోగులు, పిల్లల స్థానికత ఒకే రాష్ట్రం ఉండేలా చర్యలు తీఃసుకోటవాలని పేర్కొన్నారు. ఏపీకి కేటాయించిన తెలంగాణ ఉద్యోగులను వారి సొంత రాష్ట్రానికి బదిలీచేసే అంశంపై ఇరు రాష్ట్రాల సీఎంలు చర్చించి ఏ రాష్ట్ర ఉద్యోగులు ఆ రాష్ట్రానికి కేటాయించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. ఈ విషయమై తెలంగాణ సీఎం కే చంద్రశేఖర్‌రావు గరవ్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌ను కలిసి తెలంగాణ ఉద్యోగులను తెలంగాణకు కేటాయించేలా చొరవ తీసుకోవాలని కోరారన్నారు. కానీ ఏపీ సీఎం చంద్రబాబు మొండిగా వ్యహరిస్తున్నారని ఆరోపించారు. కేవలం సచివాలయ ఉద్యోగులను మాత్రమే కాకుండా ఏపీకి కేటాయించిన ఉద్యోగులందరినీ అమరావతికి తీసుకెళ్లాలని చంద్రబాబుకు సూచించారు.

## 'ఆప్షన్'ను వెనక్కి తీసుకోవాలి

ఆంధ్రా న్యాయమూర్తులు న్యాయవాదులతోపాటు జ్యుడిషయల్ ఉద్యోగులు హైకోర్టు జారీ చేసిన ఆప్షన్లను తిరస్కరించి ఆంధ్రాకు వెళ్లిపోవాలని కోరుతూ సిటీ సివిల్ కోర్ట్ న్యాయవాదులు కోర్టు ఎదుట నిరసన చేపట్టారు. మెగాలోక్ అదాలత్ న్యాయమూర్తులను సిటీ సివిల్ కోర్ట్‌లోనికి ప్రవేశించకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కో కన్వీనర్లు మాణిక్ ప్రభుగౌడ్, తిరుమల్‌రావు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జ్యుడిషియల్ ఉద్యోగులను విభజన చేయకుండా వారిని ఆప్షన్ కోరడం తెలంగాణ యువతను నిర్వీర్యం చేయడమే నన్నారు. జ్యుడిషయిల్ ఉద్యోగులు వారి స్వస్థలాలకు వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్లు మాణిక్ ప్రభుగౌడ్, తిరుమల్‌రావులతోపాటు న్యాయవాదులు వెంకటరమణ యాదవ్, ప్రవీణ్, శ్రీనివాస్, కిషోర్, గిరిధర్‌రెడ్డి, లింగం పాల్గొన్నారు.

## 'స్టేషన్ బెయిల్' చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి

'స్టేషన్‌బెయిల్' (41 సీఆర్‌పీసీ) దుర్వినియోగం అవుతోందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ఈ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని నవ తెలంగాణ న్యాయవాదుల వేదిక అధ్యక్షుడు ఎస్.నాగేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'స్టేషన్‌బెయిల్'ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సదస్సు నిర్వహించారు. స్టేషన్ బెయిల్ ద్వారా యువ న్యాయవాదులు, ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆయన ఆరోపించారు. చెన్నై, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాలలో స్టేషన్‌బెయిల్‌ను రద్దు చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయడం ద్వారా ఈ చట్టంలో సవరణలు తీసుకురావచ్చని అభిప్రాయపడ్డారు. న్యాయవాది వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఏడేళ్లలోపు శిక్షకు గురైన వారు స్టేషనల్ బెయిల్ తీసుకునేలా చట్టం కల్పించిందని, దీంతో దొంగతనాలు, చైన్‌స్నాచర్లు, లైంకిగదాడి, చీటింగ్ చేసే వారిలో భయం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదులు మిశ్రా, రాజ్‌కుమార్, యాదగిరి, మోమన్‌రావు, సతీష్, చెన్నయ్య మాట్లాడుతూ సామాన్య ప్రజలకు చట్టాలపై అవగాహన లేదని, చైతన్యం కల్పించాల్సిన అవసరముందన్నారు.

## ఆరె కులస్తులను ఓబీసీలో చేర్చాలి

ఆరె కులస్తులను ఓబీసీలో చేర్చాలని ఆరె కుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. చిక్కడపల్లి అరోరా కళాశాలలో తెలంగాణ ఆరె కుల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశంలో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు చెట్టిపల్లి శివాజీ మాట్లాడుతూ స్వతంత్ర వచ్చి దశాబ్దాలు గడస్తున్న నేటికి ఆరె కులస్తులు అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. నగరంలో ఆరె కులస్తుల భవనం కోసం ఒక ఎకరా భూమిని కేటాయించాలని ఆయన కోరారు. ఆరెలు దేవునిగా భావించే ఛత్రపతి శివాజీ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శులు దిగంబరావు, సంపత్‌రావు, ఉపాధ్యక్షుడు లింగంపల్లి కిషన్‌రావు, శివాజీరావు పాటిల్, సంపత్ రావు, అంబదాస్, భజరంగ్‌రావు పాల్గొన్నారు.

## ఓయూసెట్ అక్రమాలపై విచారణ జరిపించాలి'

ఉస్మానియా యూనివర్సిటీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో జరిగిన అక్రమాలపై న్యాయవిచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ అక్రమాలకు బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ కార్యా లయం ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ ఓయూసెట్‌లో భాగంగా నిర్వహించిన ఎంఏ ఫిలాసఫీ పరీక్షలో గతేడాది ప్రశ్నాపత్రమే ఈ ఏడాది కూడా వచ్చిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ముసవీర్, మల్లేష్, హే మంత్, రమేష్, కిరణ్, నవీన్, క్రాంతి, విజయ్, గోవింద్, ధర్మ, మహేష్, బాలకృష్ణ పాల్గొన్నారు.

## వర్గీకరణపై కేంద్రం మౌనం వీడాలి

ఎస్సీ వర్గీకరణపై కేంద్రప్రభుత్వం మౌనం వీడాలని ఎమ్మార్పీస్

జాతీయ కార్యదర్శి కొండూరు రాజెల్లయ్య మాదిగి అన్నారు. బన్సీలాల్‌పేటలోని చాచానెహ్రూ నగర్‌లో సనత్‌నగర్ నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఉమ్మడి రాష్ట్రంలో వర్గీకరణ కోసం పోరాటం జరుగుతున్నప్పుడు సంపూర్ణ మద్దతు ప్రకటించిన బీజేపీ ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నదో జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని చెప్పిన బీజేపీ, రెండేళ్ళు అయినా సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. వచ్చే వర్షాకాల సమావేశాలలో వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. జూన్ 19 నుండి జులై 3వరకు సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాలలో మాదిగ బస్తీలలో పాదయాత్రలను చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగరప్రధాన కార్యదర్శి మాచర్ల ప్రభాకర్, నాయకులు మురళీ, శంకర్, ఎల్లయ్య, నర్సింగ్, జగదీశ్వర్, ఉపేందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నిరుపేదల ఓసీల అభివృద్ధి, సంక్షేమం కోసం తక్షణమే పదివేల కోట్లతో జాతీయ ఓసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఓసీ సంక్షేమ సంగం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అగ్రవర్ణ పేద విద్యార్థులు దేశవ్యాప్తంగా ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత విద్య అభ్యసించలేక అర్థాంతరంగా చదువులకు స్వస్తి చెబుతున్నారని, ఆరు కోట్ల మందికి పైగా ఉన్న నిరుపేద ఓసీల సంక్షేమం కోసం వివిధ రాష్ట్రాలతో పాటు జాతీయ స్థాయిలో కార్పొరేషన్ ఏర్పాటు చేసేవిధంగా ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రం, కేంద్రంలో అత్యధిక శాతం అగ్రవర్ణాలకు చెందిన నాయకులు అధికారంలో ఉన్నా ఓటు బ్యాంకు రాజకీయాలకు భయపడి నిరుపేద ఓసీలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. పేద ఓసీ విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు ఆర్థిక సమాయం అందించాలని ప్రణాళిక సంగం నియమించిన ప్యానల్ అనేక మార్లు సిఫారసు చేసిన కేంద్రం నిర్లక్ష్యం చేయడంపట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అగ్రవర్ణ పేదలు సమస్యలను పరిష్కరించేందుకు గాను ప్రభుత్వాలు అనేక కమిటీలు వేసినా నివేదికలు ఆమోదించకుండా కాలయాపన చేస్తున్నాయన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

ఉద్యోగ, ఉపాధ్యాయులకు నూతన పెన్షన్ స్కీమ్ (సీపీయస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలని – పాత పెన్షన్‌ను విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన 12 సంవత్సరాల్లో జరిగిన నియమాకాల్లో అధికంగా ఉపాధ్యాయులే ఉన్నారని అన్నారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకు వెళ్లి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. టీఎస్‌జీవో గౌరవ అధ్యక్షుడు దేవిప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటూ అన్ని కేటగిరీల్లో కొన సాగుతున్న ఈ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీలు పూల రవీందర్, జనార్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

గ్రామపంచాయతీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతి కారోబార్స్, బిల్‌కలెక్టర్స్, ఉద్యోగుల సంఘంఆధ్వర్యంలో ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది ఇక తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఎంతో ఆశతో గ్రామ పంచాయతీ ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం జీ.ఓ.ఆర్.టీ 613ను వెంటనే అమలు చేసి రెగ్యులర్ చేయాలని, 60 సంవత్సరాలకు పైబడి సర్వీసులో ఉన్న గ్రామ పంచాయతీ ఉద్యోగులందరికి మినిమమ్ పెన్షన్ విధానం వర్తింపజేసి, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిక్కుడు ప్రభాకర్, సంఘం గౌరవ అధ్యక్షులు మామిడాల నర్సింహులు, రాష్ట్ర కోశాధికారి నాగరాజు, జిల్లాల అధ్యక్షులు సత్యనారాయణ, రాము, బస్వరాజ్, నాయకులు రవి, వజీర్, మోహన్, లచ్చయ్య, జయమ్మ, సురేందర్, మల్లేష్, రామిరెడ్డి, క్రిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## బల్దియా కార్మిక సంఘ ఎన్నికలు నిర్వహించాలి'

బల్దియాలో గుర్తింపు కార్మిక సంఘాన్ని ఎన్నుకునేందుకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని బీఎంఎస్ డిమాండ్ చేసింది. గత గుర్తింపు సంఘం గడువు పూర్తయి రెండేళ్ల గడిచినా ఎన్నికలు నిర్వహించక పోవడం సరికాదని యూనియన్ అధ్యక్షులు శంకర్ విమర్శించారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యంలో బల్దియా ప్రధాన కార్యాలయం ముందు వారు ధర్నా నిర్వహించారు. ఎన్నికలు వెంటనే నిర్వహించడంతోపాటు కార్మికుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ధర్నా కారణంగా కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడడంతో పోలీసులు పలువురు యూనియన్ నేతలను అరెస్టు చేసి గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

# డ్రమ్ సీడర్‌తో వరి సాగు - ప్రయోజనాలు

సాంప్రదాయ వరిసాగు కంటే మెరుగైన పద్ధతిగా శ్రీ సాగు మన రాష్ట్రంలో గత నాలుగైదేళ్ళుగా ప్రాచుర్యం పొందింది. తక్కువ నీరు, తక్కువ విత్తనం, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించే శ్రీ పద్ధతిని ఎకరాకు 40 నుండి 50 బస్తాల దిగుబడిని సాధించి శ్రీ పద్ధతిపై రైతులకు నమ్మకం పెంచింది.

ఏ పంట సాగుకైనానానాటికీ కూలీల లభ్యత తీవ్రంగా ఉన్నది. గ్రామాల్లో ఒకే సారి పంట విత్తడమో, పంటలో కలుపుతీయడ మో లేక పంటకోతలు జరిగితే కూలీల లభ్యత కష్టంఅవ్వడమేగాక వారికి అదనపు కూలీ చెల్లించి, వారి కాళ్ళావేళ్ళా పడి పని చేయించుకోవాల్సి వస్తోంది. 'శ్రీ' పద్ధతి అధిక విస్తీర్ణంలో విస్తరించకపోవ డానికి ఈ కూలీల సమస్యే ముఖ్య కారణం. ఇటువంటి తరుణం లో వ్యవసాయంలో యాంత్రీకరణరైతులకెంతోఊరటనిస్తుంది.

ఈ కోవకు చెందినదే వరిలో నేరుగా వరుసల్లో విత్తే పరికరం డ్రమ్ సీడర్, ఈ పరికరం మార్కెట్లో విడుదలయ్యి సంవత్సరాలు గడిచి వ్యవసాయ శాఖ వారు 50 శాతం సబ్సిడీ ఇస్తున్నారైతులలో ఈ పరికరం మీద అవగాహన లేక వారి నుంచి స్పందనకరువైంది. ఈ పరికరంతో వరిసాగుచేయడంవలన కలిగేలాభాలను రైతులకు తెలియచేస్తున్నాము.

- ఒక ఎకరానికి 15 కిలోల విత్తనం సరిపోతుంది. నారు పో యవలసిన అవసరం లేదు. సాధారణంగా వరిని మొలకెత్తించే ప్రక్రియనేపాటించాలి. ప్రధానపొలం బాగా దుక్కిదున్ని దమ్ముచేసి, చదును చేయాలి. డ్రమ్ సీడర్ పరికరంలోని నాలుగు డ్రమ్ములలో మొలకెత్తిన విత్తనాన్ని ఒక్కో డ్రమ్ము 3/4 వంతు మాత్రమే నింపాలి.
- డ్రమ్ నిండా విత్తనం నింపితే అవి డ్రమ్ నుండి సరిగా రా లవు. గింజ మొలక మరీ పొడవుగాకుండా చూసుకోవాలి. ఒక ఎకరాలో విత్తడానికి 3 కూలీలు అవసరం.
- డ్రమ్ సీడర్ను లాగడానికి ఒకరు, డ్రమ్ముల్లో గింజలు నిం పడానికి ఒకరు, వారికి సహాయకుడిగా ఒకరు అవసరం.
- ఒక ఎకరాలో విత్తడానికి కేవలం 120 నిమిషాలు (2 గం టలు) సమయం సరిపోతుంది.ఒకసారి డ్రమ్ సీడర్ లాగితే 8 వరుసల్లో గింజలు విత్తబడతాయి.
- విత్తిన తర్వాత బూటాక్లోర్కలుపుమందు ఖచ్చితంగా చల్లాలి, అవసరమైతే విత్తిన 30-40 రోజుల తర్వాత 2,4-డి సోడియం లవణాన్ని పిచికారీ చేయడం వలన

**సాంప్రదాయ పద్ధతి, శ్రీ పద్ధతి మరియు నేరుగా విత్తే పద్ధతిలోని వ్యత్యాసాలు**

| సాధారణ పద్ధతి | శ్రీ పద్ధతి | డ్రమ్ సీడర్ పద్ధతి |
|---|---|---|
| ఎకరాకు 30-40 కిలోల విత్తనం అవసరం | ఎకరాకు 2 కిలోల విత్తనం అవసరం | ఎకరాకు 15 కిలోల విత్తనం అవసరం |
| నారు పోసి 25-30 రోజుల వయసున్న నారును నాటాలి | నారు పోసి 8-12 రోజుల వయసున్న నారును నాటాలి | నారు పోయవలసిన అవసరం లేదు |
| నారుపోయుటకు, నారు మడికి ఖర్చు ఎక్కువ | నారుపోయుటకు, నారు మడికి ఖర్చు తక్కువ | ఎటువంటి ఖర్చు లేదు |
| నాటటానికి దాదాపు 15 కూలీలు అవసరం | నాటటానికి దాదాపు 10 కూలీలు అవసరం | విత్తడానికి 3 కూలీలు అవసరం |
| నాటేటపుడు ఎంత దూరం అనేది పాటించరు | 25x25 సెం.మీ.దూరంలో కుదురుగా ఒక్కోమొక్కనే నాటాలి. | 20 x 8 సెం.మీ.దూరంలో కుదురుగా 5 గింజలు పడతాయి |
| పొలం నాటినప్పటి నుండి 5 సెం.మీ. లోతు నీరు నిలువ ఉంచుతారు | నాటినప్పటి నుండి పొలాన్ని తడిగా మాత్రమే ఉంచి నీరు నిలువ ఉంచరాదు | విత్తి నప్పటి నుండి పొలాన్ని తడిగా మాత్రమే ఉంచి నీరు నిలువ ఉంచరాదు |
| కలుపు ను కూలీల తో తీయిస్తారు.కలుపు మందులను వాడతారు | రోటరీ వీడర్ను 4-5 సార్లు తిప్పి పొలములోని కలుపును తొక్కిస్తారు | కోనోవీడర్ ను ఉపయోగించి కలుపును మొలకెత్తిన 25 రోజుల నుండి 4 సార్లు నడిపి తీస్తారు. |
| దిగుబడి ఎకరాకు 30-40 బస్తాలు వస్తుంది | ఎకరాకు 45 బస్తాలు వస్తుంది | దిగుబడి ఎకరాకు 45 బస్తాలు వస్తుంది |
| నికరదాయం ఎకరాకు తక్కువ ఉంటుంది | నికరదాయం ఎకరాకు బాగానే ఉంటుంది | నికరదాయం ఎకరాకు ఎక్కువగా ఉంటుంది |





కలుపు నిర్మూలిం చవచ్చు.

- శ్రీ పద్ధతిలో లాగా, ఈ పద్ధతిలోను కోనోవీడర్ ద్వారా కలుపు తొక్కించాలి. కాకాపోతే ఈ పద్ధతిలో కేవలం ఒకే దిక్కులో అంటే తూర్పు-పడమరగానీ, ఉత్తరం-దక్షిణం దిశలోకానీకోనోవీడర్ను నడపాలి.ఈపద్ధతికి అవసరమయ్యే కోనోవీడర్ యొక్కచక్రాలు 15 సెం.ల వెడల్పుతో ఉంటాయి, కావున శ్రీ పద్ధతిలోవాడేకోనో వీడర్లు(25 సెం.మీ. వెడల్పుగల చక్రాలు) పనికిరావు.
- కోనోవీడర్ను నడపడం వలన కలుపుమొక్కలు సేంద్రీయ ఎ రువుగా ఉపయోగపడడమేగాక, వరి యొక్కవేర్ల భాగం కదిలి మొక్కకు గాలి, నీరు, ఆహారం బాగా సమకూరి అధిక దిగుబడి సాధ్యమవుతుంది.

**–డాక్టర్.యన్.కృష్ణ ప్రియ,**
**డాక్టర్. చంద్రశేఖర్‌రెడ్డి,**
**డాక్టర్. శివనారాయణ**

# తెగుళ్లు నివారిస్తేనే లాభాల పసుపు

ఈ తెగులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు, గాలిలో ఎక్కువ తేమ, తక్కువ ఉష్ణోగ్రత ఉండటం వలన వ్యాపిస్తుంది. పెద్దపెద్ద అండాకారపు మచ్చలు ఆకులపై అక్కడక్కడ కనబడతాయి. మచ్చలు ముధురు గోధుమ రంగులో ఉండి మచ్చ చుట్టూ పసుపు రంగు వలయం ఏర్పడుతుంది. ఆకు కాడపై మచ్చలు ఏర్పడి కిందకు వాలి పోతుంది. దీని నివారణకు ద ృఢమైన విత్తనాన్ని ఎన్నుకోవాలి. మచ్చలు ఉన్న, ఎండిన ఆకులను తొలగించి కాల్చివేయాలి. లీటర్ నీటిలో గ్రాము కార్బండిజమ్ లేదా 2.5 గ్రాముల మాంకోజబ్‌తో పాటు అర మిల్లీ లీటర్ సబ్బునీరు లేదా థయోఫానేట్ మిథైల్ గ్రాము మార్చిమార్చి పిచికారీ చేయాలి.

**ఆకుమచ్చ తెగులు**

ఈ ఆకుమచ్చ తెగులు కూడా ఈదురు గాలులతో కూడిన వర్షాలు, గాలిలో ఎక్కువ తేమ, తక్కువ ఉషో?గ్రతల వలన వస్తుంది. మొదట ఆకులపై చిన్న, చిన్న పసుపు రంగు చుక్కలు ఏర్పడుతాయి. తరువాత చిన్నచిన్న గోధమ రంగు మచ్చలుగా మారుతాయి. తెగులు ఎక్కువైతే ఆకుమాడి పోతుంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో ఈ తెగులు ఎక్కువగా కనబడుతుంది. దీని నివారణకు ఈ తెగులు సోకిన ఆకులను కత్తిరించి నాశనం చేయాలి. తాటాకు మచ్చ తెగులుకు సూచించిన మందులతో పాటు 1 మి.లీ ప్రోపికోనజోల్ లీటర్ నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

**దుంప, వేరుకుళ్లు తెగులు**

విత్తన శుద్ధిలేని కొమ్ములు నాటడం, మురుగు నీటి పారుదల సరిగా లేకపోవటం, సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించక పోవటం, ఎడతెరిపి లేని వర్షాలు కురిసి మొక్కల చుట్టూ నీరు ఉ ండటంతో ఈ తెగులు సోకుతుంది.

**లక్షణాలు**

ఈ తెగులు సోకి తే ఆకులు మందంగా వాడిపోయి గోధుమ రంగుకు మారి చివరకు ఎండిపోతాయి. తరువాత మొక్క పై భాగాన ఉన్న లేత ఆకులకు ఈ వ్యాధి వ్యాపిస్తుంది.

తల్లి కొమ్ములు, పిల్ల దుంపలు కుళ్లి మెత్తబడిపోతాయి. చెడు వాసన వస్తుంది. నాణ్యత కూడా బాగా తగ్గుతుంది.

**దీని నివారణకు...**

లీటర్ నీటికి మూడు గ్రాముల రిడోమిల్ ఎం.జెడ్ లేదా మాంకోజెబ్ లేదా 2 మి.లీ మోనోక్రొటోఫాస్ లీటర్ నీటి చొప్పున కలిపిన ద్రావణంలో కొమ్ములను 30–40 నిమిషాలు నానబె ట్టాలి. తరువాత నీరు మార్చి లీటర్ నీటికి 5 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి కలిపి ఆ ద్రావణంలో 30 నిమిషాలు ఉంచి నీడలో ఆరబెట్టి నాటు కోవాలి.వేసిన పొలంలోనే పసుపు వేయకుండా వరి, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న తదితర పంటలతో పంట మార్పిడి చేయాలి.

దుంపలు విత్తిన తరువాత జీలుగు, జనుము, వెంపలి, వేప, కానుగ తదితర పచ్చి ఆకులు లేదా ఎండు వరిగడ్డి, చెరకు ఆకులను పొలంపై దుంపలు మొలకలు వచ్చేంత వరకు కప్పడం వలన తెగులు ఉధృతిని కొంతకొంత వరకు తగ్గించవచ్చును.

**–సి.హెచ్.పల్లవి,**
**యు.కిషోర్ కుమార్,**
**డి.అనిల్**

# పరీక్ష

అందమైన స్విట్జర్లెండును ఒక దుర్మార్గుడు పరిపాలించే వాడు. ఆ దుర్మార్గుణ్ణి తొలగించి మంచి రాజ్యం ఏర్పరచాలని అనేకమంది దేశ భక్తులు ప్రయత్నించేవారు. అలాంటి దేశభక్తులలో ప్రముఖుడు విలియం టెల్.

విలియం టెల్ విలువిద్యలో నిపుణుడు. అతనికొక ముద్దుల చిన్నారి కొడుకుండేవాడు. టెల్‌ను పట్టుకోవాలని సైనికులు ఎంత ప్రయత్నించినా వారికి చిక్కలేదు. సైనికులు దేశమంతా వెదికారు. కనబడిన వారినల్లా అడిగారు. కొందరిని కొట్టారు. మరి కొందరిని ఖైదులో పెట్టారు. అయినా విలియం టెల్ ఆచూకీ వారికి తెలియలేదు. అయితే అనుకోకుండా వారికి టెల్ చిన్నారి కొడుకు తారస పడ్డాడు. ఆ బాబును తీసుకు పోయారు. ఆ బాబు సైనికాధికారి వద్ద ఉన్నట్లు దేశమంతటా చాటింపు వేయించారు. విలియం టెల్ వస్తే ఆ బాబును అప్పచెపుతామని కూడా ఆ చాటింపులో చెప్పించారు. విలియం టెల్ ధైర్యసాహసాలుకల వీరుడు. అందుచేత, ఏ మాత్రం జంకకుండా సైనికుల వద్దకు వెళ్లాడు. అక్కడున్న బాబును ముద్దులాడాడు. ఆ దృశ్యం చూస్తున్న సైనికాధికారికి ఒక చిలిపి ఊహ వచ్చింది.

"టెల్" నేనొక చిన్న పరీక్ష పెడతాను. దానిలో నెగ్గితే నీ కొడుకును నీవు తీసుకు వెళ్ళవచ్చును" అన్నాడా దుర్మార్గుడు.

"ఏమిటాపరీక్ష?" అని అడిగాడు టెల్.

"నీవు విలువిద్యలో గొప్పవాడివి కదా! అందులోనే నీకు పరీక్ష!" అన్నాడు.

"విలువిద్యలో అయితే సరే! ఇంతకీ ఏమిటాపరీక్ష?" అన్నాడు టెల్.

"ఏభై అడుగుల దూరం నుంచి ఏపిల్ పండును బాణంతో కొట్టాలి" అని వికటంగా నవ్వాడా నియంత.

"ఇంతేనా! దీనికి నవ్వుతావెందుకు?"

అని చిరాకు పడ్డాడు టెల్.

"కొంచెం గమ్మత్తుంది. ఆ ఏపిల్ పండు నీ కొడుకు తల మీద పెడతాము. అప్పుడు కొట్టాలి" అని మళ్లీ నవ్వాడు.

విలియం టెల్ ఒక నిమిషం ఆలోచించి "సరే!" అన్నాడు.

బాబును ఒక చోట నించోబెట్టి అతని తల పై ఏపిల్ పండుంచారు. సరిగ్గా ఏభై అడుగులు కొలిచారు. అక్కడ నించుని బాణం వదలాలన్న మాట.

విలియం టెల్ కొడుకువంక చూశాడు. ఒక సారి మధ్య ఉన్న దూరం ఎంతో చూసుకున్నాడు. గట్టిగా ఊపిరిపీల్చి వదిలాడు. తన అంబుల పొదిలో నుంచి మంచి తిన్నని బాణాలు రెండు ఎంచుకున్నాడు.

ఒక బాణం విల్లుకు తగలించి గురి చూశాడు. వింటితాడు వెనక్కి లాగి బాణం వదిలాడు. బాణం రయ్యిన వెళ్ళి ఏపిల్ పండును రెండు ముక్కలు చేసింది. అక్కడున్న వాళ్ళంతా ఆనందంతో చప్పట్లు కొట్టారు.

టెల్ తన కొడుకు దగ్గరకు పరుగెత్తు కెళ్లాడు. ఎత్తుకుని ముద్దాడాడు. నెమ్మదిగా నడిపించి పిల్లవాణ్ణి గుర్రం వద్దకు తీసుకువచ్చాడు.

అప్పుడా దుర్మార్గ సైనిక నియంత "సరే! ఒక్క బాణంతో ఏపిల్‌ను కొట్టగలిగిన నీవు రెండు బాణాలెందుకు తీసుకున్నావు" అని అడిగాడు.

"ఒక బాణం గురితప్పి బాబుకు చిన్న దెబ్బ తగిలినా రెండో బాణం నీ గుండెల్లోకి దసుకు పోయేది" అని సమాధానం చెప్పాడు.

"పట్టుకోండి... పట్టుకోండి" అని కేకలు వినబడిన మరుక్షణం కొడుకును తీసుకుని గుర్రం ఎక్కి మాయమయ్యాడు విలియం టెల్.

(తరువాత స్విట్జరెండ్లకు స్వాతంత్ర్యం వచ్చింది).

-రఘు తేజ



# అంబేద్కర్‌ని ఆచరించిన హైదరాబాద్



**1950 మే నెల హైదరాబాద్ స్టేట్‌లో జరిగిన షెడ్యూల్డ్ కుల సంఘాల సమావేశంలో డాక్టర్ బి.ఆర్ అంబద్కేర్, పి.ఎన్.రాజ్‌బోజ్**

ఇండియాలో రెండు ఉద్యమాలు ఒకే సమయంలో జరిగాయి. ఒకటి బ్రాహ్మణుల నేతృత్వంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగింది. రెండోది బ్రాహ్మణేతరుల ఆధ్వర్యంలో బ్రాహ్మణాధిపత్యానికి, కుల వివక్షకు వ్యతిరేకంగా జరిగింది. దేశవ్యాప్తంగా ప్రధానంగా బ్రాహ్మణ సామాజిక వర్గమే ఇన్నేండ్లు చరిత్ర రచన, బోధన చేసినారు. ఇంకా చేస్తున్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిందీ, ఈ దేశ పునర్వికాసానికి పునాదులేసింది బ్రాహ్మణులే అని రాతల ద్వారా, మాటల ద్వారా ప్రచారం చేసింగ్రు. ఇంకా చేస్తున్నారు. మరోవైపు బ్రాహ్మణేతర ఉద్యమం జ్యోతిబాఫూలే నేతృత్వంలో ప్రారంభమయింది. బ్రాహ్మణాధిపత్య ధిక్కారం, కుల వివక్ష, మూఢ నమ్మకాలపై తిరుగుబాటు, విద్య ద్వారానే బహుజనులకు మేలు జరుగుతుందని పిలుపునిచ్చాడు. సాహు మహరాజ్ రిజర్వేషన్లు అమలు పరిచిండు. ఫూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్, రాసిన గులాంగిరీ ఈ దేశ మూలవాసుల్లో చైతన్యాన్ని తీసుకొచ్చింది. అయ్యంకాళి, పెరియార్, భాగ్యరెడ్డి వర్మలు ఈ చైతన్యాన్ని విస్తృత పరిచింగ్రు. ఈ విషయాలన్నింటిని ఇవ్వాళ సబాల్టర్న్ చరిత్ర రికార్డు చేస్తోంది. కింది కులాల వాండ్లు, వారి ఆరాట, పోరాటాలూ చరిత్రకెక్క దగ్గవే అని నొక్కి వక్కాణిస్తున్నారు. అంబేద్కర్ 125వ జయంతి మరొక్కసారి ఆ సందర్భాన్ని, సన్నివేశాన్ని కల్పించింది.

అంబేద్కర్‌కు స్ఫూర్తి ఫూలే! ఫూలేకు విస్తృత స్థాయిలో కొనసాగింపు అంబేద్కర్ ఉద్యమం. సకల ఆధిపత్యాలపై ధిక్కార స్వరం. అరుణ్‌శౌరీ, ఆయన లాంటి బ్రాహ్మణాధిపత్యులకు మింగుడుపడని పోరు కెరటం. ఈ పోరు పతాక రచనలన్నింటిని మొదట మహారాష్ట్ర ప్రభుత్వం అచ్చేసింది. అందుకు కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ ఆర్థిక సహకారాన్ని అందించింది. ఈ రచనల్ని తెలుగు యూనివర్సిటీ 1990వ దశకంలో తెలుగులోకి తెచ్చింది. తెలుగునాట దళితోద్యమం, అంబేద్కరిజం పాదులూనుకోవడానికి, వ్యాప్తికి ఈ పుస్తకాలు విశేషంగా తోడ్పడ్డాయి. తెలంగాణవాదానికి ఊతంగా నిలిచింది. ఈ రచనలకు తోడు ఇటీవల మూడు సంపుటాల్లో అంబేద్కర్ ప్రసంగాల్ని తెలుగు అకాడెమీ తెలుగులో అచ్చేసింది. తెలుగు యూనివర్సిటీ తాము ప్రచురించిన అంబేద్కర్ రచనలన్నింటినీ వెబ్‌సైట్‌లో అందరికీ అందుబాటులో ఉంచింది. ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకునేందుకు ఇప్పుడు వీలవుతోంది. అలాగే ఇటీవలి కాలంలో అంబేద్కర్ జీవితంపై తెలుగులో దాదాపు ఒక పాతిక (ప్రామాణికమైన) పుస్తకాలు వెలువడ్డాయి. అయితే ఈ రచనల్లో అంబేద్కర్‌కు తెలంగాణ/హైదరాబాద్‌తో ఉన్న సంబంధాల గురించి చాలా తక్కువ సమాచారం రికార్డయింది. ఇది ఉన్నా లేనిదాని కిందే లెక్క. ఇవ్వాళ అంబేద్కర్ చరిత్రను తెలంగాణ

దృక్కోణంలో దర్శించాల్సిన అవసరముంది. అంబేద్కర్ ప్రభావం హైద రాబాద్‌పై ఎలా ఉందో కూడా అంచనా వేయాలి. నిజానికి అంబేద్కర్ రాజకీయ వారసత్వాన్ని వాస్తవికంగా అంది పుచ్చుకున్నది అచ్చంగా హైదరాబాదే అని చెప్పొచ్చు. అంబేద్కర్ విద్యావ్యాప్తికి చేస్తున్న కృషికి, మిలింద్ కళాశాల స్థాపనకు ఆర్థికంగా అండగా నిలబడింది నిజాం ప్రభుత్వం. దాని విద్యాశాఖా మంత్రి 'హైదరాబాద్ అంబేద్కర్'గా పే రొందిన బి.ఎస్.వెంకట్రావు. విదేశాల్లో అర్థశాస్త్రంలో తొలి డాక్టరేట్ పట్టా అందుకుంది అంబేద్కర్. ఆయనకు తొలి గౌరవ డాక్టరేట్ అందించింది మాత్రం ఉస్మానియా యూనివర్సిటీ. 1953లో ఈ డాక్టరేట్ ప్రదానం చేసినప్పుడు ఆ యూనివర్సిటీకి ఏడో నిజాం ఉ స్మానలీఖాన్ చాన్సలర్‌గా (హైదరాబాద్ రాజ్‌ప్రముఖ్‌గా) ఉన్నాడు.

పేద, బలహీన వర్గాల వారి అభ్యున్నతి కోసం, సరైన రాజకీయ ప్రాతినిధ్యం కోసం బాబాసాహెబ్ అంబేద్కర్ లేబర్‌పార్టీని 1936లో ఏర్పాటు చేసిండు. దీని ద్వారా ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయం గా అణచివేతకు గురైన వారికి అండగా నిలిచిండు. 'కమ్యునల్ అవార్డ్' సాధించిన అంబేద్కర్ పట్ల కింది కులాల వారిలో అభిమానం పెరిగింది. ఇందుకు తగ్గట్టుగానే 1937లో జరిగిన లేబర్‌పార్టీ వార్షిక సమావేశాల్లో 'షెడ్యూల్డ్ కాస్ట్' వారిని గాంధీ 'హరిజన్' అనే పదంతో పిలువడాన్ని తీవ్రంగా ఆక్షేపించిండు. 1935 నాటి భారత చట్టంలో 'షెడ్యూల్డ్ కాస్ట్' అనే పదాన్ని దేశవ్యాప్తంగా వివిధ పేర్లతో పిలువబడు తున్న దళితులకు ఖాయం చేయడం జరిగింది. దేశవ్యాప్తంగా కామన్ పేరుతో పిలువబడుతున్న 'షెడ్యూల్డ్ కాస్ట్' కోసం రాజకీయ పార్టీ అవసరాన్ని అంబేద్కర్ గుర్తించాడు. అందుకే లేబర్‌పార్టీ స్థానంలో 'షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్' (ఎస్‌సిఎఫ్) ఉనికిలోకి వచ్చింది.

చట్టసభల్లో దళితులకు తగిన ప్రాతినిధ్యంతోనే న్యాయం జ రుగుతుందని అంబేద్కర్ నమ్మిండు. అందుకే రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్సు లో దళితులకు స్పెషల్ రిజర్వుడ్ సీట్లపై పట్టుపట్టిండు. అనేక కష్టనష్టాలు, లెక్కకు మించి ఇబ్బందుల నధిగమించి 'దళితులకు ప్రాతినిధ్యం' విషయంలో విజయం సాధించిండు. అంతేకాదు కాంగ్రెస్ పార్టీ వల్ల దళితులకు న్యాయం జరగదని తేల్చి చెప్పిండు. అందుకే దళితులు తమ స్వీయఅస్తిత్వాన్ని, రాజకీయ రంగంలో కూడా ప్రద ర్శించాలంటే దళితులకు ప్రత్యేకంగా ఒక పార్టీ ఉండాలని భావిం చిండు. ఈ భావనలకు అనుగుణంగా 'షెడ్యూల్డ్ కాస్ట్‌ఫెడరేషన్' పా ర్టీ ఏర్పడింది. ఈ సభల్లోనే అంబేద్కర్ 'చదువు–పోరాడు– సమీకరిం చు' అని నినాదమిచ్చాడు. బ్రాహ్మణిజం, క్యాపిటలిజమ్ రెండూ కూడా ఒకే సామాజిక వర్గం నియంత్రణలో వున్నవి. వారే సమజాన్ని శాసిస్తు న్నరు. దీనికి విరుగుడుగా స్వీయ అస్తిత్వాన్ని చాటి చెప్పే పార్టీ అవసరమని నిర్ణయించారు. ఈ మేరకు నాగపూర్ సభల్లో 'షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్' పార్టీని ఏర్పాటు చేశారు. దీన్ని ఏర్పాటు చేసింది అంబేద్కరే! లేబర్ పార్టీని విస్తృత పరిచే ఉద్దేశ్యంతో మొదట 1942లో అఖిల భారత షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్ సమావేశాలు మహారాష్ట్రలో మార్చి 30,31 తేదీల్లో జరిగాయి. ఈ సమావేశాల్లో చేసిన తీర్మానాల

**పేద, బలహీన వర్గాల వారి అభ్యున్నతి కోసం, సరైన రాజకీయ ప్రాతినిధ్యం కోసం బాబాసాహెబ్ అంబేద్కర్ లేబర్‌పార్టీని 1936లో ఏర్పాటు చేసిండు. దీని ద్వారా ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అణచివేతకు గురైన వారికి అండగా నిలిచిండు. 'కమ్యునల్ అవార్డ్' సాధించిన అంబేద్కర్ పట్ల కింది కులాల వారిలో అభిమానం పెరిగింది. ఇందుకు తగ్గట్టుగానే 1937లో జరిగిన లేబర్‌పార్టీ వార్షిక సమావేశాల్లో 'షెడ్యూల్డ్ కాస్ట్' వారిని గాంధీ 'హరిజన్' అనే పదంతో పిలువడాన్ని తీవ్రంగా ఆక్షేపించిండు.**

మేరకు అఖిలభారత షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్ సభలు జూలై 18–19 తేదీల్లో నాగపూర్‌లో జరిగాయి. ఈ సభలకు హైదరాబాద్ నుంచి బి.ఎస్.వెంకటరావు, పి.ఆర్.వెంకటస్వామి తదితరులు హాజరయ్యిం డ్రు. సభలకు అధ్యక్షుడిగా మద్రాసుకు చెందిన ఎన్.శివరాజ్ అధ్యక్షు డిగా ఎన్నిక కాగా, కార్యదర్శిగా పి.ఎన్.రాజ్‌భోజ్ ఎంపికయ్యారు. ఇందులో వివిధ రాజకీయాంశాలపై కూలంకషంగా చర్చించిండ్రు. స్వీయ రాజ్యాధికారంతోనే సమాజంలో మెరుగైన మార్పులకు శ్రీకారం చుట్టొచ్చని భావించిండ్రు.

1942లో నాగపూర్‌లో జరిగిన ఎస్.సి.ఎఫ్ సభలకు హైద రాబాద్ నుంచి హాజరైన బృందం అంబేద్కర్ దృష్టిలో పడింది. తర్వాతి కాలంలో సమావేశాలు జరిగినప్పుడు బి.ఎస్.వెంకటరావుకు ప్రత్యేక ఆహ్వానాలు అందినాయి. అంబేద్కర్ వైస్‌రాయ్ కౌన్సిల్‌లో లేబర్ పార్టీ సభ్యుడిగా కొనసాగుతూ దాని తరపున సెప్టెంబర్ 20, 1944 నాడు హైదరాబాద్‌లో పర్యటించిండు. అదే రోజు సాయంత్రం హైదరా బాద్ షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్ అధ్యక్షుడు జె.హెచ్.సుబ్బయ్య ఒక బహిరంగ సభను ఏర్పాటు చేసిండు. ఈ సభలో అంబేద్కర్ హిందీలో ప్రసంగించిండు. ఈ సభలో అంబేద్కర్‌ని సుబ్బయ్య, ఆయన మరదలు రాజమణీదేవి సన్మానించారు. సుబ్బయ్యకు బి.ఎస్.వెంకటరావుకు ఉన్న అంతర్గత తగాదాల వల్ల బి.ఎస్.వెంకటరావుకు అంబేద్కర్‌ని కలుసుకునే అవకాశం లేకుండా చేసిండ్రు.

షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్ హైదరాబాద్ శాఖకు జె.హెచ్. సుబ్బయ్య అధ్యక్షుడిగా ఉండేవాడు. 1951 సాధారణ ఎన్నికల్లో ఈ ఫెడరేషన్ హైదరాబాద్‌లో అద్భుతమైన ఫలితాలను సాధించింది. తెలంగాణలో సాయుధ పోరాటం జరిగి ప్రజలంతా ప్రొగ్రెసివ్ డెమో క్రటిక్ ఫ్రంట్‌కు (కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉండడంతో వారు ఆ పేరుతో పోటీ చేశారు) అండగా ఉన్నారని దేశవ్యాప్తంగా పత్రికలు ప్రచారం చేశాయి. సోషలిస్టులు కొన్ని ప్రదేశాల్లో ప్రభావశీలంగా ఉ న్నారు. ఇలాంటి స్థితిలో దేశంలో జరిగిన తొలి లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్ మొత్తం 34 సీట్లలో అభ్యర్థులను పోటీకి నిలిపింది. అయితే ఇందులో కేవలం ఇద్దరు సభ్యులు లోక్‌సభ కు ఎన్నికయిండ్రు. ఒకరు ఎస్‌సిఎఫ్ కార్యదర్శి పి.ఎన్.రాజ్‌బోజ్.

ఈయన మహారాష్ట్రలోని షోలాపూర్ నుంచి ఎన్నికయ్యారు. మరొకరు తెలంగాణలోని కరీంనగర్ నుంచి గెలుపొందిన ఎం.ఆర్.కృష్ణ. బద్దం ఎల్లారెడ్డి సాయుధ పోరాట యోధుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ నుంచి హైదరాబాద్ నుంచి వచ్చిన ఎం.ఆర్.కృష్ణ గెలవడమంటే సంచలనమనే చెప్పాలి. అలాగే 1951 ఎన్నికల్లో మొత్తం అన్ని రాష్ట్రాలు కలిపి 215 సీట్లకు ఫెడరేషన్ పోటీ చేసింది. ఇందులో 12 మంది మాత్రమే విజేతలు కాగలిగిండ్రు. అందులో అత్యధికంగా హైదరాబాద్ శాసనసభకు ఐదుగురు ఎన్నికయిండ్రు. మద్రాసు నుంచి ఇద్దరు, మైసూరు నుంచి ఇద్దరు, పంజబాబ్ నుంచి ఒక్కరు, హిమాచల్ ప్రదేశ్ నుంచి ఒక్కరు గెలుపొందారు. బొంబాయి నుంచి అంబేద్కర్ విజేతగా నిలిచిండు.

హైదరాబాద్ రాష్ట్రం నుంచి విజేతలుగా నిలిచిన వారిలో ఇద్దరు మహారాష్ట్రీయులు (మరత్వాడా) కాగా ముగ్గురు తెలంగాణ నుంచి గెలుపొందారు. మహారాష్ట్రలోని హింగోలి నుంచి మాధవరావు, బాస్మత్ నుంచి శ్యామ్‌రావులు గెలుపొందగా, తెలంగాణ లోని సిరిసిల్ల నుంచి జె.ఎం. రాజమణీదేవి, జగిత్యాల నుంచి బుట్టి రాజారాం, మహబూబాబాద్ నుంచి బి.ఎం.రాంచందర్‌లు గెలుపొందారు. ఈ గెలుపొందిన ముగ్గురూ హైదరబాద్ షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్ అధ్యక్షుడు జె. హెచ్.సుబ్బయ్య బంధువులు కావడం విశేషం. ఆనాడు షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్ సభ్యులుగా పోటీ చేసి ఓడిపోయిన వారిలో జె. ఈశ్వరీబాయి, కంటె ప్రేమ్‌కుమార్, జె.హెచ్.కృష్ణమూర్తి, కృష్ణకుమార్ మానె, లింగప్ప, జి.విఠల్ రావ్ కాంబ్లె, రాంచరణ్ వర్మ (లాతూర్), చింతమల్ల పురుషోత్తం (ఖమ్మం), సుర్వి గురువయ్య (నల్లగొండ), ఎడ్ల గోపయ్య (సూర్యాపేట) తదితరులున్నారు.

హైదరాబాద్ రాష్ట్రంలో మొత్తం 25 పార్లమెంటు సీట్లలో నాలుగు సీట్లు ఎస్సీలకు రిజర్వయ్యాయి. ఈ నాలుగింటిలో ఇద్దరు కాంగ్రెస్ పార్టీ నుంచి, ఒకరు కమ్యూనిస్టు పార్టీ నుంచి మరొకరు ఎస్‌సిఎఫ్‌నుంచి ఎన్నికయిండ్రు. కాంగ్రెస్ నుంచి మహబూబ్‌నగర్ నుంచి పులి రామస్వామి, నాందేడ్ నుంచి నామ్‌దేవ్ రావు, నల్లగొండ నుంచి సుంకం అచ్చాలు (పిడిఎఫ్), కరీంనగర్ నుంచి ఎం.ఆర్.కృష్ణ (ఎస్‌సిఎఫ్)లు విజేతలుగా నిలిచిండ్రు. తర్వాతి కాలంలో ఎం.ఆర్. కృష్ణ కాంగ్రెస్ పార్టీలో చేరి కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా కూడా పనిచేసిండు. ఎం.ఆర్.కృష్ణ 27 ఏండ్లకే ఎంపీగా ఎన్నికయిండు. కరీంనగర్ నుంచి 1952, 1957లో పార్లమెంటుకు ఎన్నికయిన ఈయన మూడో, నాలుగో లోక్‌సభకు పెద్దపల్లి నుంచి ఎన్నికయిండు. ఆ తర్వాత 1972 నుంచి 1982 వరకు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నాడు. అంటే దాదాపు మూడు దశాబ్దాలు నిరంతరాయంగా ఈయన పార్లమెంటేరియన్‌గా పనిచేసిండు. బహుశా ఇంత సుదీర్ఘ కాలం నిరంతరాయంగా సభ్యుడిగా పనిచేసిన వాళ్ళు ఎవరూ లేరేమో!

సికింద్రాబాద్‌లో జన్మించిన ఎం.ఆర్.కృష్ణ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నడు. 1967-70 మధ్య కాలంలో డిప్యూటి డిఫెన్స్ మినిస్టర్‌గా, 1970-71 మధ్య కాలంలో పారిశ్రామిక శాఖ డిప్యూటి

**హైదరాబాద్ రాష్ట్రం నుంచి విజేతలుగా నిలిచిన వారిలో ఇద్దరు మహారాష్ట్రీయులు (మరత్వాడా) కాగా ముగ్గురు తెలంగాణ నుంచి గెలుపొందారు. మహారాష్ట్రలోని హింగోలి నుంచి మాధవరావు, బాస్మత్ నుంచి శ్యామ్‌రావులు గెలుపొందగా, తెలంగాణ లోని సిరిసిల్ల నుంచి జె.ఎం. రాజమణీదేవి, జగిత్యాల నుంచి బుట్టి రాజారాం, మహబూబాబాద్ నుంచి బి.ఎం.రాంచందర్‌లు గెలుపొందారు. ఈ గెలుపొందిన ముగ్గురూ హైదరబాద్ షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్ అధ్యక్షుడు జె.హెచ్.సుబ్బయ్య బంధువులు కావడం విశేషం.**

మంత్రిగా పనిచేసిండు. అంతకుముందు పార్లమెంటు ఎస్టిమేట్స్, పబ్లిక్ అక్కౌంట్స్ కమిటీ సభ్యుడిగా పనిచేసిండు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ చైర్మన్‌గా కూడా పనిచేసిన ఈయన జాతీయ దళితోద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. ఆలిండియా షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్, ఆలిండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ కార్యదర్శిగా పనిచేసిండు. ఆల్వాల్, సికింద్రాబాద్‌ల్లో జై జవహర్ కాలనీ, గాంధీ స్మారక ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేసిండు. జీవిత కాలం దళితజనోద్ధరణకు వెచ్చించిన 80వ యేట హైదరాబాద్‌లో 2004 మే 12న మరణించిండు.

హైదరాబాద్ షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్ అధ్యక్షుడు జె.హెచ్. సుబ్బయ్య సోదరుడు జె.హెచ్.కృష్ణమూర్తి భార్య రాజమణిదేవి తొలి అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల నుంచి ఎన్నికయింది. ఈమె సోద రుడు కంటె ప్రేమ్‌కుమార్, భర్త కృష్ణమూర్తి కూడా ఈ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. ఈమె ఫెడరేషన్ మహిళా విభాగానికి అధ్యక్షురాలిగా పనిచేశారు. మహబూబాబాద్ నుంచి గెలుపొందిన రాంచందర్ కూడా సుబ్బయ్యకు బంధువే! కరీంనగర్ జిల్లా ఎస్‌సిఎఫ్ కార్యదర్శిగా పనిచేసిన బుట్టి రాజారాం జగిత్యాల నుంచి గెలుపొందారు.

దళిత చైతన్యం అంతగా లేని కాలంలోనే ఐదుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఆ సామాజిక వర్గం ఏర్పాటు చేసుకున్న పార్టీ ద్వారా ఎన్నికయిండ్రు. ఇది నేటి తరానికి స్ఫూర్తిగా నిలవాలి. అంబేద్కర్ కలలు కన్న సొంతపార్టీ, సొంత ప్రాతినిధ్యం ఈ ఎస్‌సిఎఫ్ నెరవేర్చింది. నేటి రాజకీయాల్లో దీన్ని పునరుజ్జీవింప జేయడం పెద్ద కష్టం కాదు.

– సంగిశెట్టి శ్రీనివాస్,
మొబైల్: 98492 20321
మెయిల్: sangishettysrinivas@gmail.com

దె



## ప్రొఫెసర్ గడ్డం కృష్ణారెడ్డి కన్నుమూత

తెలంగాణ ఉద్యమకారుడు, సామాజికవేత్త, ఐపీఎస్ఎస్ఆర్ హానరరీ డైరెక్టర్ ప్రొఫెసర్ గడ్డం కృష్ణారెడ్డి జూన్ 11న గుండెపోటుతో మృతిచెందారు. ఉదయం కుటుంబసభ్యులు నిద్రలేపినపుడు ఆయన అపస్మారక స్థితిలో ఉండటంతో వెంటనే హాస్పిటల్‌కు తరలించారు. అయితే అప్పటికే కృష్ణారెడ్డి మృతిచెందినట్టు డాక్టర్లు ధ్రువీకరించారు. ఓయూ మాజీ వీసీ ప్రొఫెసర్ గడ్డం రాంరెడ్డి సోదరుడైన సత్యనారాయణరెడ్డి కుమారుడు కృష్ణారెడ్డి. కరీంనగర్ జిల్లా మైలారం గ్రామానికి చెందిన కృష్ణారెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 1991లో ఓయూలో అధ్యాపకుడిగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. 2010–12 హెచ్‌సీయూలో యూజీసీ ఏర్పరిచిన సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ ఫౌండర్ డైరెక్టర్‌గా పనిచేశారు. 2013లో సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ కోఆర్డినేటర్‌గా పనిచేశారు. 2014 నుంచి యూజీసీ ఐసీఎస్ఎస్ఆర్ సదరన్ రీజియన్ హానరరీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక నిర్మాణం నుంచి చురుకుగా పనిచేశారు. 10 అంతర్జాతీయ సామాజిక శాస్త్రాల పరిశోధన సంస్థలలో శాశ్వత సభ్యులుగా, 4 యూనివర్సిటీలలో విజిటింగ్ స్కాలర్‌గా ఉన్నారు. పలు అంశాలపై ఆయన పుస్తకాలు, వ్యాసాలు రాశారు. దళిత, సామాజిక ఉద్యమాల్లో ప్రముఖపాత్ర పోషించారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేశారు.

**ప్రముఖుల సంతాపం:**

కృష్ణారెడ్డి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ పాపిరెడ్డి, వైస్ ఛైర్మన్ మల్లేష్, తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆర్ లింబాద్రి, ఓయూ మాజీ వీసీ తిరుపతి రావు, జూలూరి గౌరీశంకర్ తదితరులు ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. ప్రొఫెసర్ మృతిపై పలువురు అధ్యాపకులు సంతాపం వ్యక్తం చేశారు.

## తొలితరం జర్నలిస్టు
## ఇందర్ మల్హోత్రా కన్నుమూత

స్వతంత్ర భారతదేశంలో తొలితరం జర్నలిస్టు, ప్రముఖ రచయిత, కాలమిస్టు ఇందర్ మల్హోత్రా (86) కన్నుమూశారు. అనారోగ్యంతో ఢిల్లీలోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్యం విషమించి జూన్ 11న తుదిశ్వాస విడిచారు. 'ది స్టేట్స్‌మన్', 'టైమ్స్ ఆఫ్ ఇండియా', 'ది గార్డియన్' పత్రికలలో ఉన్నత స్థాయిలో మల్హోత్రా పనిచేశారు. ఆయన చేసిన రచనలు ప్రసిద్ధిగాంచాయి. ఆయన సతీమణి రేఖా మల్హోత్రా 2007లో చనిపోయారు. వీరి కుమారుడు అనిల్ రేవరి ప్రముఖ చిత్రకారుడు. 1930లో జన్మించిన మల్హోత్రా స్వాతంత్ర్యానికి పూర్వమే పాత్రికేయ వృత్తిలోకి ప్రవేశించారు. 1991లో ఇందిరాగాంధీ జీవిత చరిత్రపై ఆయన రాసిన 'ఇందిరాగాంధీ – ఎ పర్సనల్ అండ్ పొలిటికల్ బయోగ్రఫీ' పుస్తకం విశేష ఆదరణ పొందించారు. ప్రస్తుత దేశ భద్రత, పొరుగు దేశాలతో భారత్ సంబంధాలతో ఆయన పుస్తకం రాస్తున్నారు. ఇంతలోనే ఆయన కన్నుమూశారు.

## ప్రముఖ జర్నలిస్టు కేకే కత్యాల్ మృతి

ప్రముఖ జర్నలిస్టు, ఢిల్లీలో 'ది హిందు' రెసిడెంట్ ఎడిటర్ కేకే కత్యాల్ (89) మృతిచెందాడు. ది హిందూ పత్రిక ఢిల్లీ బ్యూరోలో పనిచేసిన కత్యాల్.. 1986లో పత్రిక డిల్లీ ఎడిషన్ ప్రారంభించిన తర్వాత రెసిడెంట్ ఎడిటర్ అయ్యారు. ది హిందూలో చేరడానికి ముందు ఆయన స్టేట్స్‌మెన్, హిందూస్థాన్ టైమ్స్‌లో పనిచేశారు. కొద్ది కాలంపాటు ఆయన అమెరికా సమాచార సేవల విభాగంలోనూ సేవలందించారు. విస్తృత పర్యటనలు సాగించిన కత్యాల్‌కు దౌత్య, రాజకీయ రంగాల వారితో విస్తృత సంబంధాలు ఉండేవి. ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్న ఝంగ్‌లో జన్మించిన కత్యాల్ 2004లో ఉద్యోగ విరమణ తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాల పురోగతికి కృషి చేశారు. కత్యాల్ రాసిన విశ్లేషణాత్మక వ్యాసాలకు 1994లో నాటి ప్రధాని పీవీ నర్సింహారావు చేతుల మీదుగా జీకే రెడ్డి స్మారక బహుమతి అందుకున్నారు.

## అనారోగ్యంతో ప్లెడ్జ్ పత్రిక ఎడిటర్
## ఎంఏ ఖదీర్ మృతి

ప్లెడ్జ్ దినపత్రిక సంపాదకుడు ఎంఏ ఖదీర్ (60) మృతి చెందారు. నగరంలోని సిటీ ఆస్పత్రిలో కిడ్నీ సంబంధిత వ్యాధికి చికిత్స కోసం చేరిన ఆయన తుదిశ్వాస విడిచారు. ఐదు దశాబ్దాల క్రితం తన తండ్రి ఎంఏ సుభాన్ పత్రికను తీసుకువచ్చారు. 1960లో జరిగిన తెలంగాణ ఉద్యమానికి అండగా నిలిచారు. ఖదీర్ ఎడిటర్‌గా మలి దశ ఉద్యమాన్ని బలపరిచాడు. ఖదీర్‌కు భార్య, ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. ద

### పాఠకులకు గమనిక

గత మూడేళ్ళుగా దక్కన్‌ల్యాండ్ మాస పత్రికను ఎన్నో కష్టనష్టాల కోర్చి తీసుకు వస్తున్న సంగతి తెలిసిందే. తెలంగాణ ఉద్యమ కాలంలో సామాజిక, సాహిత్య పత్రికగా ముందు నిలిచిన దక్కన్ ల్యాండ్ తెలంగాణ పునర్‌నిర్మాణంలోనూ తన వంతు కీలకపాత్రను పోషించనుంది. ఈ క్రమంలో పాఠకుల నుంచి సహకారాన్ని కోరుతున్నాం.

- పత్రికకు పాఠకులే ప్రాణం. పాఠకులంతా తమ చందాలను పునరుద్ధరించుకోవడంతో పాటుగా కొత్త చందాదారులను చేర్పించాల్సిందిగా కోరుతున్నాం.
- పత్రిక వెల ఈ మాసం నుంచి రూ. 20కి పెంచాం. ఈ విషయాన్ని గుర్తించాల్సిందిగా కోరుతున్నాం.

– ఎడిటర్

# సినిమా @ తెలంగాణ

## కెమెరా విజర్డ్ ఎం.ఎ.రెహమాన్ : మన సినిమాటోగ్రాఫర్



**1948** చెన్నై వీనస్‌స్టూడియోలో మీర్జాపురం రాజాగారి దర్శకత్వంలో 'కీలుగుర్రం' చిత్రం షూటింగ్ జరుగుతోంది. సినిమాలో హీరో ఎ.నాగేశ్వరరావు 'కీలుగుర్రం' ఎక్కి ఆకాశంలో విహరించే దృశ్యాన్ని చిత్రీకరిస్తున్నారు. కెమెరామెన్ ఆ దృశ్యాన్ని ఎట్లా కెమెరాలో బంధిస్తారో చూడాలని ఆసక్తిగా చాలా మంది సినీ ప్రముఖులు అక్కడికి వచ్చారు. అట్లా అక్కడికి వచ్చిన వారిలో కెమెరామెన్ అన్నయ్య, దర్శక నిర్మాత ఎల్.వి.ప్రసాద్, మీర్జాపురం రాజా, ప్రసిద్ధ ఛాయాదర్శక నిర్మాత రామ్‌నాథ్ మొదలైన వారంతా ఆ మాయా ఛాయా గ్రహణానికి అమర్చిన కెమెరా "వ్యూ – ఫైండర్" ద్వారా చూసిన వారంతా అతని సాంకేతిక నిపుణతకు ఆశ్చర్యపోకుండా ఉండలేక పోయారు. అంతగొప్ప టెక్నీషియన్ అలనాటి మన అవిభక్త నిజాం స్టేట్‌లోకి చెందిన వారని దాదాపుగా ఎవరికీ తెలియదనడంలో అతిశయోక్తి లేదు. అతనే ఎం.ఎ.రెహమాన్‌గా ప్రసిద్ధుడైన మహమ్మద్ అబ్దుల్ రెహెమాన్.

1910 మార్చి 14న ఔరంగాబాద్‌లో పుట్టారు మన మహమ్మద్ అబ్దుల్ రెహమాన్. చిన్నతనంలోనే తల్లిదండ్రులు మరణించడం వల్ల, ఎవరూ చేరదీయక పోవడం వల్లనూ చదువు సంధ్యల విషయం అటుంచితే బతుకుదెరువే కష్టమైంది. పని వెదుక్కుంటూ బొంబాయి రైలెక్కేశాడు. అప్పట్లో అది మూకీ యుగం. అక్కడి వాడియా మూవీటోన్ ఫిలిం స్టూడియోలో లైట్‌బాయ్‌గా రోజుకు రూపాయి కూలికి చేరడంతో రెహమాన్ సినిమా కెరీర్ మొదలైంది. స్టూడియోలో చురుకుగా మసలుకుంటూ అతి తక్కువ కాలంలోనే అలనాటి స్టంట్ రాణినాడియా మెప్పొంది స్టూడియోలోని అన్ని శాఖల్లోనూ శిక్షణ పొందారు. అయితే సినిమాటోగ్రఫి మీద ఆసక్తి పెంచుకుని పూర్తి స్థాయిలో కెమెరా డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్‌గా చేరిపోయాడు రెహమాన్.

సినిమాల్లో స్వతంత్ర కెమెరామెన్‌గా మూకీల కాలంలోనే పని చేయడం ప్రారంభించిన రెహమాన్ తన పందొమ్మిదవ ఏటనే 1929లో 'మిలన్ దినార్' అనే మూకీకి మొదటిసారిగా సినిమాటోగ్రఫి నిర్వహించారు. మూకీల కాలంలోనే హీరోయిన్‌గా దర్శక నిర్మాతగా ఒక వెలుగు వెలిగిన ఫాతిమా బేగం స్వంత బ్యానర్ విక్టోరియా ఫాతిమా ఫిలిం కంపెనీ తీసిన మూకీ ఇది. ఇందులో తొలి భారతీయ టాకీ నాయిక 'జుబేదాబేగం' హీరోయిన్‌గా నటించింది. ఇదే సంవత్సరం ఇదే సంస్థ నిర్మించిన 'శకుంతల' మూకీకి కూడా రెహమాన్ కెమెరామెన్‌గా పని చేశారు. ఆ తరువాత మరికొన్ని మూకీలకు పని చేసిన ఆయన టాకీలు రావడం మొదలైనాక బెంగుళూరు వచ్చేశారు. అది జరిగింది 1933లో. అక్కడ సూర్యా ఫిలిం కంపెనీలో కెమెరా విభాగానికి హెడ్‌గా చేరారు. అప్పుడు ప్రసిద్ధ కన్నడ దర్శకుడు సుందర్‌లాల్ నాదకర్ణితో ఏర్పడిన పరిచయం రెహమాన్‌కి మరికొన్ని కన్నడ సినిమాలకు కెమెరామెన్‌గా పని చేసే అవకాశం వచ్చిందాయనకు.




బెంగుళూరులో మూడేళ్లు గడిచాక మనవాడు మళ్లీ చలో బొంబాయి అన్నాడు. మళ్లీ వాడియా కంపెనీలో చేరి నాలుగేళ్లు హిందీ సినిమాలకు పని చేశారు. అందులో ఒకటి 'హింద్ కేసరి' (1935) నాడియా హీరోయిన్‌గా నటించిన చిత్రం. ఇంతలో 1940లో మద్రాసులోని వేల్ పిక్చర్స్ స్టూడియోలో కెమెరా డిపార్ట్‌మెంట్ తీర్చిదిద్దమని బిల్లిమోరియా మన రెహమాన్‌కు మద్రాసు పంపారు. ఆ తరువాత మనోడు మళ్లీ బొంబాయి వైపు తిరిగి చూడనే లేదు. మద్రాసుని

తన పూర్తి స్థాయి కార్యక్షేత్రంగా నిర్ణయించుకున్నారు.

ఎం.ఎ.రహెమాన్ స్వతంత్రంగా కెమెరామెన్‌గా పని చేసిన తొలి చిత్రం ‘భక్తిమాల’ (1941). అయితే రెహమాన్‌లోని పని తనాన్ని గుర్తించి ప్రోత్సహించినది మహానటుడు చిత్తూరు నాగయ్య. ఆయన రేణుకా బ్యానర్‌పై తొలిసారిగా నిర్మించిన ‘భాగ్యలక్ష్మి’ చిత్రానికి రెహమాన్‌ని కెమెరామెన్‌గా తీసుకున్నారు. ఆ వెంటనే ఎంతో ప్రతిష్ఠాత్మకంగా స్వీయ నిర్మాణ దర్శకత్వంలో నాగయ్య తీసిన “త్యాగయ్య”లో అద్భుతమైన ఛాయా గ్రహణాన్ని చిత్రీకరించారు. ఈ చిత్రంలో పోగొట్టుకుపోయిన సీతారామ లక్ష్మణుల విగ్రహాలు కావేరి నదిని దాటుతుండగా కనబడతాయి. అప్పుడు త్యాగయ్య (నాగయ్య) “కనుగొంటిని” అనే కీర్తన పాడుతూ ఆనంద భరితుడవుతాడు. ఆ సన్నివేశంలో విగ్రహాలు నీటిలోంచి బయటికి రావడం ప్రేక్షకులను ఆనంద వివశులను చేస్తుంది. ఈ అండర్ వాటర్ షాట్స్ మన రెహమాన్ ప్రతిభకు ఓ మచ్చుతునక. భక్తిరస ప్రధానమైన ఈ సినిమాకు ముస్లిం అయిన రెహమాన్ నెరిపిన ఛాయాగ్రహణం ఆ రోజుల్లో గొప్పగా చెప్పుకున్న సందర్భం. ఈ చిత్రం దక్షిణా భారతమంతా రజతోత్సవాలు జరుపుకున్నది. ఆ తరువాత నాగయ్యగారే తీసిన అవరిండియా మా వారి ‘నా ఇల్లు’ (1953), తమిళంలో ‘ఎన్‌వీడు’ (1953) చిత్రాలకు రెహమానే ఛాయాగ్రాహకులు.

ఇంతకుముందు 1945లో గూడవల్లి గూడవల్లి రామబ్రహ్మం తీసిన ‘మాయాలోకం’లో చేసిన కెమెరా పనితనం రెహమాన్ సాంకేతిక నైపుణ్యం ప్రపంచానికి అద్భుతంగా చాటి చెప్పింది. ఈ చిత్రంలో చిన్న రాణిని చంపడానికి పెద్దరాణి చేసిన కుట్ర ప్రయత్నం “సిర్ హావుట్ ఎఫెక్ట్స్”తో చిత్రీకరించారాయన. ఇదంతా షాడో ప్లేతో చూపబడింది. ఇదిలా వుండగా 1950లో రెండు చిత్రాలు ఒకే కథతో తయారై తెలుగు సినీ పరిశ్రమలో చర్చకు తెరతీసినవి. బలరామయ్య తీసిన ప్రతిభావారి ‘శ్రీలక్ష్మమ్మ కథ’. గోపీచంద్ తీసిన శోభనాచల ‘లక్ష్మమ్మ’ ఆ రెండు చిత్రాలు. ఈ రెంటిలో లక్ష్మమ్మ సినిమా గొప్ప విజయం సాధించింది. ఛాయాగ్రహణమే ఈ చిత్ర విజయానికి కారణమని అప్పట్లో విమర్శకులు ప్రశంసించారు.



లక్ష్మమ్మ నిర్మాతలే 1949లో ఎం.ఆర్.ఎ. బానర్‌పై ‘మన దేశం’ సినిమా తీశారు. ఈ సినిమాలోనే ఇన్‌స్పెక్టర్ వేషం వేసి సినిమాలకు పరిచయమైన ఎన్టీఆర్‌తో ఆ రోజు మొదలైన స్నేహం రెహమాన్ జీవితంలో అచిరకాలం సాగింది. ఎన్టీఆర్, రెహమాన్, డి.యోగానంద్, బీఏ సుబ్బారావు, టీవీ రాజు అంతా ఒక టీమ్‌గా ఏర్పడి ఆ తర్వాత గొప్ప గొప్ప సినిమాలు తీశారు.

ఆ తరువాత ‘సంసారం’ (1950), ‘పేరంటాలు’ (1951), ‘దాసి’ (1952) చిత్రాలకు రెహమాన్ కెమెరామెన్‌గా పని చేశారు. హీరోగా నిలదొక్కుకున్న ఎన్టీ రామారావు ఎన్.ఏ.టి. సంస్థ స్థాపించి తీసిన చిత్రాల్లో చాలా వాటికి ఛాయాగ్రహణం నేర్పింది రెహమానే. ‘పిచ్చిపుల్లయ్య’ (1953)తో మొదలుకుని ‘తోడుదొంగలు’ (1954), ‘జయసింహ’ (1955), ‘పాండురంగ మహాత్మ్యం’ (1957), ‘సీతా రామ కళ్యాణం’ (1961), ‘రాం రహీం’ (1974), ‘శ్రీరామ పట్టాభిషేకం’ (1978), ‘శ్రీమద్విరాట పర్వం’ (1979) వంటి సినిమాలు వాటిలో కొన్ని. అయితే ఆయన పని చేసిన తొలి కలర్ సినిమా వరక్కుంపావై’ (తమిళం).

ఈ నేపథ్యంలో రెహమాన్ ‘హరిశ్చంద్ర’ (1956), ‘సువర్ణ సుందరి’ (1957), ‘రాజనందిని’ (1958 ప్రసాద్, సూర్యనారాయణలతో కలిసి) ‘రేచుక్క – పగటి చుక్క’ (1959), ‘భీష్మ’ (1952), ‘నర్తనశాల’, ‘మంచి – చెడు’ (1963), ‘భేతాళ మాంత్రికుడు’ (1963), ‘మధురై వీరన్’, ‘భక్త కుంభార’ (1974), ‘మధుర సంగమ’ (1978) వంటి కన్నడ చిత్రాలకు కెమెరామెన్‌గా పని చేశారు. అంతేగాకుండా తెలుగులో అనువాద చిత్రాలైన దేశింగురాజు కథ, ఎగిరేపిల్ల, కన్నెపిల్ల చిత్రాలకు మూలమైన తమిళ చిత్రాలకు పని చేశారు. రాజా దేవ్‌సింగ్, మధురైవీరన్, వాళ్వపిరందవళ్, రాజు సేవై పెరియ ఇందత్తు పెణ్ (1963) తమిళ చిత్రాలు ఆయన చిత్రీకరణ చేసినవే.

రెహమాన్ 1940ల నుండి స్వతంత్ర కెమెరామెన్‌గా తన కెరీర్‌ను ప్రారంభించి నలభైయేండ్ల పాటు ఛాయాగ్రాహకుడిగా కొనసాగితే పని చేసిన చిత్రాలు నూటికి మించవు. ఆ రోజుల్లో ఆ

## మనది హాలీవుడ్ స్థాయి

“ఒక ముఖం వెండి తెరకు పనికి వస్తుంది. మరొక ముఖం పనికి రాదు – అని లేదు. ప్రతిముఖం కూడా కెమెరాకు పనికి వస్తుంది. ఒక్కొక్క ముఖానికి తగ్గట్టు లైటింగ్ ఏర్పరచుకోవడంలో ఉంది. నటీ నటులకే గాక ‘నటన’కు కూడా కెమెరా ఎంతో సహాయం చేస్తుంది. సన్నివేశానికి తగ్గట్టు లైటింగ్ ఎఫెక్ట్స్ ఏర్పాటు చేయడం వల్ల కూడా నటన మరింత రక్తి కడుతుంది. పోతే మన చిత్రాలలో ఛాయాగ్రహణ స్థాయి హాలీవుడ్ చిత్రాల దరిదాపుల్లోకి వస్తోంది. ఛాయాగ్రాహకుల్లో ఒకరు గొప్ప, మరొకరు తక్కువ అనేది ఉండదు. ప్రతి వారిలోనూ ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. (సినిమా రంగం అక్టోబర్ 1963)

-ఎం.ఎ. రహెమాన్




యన సౌత్‌లో అత్యధిక రెమ్యునరేషన్ తీసుకునే కెమెరామెన్‌గా పేరొందారు. ముఖ్యంతా తాంత్రిక ఛాయాగ్రహణం నెరపడంతో ఆయన తరువాతే ఎవరైనా చాలా చిత్రాలకు పేరు లేకుండా పని చేశారు. నాకు తెలిసి రెహమాన్ వద్ద కెమెరాలో శిష్యరికం చేసిన వారు దాదాపుగా లేరనే చెప్పవచ్చు. అయితే ఎన్టీఆర్‌ని దర్శకుడుగా తీర్చిదిద్దినది మాత్రం రెహమాన్ గారే. కెమెరాకు దృశ్యానికి సంబంధించిన చాలా విషయాలు ఆయన రెహమాన్ వద్దనే నేర్చుకున్నారు. హైదరాబాద్‌లో ఆయన రామకృష్ణ స్టూడియోస్ స్థాపించిన తరువాత కెమెరా డిపార్ట్‌మెంట్‌లో చాలా కాలం పని చేశారు రెహమాన్. ఆయన రెండు తమిళ సినిమాలకు దర్శకత్వం కూడా వహించారు.

'లో–కీ'లో కెమెరా పనితనం చూపించడం చాలా కష్టమైన పని. కాని రెహమాన్ విషయంలో అది కొట్టిన పిండి. తాను ఒక సినిమాకు పని చేయాలంటే పూర్తిగా కథను తెలుసుకుంటాడు. సెట్స్ మీదికి వెళ్లడానికి ముందు దర్శకునితో పూర్తిస్థాయి చర్చలు జరిపి సమగ్ర అవగాహనతో సంసిద్ధుడు కావడం ఆయన ప్రత్యేకత.

## సికిందరాబాద్ లలిత

ఇంతకు ఎం.ఎ.రహెమాన్‌ను పెళ్లి చేసుకున్నది ఎవరో కాదు మన సికిందరాబాదులో పుట్టిన లలిత. సినిమాల్లో ఆమె పేరు ఎందుకోగాని "బళ్లారి లలిత"గా స్థిరపడింది. లలిత నటి, నర్తక, గాయని కూడా బొంబాయిలో హిందీ సినిమాల్లో నటించేటప్పుడు 1935లో రెహమాన్‌తో ఏర్పడిన పరిచయం పెళ్లికి దారి తీసింది. లలితనే పట్టుపట్టి రహెమాన్‌ని బొంబాయి నుండి మద్రాసు తీసుకువచ్చింది. ఆయన అభ్యున్నతికి మన లలితనే ప్రధాన కారణం. ఈ లలిత కూడా హీరోయిన్‌గా నటించింది. తొలుత జయప్రద (1931) చిత్రంలో ఆమె హీరోయిన్ తరువాత 'చంద్రహాస' (1941), 'బాలనాగమ్మ', 'సుమతి' తదితర చిత్రాల్లో ప్రధాన పాత్రలు పోషించింది 1995లో ఆమె కన్ను మూసింది.

ఎం.ఎ.రెహమాన్ ముస్లింగా పుట్టినా హిందువును పెళ్లాడారు. పౌరాణికాలకు పని చేసేటప్పుడు ఆయా గాథలను అధ్యయనం చేసేవారు. ఆ అవగాహనతోనే అత్యంత సహజంగా చిత్రీకరణ చేసేవారు. ఆయనకు హిందూ సాధువులంటే చాలా నమ్మకం ఉండేది. రోజూ ఎవరో ఒక ఆధ్యాత్మిక వేత్త ఆయనింటికి వచ్చేవారు. రోజూ పొద్దునే పూజా, పునస్కారాలు చేసి నుదుట బొట్టు పెట్టుకునేవారు. అందుకే ఆయన సన్నిహితులు కుంకుంబొట్టు సాహెబ్ అనేవారు.

సుమారు ఆరు దశాబ్దాల పాటు దక్షిణభారత సినిమా రంగంలో కెమెరామెన్ గొప్ప పేరుపొందిన రెహమాన్ 1983లో 'రఘుపతి వెంకయ్య' అవార్డుతో ఎన్టీఆర్ గౌరవించారు. సౌతిండియన్ సినీ టెక్నిషియన్ అసోసియేషన్ వారి ప్రతిష్టాత్మక 'రామ్‌నాథ్' అవార్డులు అందుకున్నారాయన. 70 ఏళ్ల భారతీయ సినిమా ఉత్సవాలు మద్రాసులో జరిగినపుడు ఘనంగా సత్కరించారాయనను. 1998 ప్రాంతంలో రహెమాన్ కన్నుమూసి కెమెరాను విడిచారు. దక్షిణ భారత సినిమా రంగంలో శ్రీధర్, కమల్‌ఘోష్, మార్కస్‌బార్‌ట్లే, రవికాంత్ నగాయిచ్‌ల కన్నా ముందు తరం వాడిగా రెహమాన్ పొందిన "కెమెరా విజర్డ్" స్థానం చెరిగిపోనిది.

– హెచ్.రమేష్‌బాబు,
మొబైల్: 94409 25814
మెయిల్ : hrameshbabu5@gmail.com

DECCAN tv
Voice of Telangana
Watch On Hathway Network, Channel No.70

## బీఎస్ రాములుకు సాహితీ పురస్కారం

తెలంగాణ సాహితి, సాంస్కృతిక విభాగంలో తెలంగాణ సాహితీ పురస్కారాన్ని తొలిసారిగా బీఎస్ రాములు జూన్ 8న స్వీకరించారు. ఈ అవార్డుతో పాటు రూ.25వేలు అందుకున్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు డా.సి.నారాయణరెడ్డి చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు.

## పీడిత ప్రజల పక్షాన నిలిచిన దాశరథి!

దాశరథి రంగాచార్య పీడిత ప్రజల పక్షాన నిలిచారనీ, అభ్యుదయాన్ని కాంక్షిస్తూ పౌరహక్కుల కోసం ఆనాడే ఆయన తన రచనల ద్వారా ఉద్యమించారని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జయధీర్ తిరుమలరావు అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జరిగిన దాశరథి రంగాచార్య ప్రథమ వర్ధంతి సభ ప్రొఫెసర్ జయధీర్ మాట్లాడుతూ, దాశరథి నిష్కల్మష హృదయుడని చెప్పారు. రచనా శైలి వలె దాశరథి వ్యక్తిత్వం కూడా విశిష్టమైనదని ఆయనకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి సమన్వయం చేశారు. వేదిక పక్షాన భూపతి వెంకటేశ్వర రావు, తంగిరాల చక్రవర్తి, మోతుకూరి నరహరి, రంగాచార్య సతీమణి కమలమ్మ, కుటుంబసభ్యులు సుధ, డాక్టర్ సురోత్తమాచార్యులు, ఉదయశ్రీ, కేవీ మోహనాచార్యులు పాల్గొన్నారు. కందిమళ్ళ ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ జయప్రకాశ్, శంకరంమంచి శ్యాంప్రసాద్, దైవజ్ఞశర్మ, యశపాల్, రాజలింగం తదితరులు దాశరథికి ఘననివాళులు అర్పించారు.

## 'మీడియా భాష'పై వ్యాసాలకు ఆహ్వానం

తెలుగు పత్రికలు, ప్రసార మాధ్యమాల భాషా స్వరూపంపై తెలంగాణ సారస్వత పరిషత్తు ఆగస్టు మొదటివారంలో నిర్వహించనున్న సదస్సుకు పరిశోధనా వ్యాసాలు పంపాలని పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య కోరారు. మీడియాలో పనిచేస్తున్న ఈతరం వారికి భాషాపరమైన అవగాహనను మరింత పెంచే ఉద్దేశంతో పరిషత్తు సదస్సులు నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. వ్యాసాలను జులై 15లోగా పంపాలని, 9440049323, 040–24753724లో సంప్రదించాలని కోరారు.

## అమరుల త్యాగం మరువలేనిది

అమరవీరుల బలిదానాలు తెలంగాణ ఉద్యమానికి ఊతమిచ్చాయని, తెలంగాణ సాధన ఉద్యమంలో ఆత్మార్పణ చేసుకుని అసువులు బాసిన అమరవీరులను తెలంగాణ సమాజం మరిచిపోదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా.కె.విరమణాచారి అన్నారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో తేజ ఆర్ట్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో పత్రిక సంపాదకులు బైస దేవదాసు ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుల స్మృతి సంకలనం 'అక్షర నివాళి'ని ఆయన ఘనంగా ఆవిష్కరించారు. తొలి ప్రతిని ఆత్మబలిదానం చేసుకున్న శ్రీకాంతాచారి మాతృమూర్తి శంకరమ్మకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అమర వీరులకు అక్షర నివాళి కాదు ఇది అశృనివాళి అన్నారు. తెలంగాణ సాధలలో పోరాటం ఒక ఎత్తైతే.. యువకుల ఆత్మబలిదానం, త్యాగాన్ని మించింది లేదన్నారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ అధ్యక్షోపన్యాసం చేస్తూ అమరుల త్యాగాలు తెలంగాణ సమాజాన్ని ఏకం చేశాయన్నారు. ఆత్మహత్యలకు కారణం చంద్రబాబు ద్వంద్వ వైఖరి, నాటి రాజకీయ నాయకుల కుట్రలేనన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ తెలంగాణ పోరాటంలో కవులు, సాహితీవేత్తలు సభల్లో పాల్గొని ప్రజలను జాగృతం చేశారన్నారు. నేటి నిజం పత్రిక సంపాదకులు బైసా దేవదాస్ స్వాగతం పలుకుతూ కార్యక్రమ నేపథ్యాన్ని వివరించారు. శాతవాహన విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్ కడారు వీరారెడ్డి, సాహితీవేత్త డా. నాళేశ్వరం శంకరం, ఎన్.బి.టి.కార్యక్రమాధికారి డా.పత్తిపాక మోహన్, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.

## మనసుకు ధ్యాన్యం ప్రధానం

మనసుకు ధ్యానం ప్రధానమని ప్రభుత్వ సలహాదారు డా.కేవీ రమణాచారి అన్నారు. ఆంగ్లం నుంచి తెలుగుకు అనువాద గ్రంథం 'త్రిశక్తం' పుస్తకావిష్కరణ సభ గానసభలో జరిగింది. డా.చంద్రారెడ్డి (యూఎస్ఏ) రచించిన గ్రంథానికి డా.వద్దేపల్లి కృష్ణ అనువాదం చేశారు. త్రిశక్తం గ్రంథాన్ని కేవీ రమణాచారి ఆవిష్కరించారు. వద్దేపల్లిని రమణాచారి, ఓయూ తెలుగు శాఖ మాజీ అధ్యక్షుడు డా. చెన్నప్ప అభినందించారు. కార్యక్రమాన్ని 'కిన్నెర' నిర్వహించింది.

## టువార్డ్స్ ఏ వరల్డ్ ఆఫ్ ఈక్వల్స్ పుస్తకావిష్కరణ

అండర్ గ్రాడ్యుయేషన్‌లో తొలిసారిగా లింగ వివక్షతపై బైలింగ్విల్‌లో 'టువార్డ్స్ ఏ వరల్డ్ ఆఫ్ ఈక్వల్స్' అనే పాఠ్యపు పుస్తకాన్ని కేంద్ర మానవ వనరుల మంత్రి స్మృతి ఇరానీ ఆవిష్కరించారు. ఎన్ఐసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడియో సమావేశంలో ఆమె పుస్తకాన్ని ఆవిష్కరించారు.

## 'బాంద్రా బగ్గర్స్' పుస్తక పరిచయం

ప్రముఖ హాస్యరచయిత క్లెమెంట్ డిసిల్వా బ్లాగులతో కూడిన పలు కథల సంకలనంగా రూపొందించిన 'బాంద్రా బగ్గర్స్ అండ్ సన్స్' పుస్తకాన్ని నగరవాసులకు పరిచయం చేసేందుకు జూబ్లీహిల్స రోడ్ నుం1లోని సోడా బాటిల్ ఓపెనర్ వాలాలో గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముంబైలోని బాంద్రా ప్రాంతం బ్యాక్‌డ్రాప్‌గా మధ్య తరగతి జీవితంలో సాగే కథలను హాస్యంతో జోడించి పుస్తకంగా తయారు చేశామని రచయిత క్లెమెంట్ డిసిల్వా తెలిపారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఈ పుస్తకాన్ని విడుదల చేశామని, మంచి ఆదరణ లభిస్తోందిన ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పుస్తకంలోని కొన్ని సరదా సన్నివేశాలను థియేటర్ ఆర్ట్స్‌కు చెందిన ఆర్ఎస్.ప్రకాష్, విజయ్ మరూర్ చదివి వినిపించారు.

# కథల కానుపు..!

సాగరతీరం వెంట జీవనసమరం చేస్తూ, కథాసాగర మథనం కోసం అక్షర తపస్సులో మునిగిపోయిన కథకుడు చింతకింది శ్రీనివాసరావు, జీవనయానంలో భాగంగా జాలర్లు నడిసంద్రంలోకి వేటకు వెళతారు. అలాంటి సాహసమే ఇతని కథల్లో కనిపిస్తుంది. జీవనసాగరపు లోతుల్లోకి వెళ్ళి, మానవ సంవేదనల్ని కన్నీటి ముత్యాలుగా మూటగట్టి మనముందుంచుతాడు. ఉత్తరాంధ్ర మట్టిని వేదికగా మార్చుకుని భూగోళంలో దాగున్న మానవీయ పార్శ్వాలన్నింటినీ స్పర్శిస్తాడీ కథకుడు. నెత్తుటికన్నీళ్లతో తడిసిన కళింగాంధ్ర నేలలో మొలిచిన చింతనావృక్షం చింతకింది. 'దాలప్పతీర్థం' కథా సంపుటితో తెలుగుకథపై విశిష్టమైన ముద్ర వేసిన శ్రీనివాసరావు ఇప్పుడీ 'కాన్పుల దిబ్బ' కథలతో మరో కథనలోకంలోకి తీసుకెళుతున్నాడు.




ఈ కథలు చదివాక, నిరంతరం జీవితం చుట్టూ నిశిత పరిశీలనతో సంచరిస్తున్న ఒక ఉపగ్రహంలా చింతకింది అనిపించాడు. ఉత్తరాంధ్ర సామాజిక జీవనాన్ని, సాంస్కృతిక కోణాలను ఆవిష్కరించే వస్తువు చుట్టూ తిరుగుతున్నాడా?.. అనే అనుమానమూ కలుగుతుంది. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుడి చుట్టూ తిరిగినట్లుగా ఈ కథలు పరిభ్రమిస్తుంటాయి. నిజానికి, కళింగాంధ్ర స్థానీయ జీవితాల చుట్టూ తిరుగుతూనే ప్రపంచాన్ని చుట్టివస్తున్నాయీ కథలు. లోకంలోని చీకటివెలుగులన్నింటినీ తడుముతున్నాయి. ఈ కథా పరిభ్రమణంలో అనేక అనుభూతుల రుతువులు, తాత్విక కాలమానాలు కదిలిపోతుంటాయి.

ఈ కథలను చదివి పుస్తకం మూసేశాక కూడా పాత్రలు మన వెంటపడతాయి. పాత్రల ఆలోచనలు, సంఘర్షణలు, ఆవేదనలు, ప్రశ్నలు, ఆగ్రహాలు అన్నీ మనల్ని ముసురుకుంటాయి. పాత్రల అంతరంగంలోని అల్లకల్లోలాలు, సంఘటనలోని భావతీవ్రతలు మనసుకు బదిలీ అవుతాయి. దొడదోపిడి పంతులు ప్రగడావర్జుల నరసింహమూర్తి, పరమాత్ముడిలాంటి మేస్ట్రుబాబు, ఎలుగ్గొడ్డును చంపిన జాన్ మాస్టారు, అత్యాచారానికి గురైన వెంకటరత్నం, మొక్కల కోసం పేనం దీసుకున్న పాల్తేరు సినఎంకటి, అభిమానాన్ని కాపాడుకున్న ధనాలు, పందెం గెలవలేని మాదిగ మూలయ్యల పాత్ర చిత్రణలో రచయిత నైపుణ్యం కథలను ఏకబిగిన చదివిస్తుంది. వ్యక్తి కేంద్రకంగా కథ నడుస్తూనే విస్తృతమైన జీవితానుభవాలను ఆవిష్కరిస్తాడు కథకుడు. సమాజంలోని వ్యక్తుల స్వభావాలను పసిగట్టడంలో నేర్పరితనం సాధించిన చింతకింది, వాళ్ళను అలవోకగా కథలుగా మార్చుకుంటున్నాడు.

ఈ కథల్లోని పాత్రలను వర్ణించడంలోనూ, వాటి అంతరంగ విశ్లేషణలోనూ, నిష్కర్షగా, నిష్పక్షపాతంగా నిలబడతాడు రచయిత. 'పంటపూజ' కథలోని పౌరోహిత్యుడు ప్రగడావర్జుల నరసింహమూర్తిని పరిచయం చేస్తూ "క్రిమినల్ కర్మల్లో అతగాడికి మించిన దొడదోపిడి పంతులు మరొహడుండడు.. మూర్తికి మనసుండదని, ఆ మాట కొస్తే మనసే కాదు, శరీరం కూడా సరిగ్గా ఉండదని, శుచీశుభ్రత అస్సలే ఉండదని, వాణ్ణిబ్రేమ్మడుంటే మహాపాపం చుట్టుకుంటుంది" అని నిర్మొహమాటంగా వర్ణిస్తాడు. తనకథల్లో సమాజంలోని అన్ని కులాలను, వర్గాలను సందర్భానుసారంగా ప్రస్తావిస్తూ ఉంటాడు. ఈ ప్రస్తావనలో, లోకంలో స్థిరపడిన కులాల అనుకూల, ప్రతికూల లక్షణాలను రేఖామాత్రంగా వ్యాఖ్యానిస్తాడు. ఈ వరసలో ఆయా వర్గాల పాత్రల అత్మన్యూనతలను సైతం ధైర్యంగా విశ్లేషిస్తాడు.

"మావూరి కాపులు పులుల్లాంటోల్లు, మావూరి బేమ్మలు నక్కల్లాంటోల్లు. ఇంకా సెప్పాలంతే దొంగ వొరల్లాంటోల్లు. పేదోల్ని ఎలా పీడించీయాలో కాపులికి మప్పేది ఈ గొల్లిగోల్లే.." ఒక వాస్తవికతను దాచిపెట్టకుండా, ఏ స్థాయి రాజకీయ వ్యవస్థనైనా, ఆధిపత్య శక్తులనైనా నిర్భయంగా, నిజాయితీగా వ్యాఖ్యానించగలిగే వాడే నిజమైన రచయిత. అలాంటి నిజనిర్ధారణ రచయిత చింతకింది. కథకు ప్రాణం పోసేది సంఘటన. సహజమైన సంఘటన కథకు ఆత్మగా ప్రకాశిస్తుంది. అలాంటి ఆత్మగత సంఘటనల్ని సృష్టించి కథకు ఉన్నత స్థాయిని అందిస్తున్నాడీ రచయిత. కీలకమైన ఒక సంఘటనను సృష్టించి దాని చుట్టూ కథను అల్లుకునే పద్ధతికి భిన్నంగా కూడా కథను చెప్పగల స్థాయికి చేరుకున్నాడు. ప్రతిమాట, ప్రతివాక్యం, ఏదో ఒక అర్థస్ఫురణకు సంకేతంగా కదులుతూ ఘటనాత్మక అనుభూతిని కలిగిస్తుంది. చిన్న చిన్న సన్నివేశాలు నిశ్శబ్దంగా మనసులోకి ప్రవహించేటట్లుగా కథనం నడుస్తుంది.

'మేస్ట్రుబాబు మరినేరు!' కథలోని మేస్ట్రుబాబు పాఠకుల అంతరంగంలో ఆత్మీయుడిగా మారిపోయేది ఈ పద్ధతిలోనే. 'ఏనుగుసావు' కథలో రచయిత ఏం చెప్పాడసలు? యానాదుల ఏడుపు, శవయాత్రను ఆసక్తికర కథనంగా ఏ విధంగా మలచగలిగాడు? పాత్రోచిత ప్రవర్తనలు, సంభాషణలు సహజంగా తీర్చిదిద్దడంతో కథ పాఠకుని

హృదయానికి దగ్గరవుతుంది. అలాంటి దారుల్ని కనుక్కున్న కథాధారి చింతకింది.

కథను సంఘర్షణల్లో ముంచడంలో కథకుడు ఆరితేరాడు. పరస్పర విరుద్ధ భావాల మధ్య జరిగే ఆంతరంగిక అలజడే సంఘర్షణ. పాత్రల మధ్య వైరుధ్యాలను సృష్టించి, పటిష్టమైన వాద ప్రతివాదనలను వినిపిస్తూ కథలో సంఘర్షణాత్మక ధ్వనులను పాఠకుల్లో ప్రతిధ్వనులుగా మోగిస్తాడు. 'ఘోరం', 'కాన్పుల దిబ్బ' కథల్లోని సంఘర్షణ కేవలం పాత్రలవేనా? కథకోసం సంఘర్షణ ఒకవైపు నడుస్తూనే ఉంటుంది. వాస్తవ సమాజంలోని సంఘర్షణ మరింత తీవ్రంగా పునరావృతం అవుతూనే వుంటుంది. కథలోని సంఘర్షణకు సంతృప్తికర విరామం లేదు. పాలకసమాజంలో మానవీయ కదలికలు లేనంతకాలం ఈ సంఘర్షణకు విరామచిహ్నం లేదు. రచయిత కూడా విరామచిహ్నం స్థానంలో బరువైన ప్రశ్నార్థకాల్ని మన గుండెలమీద నాటుతాడు. 'పాదాలకు తగిలిన ప్రశ్నలు' కథలోని ప్రశ్నలు లోకం సాధించవలసిన లక్ష్యాలుగా నిర్ణయిస్తాడు.

ఈ కథకుడి కలంపొదిలో అనేక కథనాస్త్రాలు ఉన్నట్టే ఉంది. కథానుగుణమైన వాతావరణ చిత్రణ పాత్రల మనోస్థితిని ప్రతిబింబించే వర్ణనాత్మకతలోకి తీసుకెళుతుంది. అత్యాచారానికి గురైన వెంకటరత్నాన్ని వైద్యపరీక్షలు నిమిత్తం ఆసుపత్రి గదిలోకి తీసుకువెళ్లారు. "అక్కడ వాడేసిన దూదులు, పగిలిన సెలైన్‌బుడ్లు, పారేసిన సూదులు గదిమూల కుప్పగాజేరి భయంకరమైన కంపుకొడుతున్నాయి. గదిగోడల మీద బల్లులు వెంకటరత్నం మనసులాగానే బెదురుగొడ్డులా కాకరబీకరగా తిరుగుతున్నాయి" అని రచయిత చేసిన వర్ణన చదవగానే మనం ముక్కుమూసుకొని భయంగా గదినుంచి బయటకు పరుగెత్తుకుంటూ వస్తాం. వైద్యుల పరీక్షలు, పోలీసుల ప్రశ్నలు, సూటిపోటి మాటలతో అత్యాచారానికి గురైన వెంకటరత్నం, మరోసారి తనను అత్యాచారానికి గురిచేసినట్టుగా దుఃఖపడుతుంది. ఆ స్థితిలోని వెంకటరత్నం "నడిమిటి సూరీడులా ఎర్రగా కణకణలాడుతుంది. బెజవాడ కనకదుర్గమ్మలా, అనకాపల్లి నూకాల్తల్లిలా, చినమేరంగి చింతాలమ్మలా భయంకరంగా అగుపించింది. ఆ పిల్ల భయానక రూపాన్ని చూడలేకో ఏమో, సరిగ్గా అదే సమయానికి సూర్యుడు అస్తాద్రి చేరిపోతున్నాడు'. శరీరంలోని రక్త ప్రసరణలాగానే వర్ణనావాక్యాలు కథాశరీరంలో ప్రసారమవుతూ వుండాలి. కథాంతరంగంతో విడదీయలేని ప్రాణాధార వ్యవస్థలాగా వర్ణన, పరిపోషక పాత్రను నిర్వహించాలి. 'కాన్పుల దిబ్బ' కథాసంపుటిలో ఈ పరిపోషక వర్ణనలు శక్తివంతంగా చిత్రితమయ్యాయి.

ఒక పల్లెటూరును వర్ణిస్తూ.."బయట ప్రపంచమంతా కలసి బలంగా విసిరేస్తే మూలగా పడిపోయిన కుళ్ల గుమ్మడికాయలా ఉంటుంది " అంటాడు రచయిత. ఈ కథలన్నీ అలాంటి పల్లెటూరు నుంచే ఉద్భవించాయి. ఈ పల్లెటూరును కేంద్రంగా చేసుకుని సాధారణమైన కథావస్తువులోంచే ఎవరూ ఊహించలేని అద్భుతమైన విషయాలను వెల్లడిస్తూ మనుషుల మనస్తత్వాన్ని సూటిగా విశ్లేషిస్తాడు. పల్లె వేళ్ల నుండి మొదలై కార్పొరేట్ నగరం తలలోని

**కథను సంఘర్షణల్లో ముంచడంలో కథకుడు ఆరితేరాడు. పరస్పర విరుద్ధ భావాల మధ్య జరిగే ఆంతరంగిక అలజడే సంఘర్షణ. పాత్రల మధ్య వైరుధ్యాలను సృష్టించి, పటిష్టమైన వాద ప్రతివాదనలను వినిపిస్తూ కథలో సంఘర్షణాత్మక ధ్వనులను పాఠకుల్లో ప్రతిధ్వనులుగా మోగిస్తాడు. 'ఘోరం', 'కాన్పుల దిబ్బ' కథల్లోని సంఘర్షణ కేవలం పాత్రలవేనా? కథకోసం సంఘర్షణ ఒకవైపు నడుస్తూనే ఉంటుంది. వాస్తవ సమాజంలోని సంఘర్షణ మరింత తీవ్రంగా పునరావృతం అవుతూనే వుంటుంది.**

జీవనవైరుధ్యాలను వైవిధ్యమైన కథలుగా చెప్పగల రచనా శిల్పం ఈ కథల్లో తొణికిసలాడుతుంది.

ఈ కథకుడు తీర్చిదిద్దిన పాత్రలు సగటు మనుషులకు దగ్గరగా వుంటాయి. గొప్ప ఆత్మాభిమానాన్ని ప్రకటిస్తూ సహజంగా మాట్లాడతాయి. 'మూడు గుర్రాలు మూడయిదులు' కథలోని ధనాలు కాముకుడైన మహేశ్వరరావు వేధింపులకు తట్టుకుంటూ ఎంతో సున్నితంగా తన తిరస్కారాన్ని తెలుపుతుంది. " గంజినీల్లూ లేని ఎదవలం. ఏ జలమలో ఏ పాపంసేసినావో. మొత్తంగా సితికిపోనాం. మా నాటి అనాకానీవోల్లే తవరికి కావలసొచ్చినారేటి. పట్నంనించి ఎలిపోచ్చీనారు గదా. అక్కడొవుల్నేనా సూసుకోనేపోనారా. కూటికి నేపోతే నేపోవొచ్చు. వొల్లమ్ముకుని బతికీవోల్లం మాతరమూ గాదు." అని ఏడుపు, దిగులు, ఆవేదనలను దిగమింగుకుంటూ సమాధానమిస్తుంది. పాత్రలచేత సూటిగా, స్పష్టంగా మనోభిప్రాయాలను చెప్పించగల సంభాషణాచాతుర్యం ఈ కథల్లో కనిపిస్తుంది.

'పేనందీసుకున్న పాల్తేరు సినఎంకటి' కథలోని సినఎంకటి మాటలు కూడా సామాన్యమైనవా? గ్రామ దొరల మధ్య పగలు, ప్రతీకారాలు పెరిగిపోయి ఒకరి తోటలు మరొకరు నరికి వేయిస్తుంటారు. ఈ పనులు చేసి చేసి అందులోని తప్పును గ్రహించి పశ్చాత్తాపంతో సిన ఎంకటి, దొరగారికి చేసిన విన్నపాలు అందరూ వినవలిసిందే. "ఒక్కక్క మొక్కా నరుకుతుంతే మా యన్నదమ్ముల్ని, అక్కసెల్లెల్నీ సొయంగా నరికీసినట్టుంటంది. మనుసులు కాదు కాబట్టికి ఆట్నీ నరికితే నెత్తురూ గిత్తురూ రానేదు. అలగని ఆటికి పేనం లేదనగల్దువేటి. నిన్నగాక మొన్ననే నా కూతురికి ఆడబిడ్డ పుట్టీనాది. పురిట్లోనే ఆ సిన్నపిల్ల సచ్చిపోనాది. సచ్చిన బిడ్డనొట్టుకుని నా కూతురు ఎంతని దుక్కపడిపోనాదో సెప్పనేను. మరినాను నరికిన సిన్న సిన్న మొక్కల్ని వొట్టుకుని పెద్ద మొక్కలు అచ్చం అలాగే ఏడిసినాయో ఏటో. వొవులికి తెలుసు". సినఎంకటిలోని ప్రకృతి ప్రేమ, మొక్కల హృదయాలను అర్థం చేసుకునే సున్నిత మనస్కత, పర్యావరణ స్పృహ, ఉన్నత సంస్కారం, శ్రామికునిలో దాగున్న సౌందర్యాత్మకత ఏ నాగరీకుడిలో వున్నాయో వెతకాలి. సినఎంకటి చనిపోయినపుడు రుద్రభూమిలోని చెట్టూచేమా వాడి శవాన్ని చూసి కన్నీరు పెట్టుకున్నట్టుగా, చెట్లన్నీ తలలు దించుకుని ఏడుస్తున్నట్లుగా, నేలచూపులు చూస్తున్న ఆకులు కనిపిస్తున్నాయని వర్ణించిన సందర్భం ఔచిత్య

వంతం. సామాన్య వస్తువుగా అనిపిస్తూ, సాధారణ వ్యక్తులుగా కనిపిస్తూ, అసాధారణ ఔన్నత్యపు ఎత్తులకు కథను తీసుకువెళ్లడం ఈ రచనల్లో ఒక విశిష్టాంశం.

ఈ సంపుటిలోని 'మైనం' కథ చాలా ప్రత్యేకమైనది. రచయిత ప్రజాస్వామిక దృక్పథాన్ని, సామాజిక సహనశీలతని, దళిత వేదనని ఆవిష్కరిస్తుంది మైనం. మాదిగల జీవనంతో విడదీయరాని ఆత్మాను బంధానికి ప్రతీక డప్పు. ఆ డప్పును కేంద్రంగా చేసుకుని మూలయ్య పాత్ర ద్వారా దళితుల ఆత్మగౌరవాన్ని, పోరాటపటిమను ఉత్కంఠభరితంగా, ఉత్తేజపూరితంగా వ్యక్తపరుస్తాడు రచయిత.

"డబ్బున్నవాళ్లున్నా మావూరికి పేరు రాలేదు. చదువుకున్నోళ్లున్నా మా గ్రామానికి ఘనత రాలేదు. సొమ్మున్న మారాజుల వల్ల మా పల్లెకు ఏ వల్లకాదూ ఒరిగింది లేదు. మాదిగలు వాయించే డప్పుల కారణంగాను, బిళ్లపందాల ధర్మమానే మా పల్లెకు బోలెడంత పేరొచ్చింది." అని మాదిగలు తమ డప్పును గొప్పగా చెప్పుకునేవారు. ఆ డప్పు పందాల ద్వారానే మాదిగలను అణచాలనే అగ్రకులాల కుట్రలను మరోవైపు వెల్లడిస్తుంది ఈ కథ. తరతరాలుగా దళితులు ఏ విధంగా దొరల కుతంత్రాలకు మోసపోతున్నారో స్పష్టంగా బట్టబయలు చేస్తాడు రచయిత. ఈ కథలోని డప్పు శబ్దం మన ఎదలో ప్రతిధ్వనిస్తుంది. అందుకేనేమో అగ్రవర్ణాన్ని, అగ్రహారాన్ని పక్కనబెట్టి మట్టిమనుషులతో మమేకమయ్యే మానవతావాదిగా ఈ రచయిత అర్థమవుతాడు.

పాలేరు సినఎంకటి, మూలయ్య పాత్రలు ఆత్మహత్య చేసుకోవడం కథగా బాగుందేమో కానీ, కొత్తదైన ముగింపు కోసం ప్రయత్నించవలసిన అవసరమూ కనిపిస్తుంది. తమను తాము త్యాగం చేసుకోగల సాహసం స్థాయి నుండి కొత్తదారిలోకి పయనించవలసిన అవకాశాలు వున్న కాలంగా చెప్పవలసిన బాధ్యత రచయితలదే. చింతకింది, భాషకున్న శక్తిని అవగతం చేసుకున్నాడు. భాషకున్న పదునును అదునుగా సంపూర్ణంగా వినియోగించుకునే ప్రయత్నంలో మునిగిపోయాడు. ఇక ఈ కథల్లో కొత్త పదాలను, పద బంధాలను ప్రయోగించడంలో సఫలమయ్యాడు. భాషలో స్థిరపడిన నానుడులకు, వాక్యాలకు కొత్త కొనసాగింపులను చేశాడు. 'కామా ఫుల్‌స్టాప్ లేకుండా వాగాడు. కామానికీ ఫుల్‌స్టాప్ లేకుండా వాగాడు', 'బతికుంటే బలుసాకు, ఛస్తే తులసాకు', 'మూడు పిండాలు, ఆరు విస్తళ్లు' లాంటి వాక్యాలు ఆయా సందర్భాలకు, సన్నివేశాలకు ప్రాణం పోశాయి.

చింతకింది కథలో ఉత్తరాంధ్ర మాండలికం ఒక పాత్రగా కలగలసిపోయింది. పాత్రోచిత మాండలిక భాషా వైవిధ్యమంతా ఈ కథల్లో ప్రాణం పోసుకుంది. జీవద్భాషలోని ఆయువుపట్టును పట్టుకుని పాఠకులను ఒక ఆట ఆడిస్తున్నాడు. ఉత్తరాంధ్ర భాషలోని ఆల్కెమీని ఔపోసన పట్టాడు. రేపటి ఉత్తరాంధ్ర భాషా నిఘంటుకారులకు ఒక మూల గ్రంథంగా ఈ కథలు నిలబడతాయేమో? భూగోళమంత బరువైన రావిశాస్త్రి, అకాశమంత విస్తృతిగల పతంజలి అడుగుజాడలలో నడుస్తున్నాడు. వారి అడుగుల పక్కనే కొత్త ముద్రలను వేసే ప్రయత్నం చేస్తున్నాడు.

**"డబ్బున్నవాళ్లున్నా మావూరికి పేరు రాలేదు. చదువుకున్నోళ్లున్నా మా గ్రామానికి ఘనత రాలేదు. సొమ్మున్న మారాజుల వల్ల మా పల్లెకు ఏ వల్లకాదూ ఒరిగింది లేదు. మాదిగలు వాయించే డప్పుల కారణంగాను, బిళ్లపందాల ధర్మమానే మా పల్లెకు బోలెడంత పేరొచ్చింది." అని మాదిగలు తమ డప్పును గొప్పగా చెప్పుకునేవారు. ఆ డప్పు పందాల ద్వారానే మాదిగలను అణచాలనే అగ్రకులాల కుట్రలను మరోవైపు వెల్లడిస్తుంది ఈ కథ.**

కథలను ఏ పద్ధతిలో రాసినా అందులో మానవ జీవితం, వ్యక్తుల స్వభావం, ప్రాపంచిక సత్యాలు కనిపించాలి. తెలియని అనుభూతి తరంగాలు మనసుకు తగలాలి. అర్థంకాని జ్వరంతో ఒళ్లు వెచ్చబడాలి. బతుకులోని వేదనా నాడి దొరకాలి. గుండెల్లో దుఃఖచెలిమె ఊరాలి. అలాంటి అనుభవం ఈ కథల్లో దొరుకుతుంది. అది కొత్త స్థాయీభావంగా నిలబడుతుంది.

**- డా॥ ఎస్. రఘు**
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు
ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్
మొబైల్: 9848208533

## ప్రత్యేక దినాలు




### జులై2016 కొన్ని ముఖ్యమైన రోజులు

1: డాక్టర్స్ డే
2: ఇంటర్నేషనల్ డే ఆఫ్ కో-ఆపరేటివ్స్ (జులైలో మొదటి శనివారం)
6: వరల్డ్ జునోసిస్ డే
11: వరల్డ్ పాపులేషన్ డే
15: వరల్డ్ యూత్ స్కిల్స్ డే
18: నెల్సన్ మండేలా ఇంటర్నేషనల్ డే
28: వరల్డ్ హెపటైటిస్ డే
29: వరల్డ్ టైగర్ డే
30: వరల్డ్ డే అగైనెస్ట్ ట్రాఫికింగ్ ఇన్ పర్సన్స్

**(గమనిక: ఈ జాబితా సమగ్రం కాదు. కొన్ని 'స్పెషల్ డే'లను మాత్రమే ఇస్తున్నాం)**



పుస్తకం: అంబేద్కర్ - బుద్ధుడు
రచన: డాక్టర్ కత్తి పద్మారావు
వెల: రూ. 150/-
ప్రచురణ: లోకాయత్ ప్రచురణలు
ప్రతులకు : కత్తి స్వర్ణకుమారి, అంబేద్కర్ కాలనీ, పొన్నూరు, గుంటూరు జిల్లా. ఫోన్: 9849741695



పుస్తకం: అమృతం కురవని రాత్రి
రచన: చింతపట్ల సుదర్శన్
వెల: రూ. 75/-
ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, బండ్లగూడ, హైదరాబాద్
ఫోన్: 040-24224453



పుస్తకం: మబ్బులు వాలని నేల
రచన: సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి
వెల: రూ. 150/-
ప్రతులకు: ప్రజాశక్తి అన్ని పుస్తక కేంద్రాలు



పుస్తకం: దహనం
రచన: సాగర్ శ్రీరామకవచం
వెల: రూ. 80/-
ప్రతులకు: 8-1-21, జమ్మిచెట్టు బజార్, లాయర్‌పేట, ఒంగోలు
ఫోన్: 9885473934



పుస్తకం: తెహల్కా అద్దంలో సర్కారు బింబం
రచన: బాసిత్
వెల: రూ. 100/-
ప్రతులకు: హఫీజా భేగం, నెం.6-38/-, వివేక్‌నగర్ కాలనీ, కె.సి.కాలనీ, హనుమకొండ, వరంగల్. ఫోన్: 9491208617



పుస్తకం: పూలకుండీలు
రచన: శిరంశెట్టి కాంతారావు
వెల: రూ. 100/-
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలలో
ఫోన్: 08744 - 256167



పుస్తకం: బెత్తెడు జాగ
రచన: రావుల పుల్లాచారి
వెల: రూ. 120/-
ప్రతులకు: ఆర్.శరత్‌బాబు, దశరథరామ నిలయం, ఇం.నెం.9-34, ఇందిరామార్గం, హుజూరాబాద్, కరీంనగర్. ఫోన్: 9949208476



పుస్తకం: అగ్నిసుమం
రచన: కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ
వెల: రూ. 60/-
ప్రచురణ: అభ్యుదయ రచయితల సంఘం
ప్రతులకు: అన్ని విశాలాంధ్ర, నవచేతన శాఖలు,



పుస్తకం: పిట్టకు ఆహ్వానం
రచన: పట్వారి సుజాత
వెల: రూ. 50/-
ప్రతులకు: ప్రముఖ పుస్తకాల షాపుల్లో
ఫోన్: 9440927122



పుస్తకం: పేరులేని శ్రీమతులు
రచన: రెవ॥ సామ్యేల్‌బాబు బైరపోగు
వెల: రూ. 60/-
ప్రతులకు: ఎస్.యూనిక్ రెసిడెన్సీ, 202, సైదాబాద్, హైదరాబాద్.
ఫోన్: 9347256600

## పుస్తక పరిచయం

పుస్తక పరిచయం శీర్షిక ద్వారా వివిధ పుస్తకాలను పాఠకులకు పరిచయం చేసే ప్రయత్నం ఇది. ఈ వేదిక ద్వారా పాఠకులకు తమ పుస్తకాలను పరిచయం చేయాలనుకునే రచయితలు, ప్రచురణ సంస్థలు తమ పుస్తకాలు రెండు కాపీలను దిగువ చిరునామాకు పంపించవచ్చు. వీలు వెంట వాటిని ప్రచురిస్తాం. సమకాలీన సామాజిక అంశాలతో కూడిన కొత్త పుస్తకాలకు ప్రాధాన్యం.
పుస్తకాలు పంపించాల్సిన చిరునామా:

TELANGANA RESOURCE CENTRE

**DECCAN LAND :** **"CHANDRAM"** 490, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail: deccanlandindia@gmail.com www.deccanland.com











*Photographer :*
**Kommidi Vishwender Reddy**

ఫోటోగ్రాఫర్‌గా రాణించేందుకు ఆకర్షణీయమైన బ్యాంకు ఉద్యోగాన్ని సైతం వదులుకున్నారు కొమ్మిడి విశ్వేందర్‌రెడ్డి. ఫోటోగ్రఫీపై ఆయనకు ఉన్న అభిరుచికి ఇది నిదర్శనం. ఫోటోగ్రఫీలోని వివిధ విభాగాల్లో 30 ఏళ్ల అనుభవం ఆయన సొంతం. ఆలోచనలు రేకెత్తించే ఫోటోలు తీయడంలో ఆయన దిట్ట. తాను నిర్వహించే ప్రతీ ఫోటోగ్రాఫిక్ ఈవెంట్‌ను అత్యంత నైపుణ్యంతో, విజ్ఞానాన్ని అందించేలా, ఉత్సాహంతో నిర్వహించడం ఆయన విశిష్టత.

ప్రత్యేక కథనం: 28, 29వ పేజీలో..



















DECCAN LAND, Telugu Monthly Magazine 1- July - 2016
Postal Dates: 2nd & 3rd Every Month

RNI Regn. No. APTEL/2012/46784
Postal Permission, LII/RNP/HD/1167/2015-17


# JBR ARCHITECTURE COLLEGE
HYDERABAD




## About the School :

The JBR Architecture College is established in 2012 by Joginpally B R Educational Society (JBRES), Hyderabad. With a view to impart quality architectural education by a group of enthusiastic architects under the patronage of Late Sri. J.BHASKAR RAO garu devoted educationalist and philanthropist.

## Welcome to the New Campus of JBR Architecture College at Moinabad.

- JBR Architecture College campus is on an area with plush green & environ for students to explore their creativity.
- The campus complies with green building norms & is being rated by IGBC (Indian Green Building Council).
- State of facilities with spacious design studio's, Lecture rooms with audio visual facilities, Art courts, Material Museum, Labs, Workshops, Computer Lab including National & International Journals & E-Library, NASA & NATA rooms, Amphi Theatre, Canteen etc.
- A Construction yard for students to experiment with various design & construction techniques & Building material.
- Transportation available from across the city to the campus with 35 JBR Buses plying to & for all the campus (Medical, Engineering, Pharmacy, dental etc.)
- Regular study tours, site visits, guest lectures, seminars and workshops conducted.
- Highly qualified and experienced teaching staff as per COA norms.



*Director & Principal Ms. J. Gayatri*

## B. Arch Program

The J.B.R. Architecture college offers a graduate programme in Architecture. Bachelor of Architecture is a five year degree course with one year internship.

The program includes relevant courses in the concept, process, technical details and design practice, as well as elective in an area of student interest. The course work is to help the student understand finer aspects of Architecture which are very much integral to designing, planning and scheduling of buildings. The course work aims to impart quality education and making the students conscious of built form in the contemporary scenario.

## Eligibility

Students who qualify in NATA (National Aptitude Test in Architecture) conducted by council of Architecture (COA) with 10+2 (Maths stream) with minimum of 50% marks are eligible for admission into Bachelor of Architecture (B.Arch).

**JBR ARCHITECTURE COLLEGE**
HYDERABAD
2nd Floor, Bhaskar Plaza, Road No. 1,
Banjara Hills, Hyderabad, Telangana-500 034.
Phone : 040-66105270, email : jbrarchitecture@gmail.com


Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, St.No.11, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar